ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-7-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 162 పేజీలు: 10+4 వెల: 8.00

ఉత్పత్తి రంగమే ఉపాధి కల్పనకు మూలం: ప్రధాని
దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధితోనే 'వికసిత్ భారత్': అమిత్‌షా 5

## రిజర్వేషన్ల కోసం ఇంకా చేస్తా..

### అర్ధరాత్రి కూడా కేబినెట్‌తో చర్చిస్తా..

**కోటాను వ్యతిరేకించేవారికి సామాజిక బహిష్కరణ**

**9వ షెడ్యూలులో చేర్చి చట్టబద్ధత కల్పించాల్సింది కేంద్రమే**

కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, కృష్ణయ్య సాధించాలి: బిసి నేతల భేటీలో ముఖ్యమంత్రి రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై12:** వందేళ్ల బీసీల ఆకాంక్షను రాహుల్‌గాంధీ, ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నెరవేర్చిందని, బీసీ రిజర్వేషన్ గొప్ప కార్యక్రమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లకు 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాల్సింది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమని, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు లక్ష్మణ్, ఆర్.క్రిష్ణయ్య దీన్ని సాధించాలని కోరారు. స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ తీసుకువచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ బీసీ నేతలు శనివారం జూబ్లీహిల్స్‌లో కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ >>2



శనివారం నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీంకోర్టు సిజె బి.ఆర్. గవాయ్, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పి.ఎస్. నరసింహ, తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ వర్సిటీ ఛాన్సలర్ జస్టిస్ సుజయ్ పాల్, సిఎం రేవంత్ తదితరులు

## విదేశీ డిగ్రీల కోసం అప్పులు చేయొద్దు

### వాటివల్ల ప్రతిభ పెరగడం అపోహ మాత్రమే

**మనదేశంలోనే నాణ్యమైన న్యాయ విద్య**

**న్యాయవ్యవస్థలోనూ ఇక ఎఐ**

**నల్సార్ లా వర్సిటీ స్నాతకోత్సవంలో 'సుప్రీం' సిజె జస్టిస్ బిఆర్ గవాయ్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై12:** హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నరసింహ, తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ యూనివర్సిటీ ఛాన్సలర్ జస్టిస్ సుజయ్ పాల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీజేఐ గవాయ్ తన ప్రసంగంలో న్యాయరంగంలోకి ప్రవేశిస్తున్న యువ న్యాయవాదులకు, విద్యార్థులకు కీలక సలహాలు ఇచ్చారు. విదేశీ డిగ్రీల కోసం అప్పులు చేయవద్దని న్యాయ విద్యార్థులను, వారి కుటుంబాలను ఆయన హెచ్చరించారు, భారతదేశం నాణ్యమైన న్యాయ విద్యను అందిస్తుందని నొక్కి చెప్పారు. విదేశీ డిగ్రీలు ప్రతిభను పెంచుతాయనేది అపోహ అని, ఒకరి ప్రతిభ వారి పని ద్వారా నిరూపించుకోవాలని ఆయన అన్నారు. విదేశీ డిగ్రీల కోసం కుటుంబాలపై అప్పుల భారం మోపవద్దని ఆయన సూచించారు. న్యాయ వృత్తిలో అంకితభావం, ప్రజాసేవ యొక్క ప్రాముఖ్యతను కూడా ఆయన నొక్కి చెప్పారు. ఇక, నేడు న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా సీజేఐ గవాయ్ తన ప్రసంగంలో హైలైట్ చేశారు, భారతదేశం వివిధ న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొంటుందని, న్యాయవాదులు, న్యాయసేవలో ఉన్నవారు అందరి మాటలను జాగ్రత్తగా వినడం చాలా ముఖ్యం అని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో కృత్రిమ మేధస్సు (ఏఐ)ని ఉపయోగించుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, దీనిని >>2

## వేగంగా భూసేకరణ



శనివారం హైదరాబాద్‌లో నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి ఉత్తమ్

### సాగునీటి ప్రాజెక్టు పనులు త్వరితగతిన చేపట్టండి

**పునరావాస పనులపై దృష్టి పెట్టండి**

**అధికారులను ఆదేశించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పునరావాస పనులను త్వరితగతిన పూర్తి చేయలని సూచించారు. శనివారం సచివాలయంలో నీటిపారుదల శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని చట్టపరమైన, పాలనా పరమైన అంశాలను తక్షణమే పరిష్కరించే విదంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఇటు భూసేకరణ అటు పునరావాస పనులలో జాప్యం లేకుండా సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాల వారిగా ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించిన ఆయన నిర్మాణంలో ఎదురవుతున్న ఆటంకాలను అధిగమించేందుకు అధికార యంత్రాంగం పని చేయాలన్నారు. భూసేకరణలో జరుగుతున్న జాప్యంతో అంచనాలపై ప్రభావం చూపుతూ రెట్టింపు అబుతుందన్నారు. భూసేకరణలో ఎదురవుతున్న ఆటంకాలను అధిగమించేందుకు భూములు కోల్పోతున్న రైతులతో సహృద్భావ చర్చలు జరపాలని సూచించారు. నష్టపరిహారం, పునరావాసం వంటి అంశాలపై పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఎక్కడ నిరక్ష్యం వహించినా ప్రజావ్యతిరేకతతో పాటు న్యాయపరమైన చిక్కులు ఏర్పడతాయని, అటువంటి సునిశితమైన అంశాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఉద్బోధించారు. అదేవిధంగా ప్రాజెక్టుల నిర్మాణాలను ఆయన ప్రస్తావిస్తూ ఏజెన్సీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పనులను వేగవంతం చేయాలన్నారు. అదే సమయంలో పాలనా పరమైన >>2



## 15న శుక్లా భూమిపైకి

### కాలిఫోర్నియా తీరంలో వ్యోమగాముల లాండింగ్

**వారం రోజులపాటు క్వారంటైన్‌లోనే..**

**ఫ్లోరిడా(నాసా),జూలై 12:** యాక్సియం 4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్‌ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా సహా మరో ముగ్గురు 18 రోజుల యాత్ర అనంతరం జులై 15న భూమ్మీదకు తిరిగి రానున్నారు. జూలై 15న ఐఎస్‌ఎస్‌ను వీడి కాలిఫోర్నియా తీరంలో వ్యోమగాములు ల్యాండ్ అవ్వనున్నారు. వెంటనే నలుగురు వ్యోమగాములను వారం రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. క్రూ డ్రాగన్ అంతరిక్ష నౌకను తొలగించిన జూలై 15న మధ్యాహ్నం 3 గంటలకు కాలిఫోర్నియా తీరం సమీపంలో ముగ్గురు వ్యోమగాములు ల్యాండ్ అవుతారని ఇస్రో తెలిపింది. ల్యాండింగ్ తర్వాత భూ వాతావరణానికి వారి శరీరాలు అలవాటుపడేందుకు వీలుగా వైద్యాధికారుల పర్యవేక్షణలో సుమారు 7 రోజులు పునరావాసంలో ఉంటారని పేర్కొంది. వారం రోజుల పాటు ఇస్రోకు చెందిన >>2

## బిసిలకు బిఆర్ఎస్ ఏం చేసింది?

### రిజర్వేషన్ల పెంపు ప్రక్రియలో కవిత జైల్లో ఉన్నారు..

**కుల సర్వే, బిసికోటా కాంగ్రెస్ ప్రత్యేకం: పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై12:** బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను తాము చేపట్టిన సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జైలులో ఉన్నారని, ఆమె ఎప్పుడు పోరాటం చేశారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ బీసీ



శనివారం గాంధీభవన్‌లోన మీడియాతో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేష్ కుమార్. చిత్రంలో మల్లు రవి తదితరులు

రిజర్వేషన్ల పెంపు క్రెడిట్‌ను కవిత తీసుకోవడంపై స్పందించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్... బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఎప్పుడూ దృష్టి పెట్టలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన రిజర్వేషన్ల పెంపును కవిత తన విజయంగా చెప్పుకోవడం హాస్యాస్పదమని అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై ఆమె చెబుతున్న మాటలు విని తెలంగాణ సమాజం నవ్వుకుంటోందని ఎద్దేవా చేశారు. తీహార్ జైల్లో ఉన్న కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎప్పుడు పోరాటం చేశారని ప్రశ్నించారు. అసలు కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలని అన్నారు. ఇలాంటి నిర్ణయాలని అభినందించేందుకు కూడా కేసీఆర్‌కు మనసు రావడం లేదని విమర్శించారు. గతంలో ఎన్నో బిల్లుల విషయంలో బీఆర్ఎస్ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి మద్దతు పలికిందని తెలిపారు. కానీ బీసీలకు మేలు జరిగే ఈ నిర్ణయంపై మాత్రం నోరు మెదపడం లేదని విమర్శించారు. కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకొన్నట్లుగా విపక్షాల ధోరణి ఉందని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కవిత సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని మహేష్ కుమార్ గౌడ్ సెటైర్లు గుప్పించారు. కాంగ్రెస్ 42 శాతం రిజర్వేషన్లు చేసినప్పుడు కవితా లిక్కర్ >>2



## ఐరోపా కూటమి, మెక్సికోపై ట్రంప్ 30శాతం సుంకాలు

### ఆగస్టు నుంచి అమలు

**వాషింగ్టన్,జూలై 12:** ప్రపంచదేశాలపై అమెరికా టారిఫ్‌ల పరంపరం కొనసాగుతోంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శనివారం మరోఅడుగు ముందు కేసారు. యూరోపియన్ యూనియన్ (ఈయూ), మెక్సికోపై 30శాతం టారిఫ్‌లు విధిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు ట్రంప్ తన సోషల్‌మీడియా ఖాతా ట్రూత్ సోషల్ వేదికగా వెల్లడించారు. అలాగే, ఈయూ, మెక్సికో నాయకులకు లేఖలు పంపారు. 2024 అధ్యక్ష ఎన్నికల ప్రచారం నేపథ్యంలో ట్రంప్ తాను అధికారంలోకి వస్తే అమెరికా ఆర్థికవ్యవస్థను తిరిగి బలోపేతం చేస్తానన్న హామీ ఇచ్చారు. యూఎస్ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు ప్రపంచ దేశాలపై భారీ టారిఫ్‌లు విధించడమే దీనికి మార్గమని ఆయన భావిస్తున్నారు. పెరిగిన ఈ టారిఫ్‌లు ఆగస్టు 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ట్రంప్ టారిఫ్‌ల నిర్ణయంతో ప్రపంచ వాణిజ్య చట్టాలకు అమలు అనేది కష్టతరంగా మారిందని విశ్లేషకులు అంటున్నారు. వాస్తవంగా ఒక దేశం అన్ని దేశాలకు సమానంగా టారిఫ్‌లు విధించాల్సి ఉంటుంది. కానీ, అమెరికా ప్రత్యేకంగా కొన్ని దేశాలపై >>2

## హైదరాబాద్ శివార్లలో చిరుతల సంచారం!

### భయాందోళనలో పరిసర గ్రామాల ప్రజలు



చిరుత సంచారంపై వైరల్ అవుతున్న ఫొటో

**సరూర్‌నగర్, జూలై 12 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలో చిరుతల సంచారం ఉందని జరుగుతున్న ప్రచారం స్థానిక ప్రజల్లో కలకలం రేపుతున్నది. నగరానికి ఆనుకొని ఉన్న బాలాపూర్, మల్లాపూర్ గ్రామాల సమీపంలో వందలాది ఎకరాల్లో ఉన్న కేంద్ర రక్షణ పరిశోధన సంస్థ ఆర్‌సిఐ (రీసెర్చ్ సెంటర్ ఆఫ్ ఇమారత్)లో రెండు చిరుత పులులు తిరుగుతున్నాయనే విషయం వైరల్ కావడంతో అక్కడి ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వందల ఎకరాల్లో ఉన్న ఆర్‌సిఐకు చెందిన భూభాగంలో కొంత మేర గుట్టలు, భారీ వృక్షాలు, పచ్చనిబయళ్లు, చెట్లు, పొదలు, చిన్నపాటినీటి కుంటలతో పాటు జింకలు, నెమళ్లు, కుందేళ్లు తదితర జీవజాలంకూడా ఉన్నాయి. ఆర్‌సిఐలో పరిశోధన విభాగాలు, >>2

టీచర్ వేధింపులతో నిప్పంటించుకున్న విద్యార్థిని 7
95 శాతం గాయాలతో ఆసుపత్రికి తరలింపు




## కోర్సుల ఫీజులు, స్టైపెండ్ ప్రకటించాలి

### మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసి ఆదేశం

**తప్పుడు వివరాలు వెల్లడిస్తే కఠిన చర్యలు**

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో దేశంలోని ప్రైవేటు మెడికల్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీలకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) షాక్ ఇచ్చింది. ఇకపై అన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీలతోపాటు, డీమ్డ్ యూనివర్సిటీలో తమ కాలేజీల్లో ఏ కోర్సుకు ఎంత ఫీజు వసూలు చేస్తున్నారు, అలాగే జూనియర్, సీనియర్ డాక్టర్లకు ఇస్తున్న స్టయిఫండ్ వివరాలను తప్పకుండా వెల్లడించాలని ఆదేశించింది. ఒకవేళ వీటి వివరాలను వెల్లడించకపోతే ఆయా మెడికల్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీల కోర్సులను, అడ్మిషన్లను రద్దు చేస్తామని హెచ్చరించింది. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు మేరకు దేశంలోని అన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీలు >>2

## భద్రాచలం వద్ద 41 అడుగులు దాటిన గోదావరి

**చింతూరు-కూనవరం వద్ద నిండుకుండలా శబరి నది**

**లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు**

**చింతూరు ఏజెన్సీలో అధికారులు హైఅలర్ట్**

శనివారం చింతూరు వద్ద శబరి వరద దృశ్యం



## గోదావరి - శబరి నదులకు వరదపోటు

**చింతూరు, జులై 12, ప్రభాతవార్త:** గోదావరి-శబరి ఎగువ ప్రాంతాల్లో గత వారం రోజులుగా భారీ వర్షాలు దంచికొడుతున్నాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఒరిస్సాలో భారీ వర్షాలతో గోదావరి-శబరి నదులు ఉప్పొంగుతున్నాయి. భద్రాచలం వద్ద శనివారం సాయంత్రం గోదావరి నది నీటి మట్టం 41.1 అడుగులకు చేరింది. మహారాష్ట్రలో భారీ వర్షాలతో గోదావరి నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. ఇప్పటికే మహారాష్ట్రలోని బాబ్లి, జయక్వాడి ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరింది. అక్కడి నుండి తెలంగాణాలోని శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి, కాశేశ్వరం ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుంది. దాంతో సుమారు 10లక్షల క్యూసెక్కుల వరదనీటిని దిగువకు వదిలారు. అంతేగాక గోదావరి ఉపనదులైన పాణహిత, ఇంద్రావతి నదులతో పాటు సీలేరు, శబరి నదుల్లో భారీగా వరదనీరు చేరటంతో గోదావరి, శబరి నదుల నీటి మట్టం క్రమ క్రమంగా పెరుగుతుంది. గోదావరి నది నీటి మట్టం భద్రాచలం వద్ద 41.1 అడుగులు దాటగా, కూనవరంవద్ద శబరినది నీటిమట్టం 36 అడుగులు దాటింది. ప్రస్తుతం భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరినది నీటిమట్టం శనివారం రాత్రివరకు పెరిగి, ఆదివారం సాయత్రం వరకు నిలకడగాఉండి, తగ్గుముఖం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి, శబరి నదులకు >>2



శనివారం చింతూరు-వి.ఆర్.పురం మధ్య నీట మునిగిన రహదారి

# నదులకు వరదపోటు

>> వరద ముప్పు పొంచి ఉండటంతో అధికారులు అప్రమత్త మయ్యారు. గోదావరి,శబరి నదులు ఉప్పొంగటంతో చింతూరు-వి.ఆర్.పురం మండలాలను కలిపే రహదారి రెండు చోట్ల వరద నీటిలో మునిగిపోయింది.దాంతో అడవి వెంకన్నగూడెం- తుష్టివారి గూడెం, చింతరేవుపల్లి- కన్నాయిగూడెం గ్రామాల మధ్య గోదావరి వరదనీరు రోడ్డుపై ప్రమాదక పరిస్థితుల్లో ప్రవహిస్తుంది.కూనవరం మండలం టేకులబోరు-కొనరాజుపేట కావేజ్ మునిగిపోయింది. దాంతో అనేక గ్రామాలకు రహదారి సౌకర్యం లేకుండా పోయింది. చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ శనివారం కూనవరం, వి.ఆర్.పురం మండలాల్లోని లోతట్టు ప్రాంతాల్లో సూడిగాలి పర్యటన చేపట్టారు.వరద ముప్పును దృష్టిలో పెట్టుకోని ఎటువంటి పరిస్థితి తలెత్తినా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించటంతో పాటు పునరావాస కేంద్రాల్లో ప్రజలకు త్రాగునీరు, ఆసుపత్రుల్లో అత్యవసర మందులు, ఫ్లడ్ స్టాక్స్ నిల్వ వంటి అంశాలపై అధికారులకు ఆయన దిశానిర్దేశ్యం చేశారు.ఇప్పటికే కూనవరం వద్ద లాంచీలను సిద్దంగా ఉంచారు. వరద ముంపు ప్రాంతాల్లో, వరద సహాయక చర్యల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఇప్పటికే ఎన్.డి.ఆర్.యఫ్ బృందాలు సిద్దంగా ఉన్నాయని, ప్రజలు అధైర్య పడవద్దని పున:రావాస కేంద్రాల్లో సౌకర్యాలను మెరుగుపర్చటానికి చర్యలు తీసుకుంటామని పివో తెలిపారు. ప్రాజెక్టుఅధికారి పర్యటనలో యస్.డి.సిలు అంభేద్కర్, గోపాలకృష్ణరెడ్డి, కూనవరం. వి.ఆర్.పురం తాశీల్దార్లు,వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# చిరుతల సంచారం!

>> అధికారులు, ఉద్యోగుల కార్యాలయాలతో పాటు నివాస క్వార్టర్లు, ఇళ్లు, పాఠశాల, క్రీడా మైదానం కూడా ఉన్నాయి. అయితే ఆర్‌సిఐకు ఆనుకొని కుర్మల్‌గూడ ఉండగా సమీపంలో మల్లాపూర్, సుల్తాన్‌పూర్, బాలాపూర్ తదితర గ్రామాలున్నాయి. ఆర్‌సిఐకు ఆనుకొని మరో వైపు శ్రీశైలం హైవే రోడ్డు కూడా ఉంది. ఇదిలా ఉంటే రెండు రోజుల క్రితం ఆర్‌సిఐలో పని చేస్తున్న ఓ వాచ్‌మన్ తాను చిరుతల సంచారం చూశానని వెల్లడించడంతో అప్పటి నుండి కలకలం మొదలైంది. అవి తిరుగుతున్నట్లుగా సిసి ఫుటేజీ వైరల్ కావడం.. ఓ కుక్క సైతం ఆర్‌సిఐ పరిధిలో మృతి చెంది ఉండడం లాంటి విషయాలు చిరుతల సంచారం నిజమేనని భావనను కలగజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్‌సిఐలోని ఢిఫెన్స్ ల్యాబ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఏకంగా ఓ సర్క్యులర్ జారీ చేశారు. స్థానికంగా రెండు చిరుత పులులు సంచరిస్తున్నందున పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ఒంటరిగా బయటకు పంపవద్దని కూడా హెచ్చరించారు. తదుపరి సూచనలు చేసే వారు అప్రమత్తంగా ఉందాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించడం జరిగింది. అయితే ఆర్‌సిఐ పరిధిలో చిరుతలు తిరుగుతున్నాయనే దానిపై పోలీసులు, అటవీశాఖ అధికారులు అలర్ట్ అయ్యారు. ఆర్‌సిఐ అధికారులు అందించిన సమాచారం మేరకు చిరుతల సంచారంపై అటవీ శాఖ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఆర్‌సిఐలో వాటి కోసం గాలింపు.. పాదముద్రల కోసం అటవీ శాఖ వారు అన్వేషిస్తున్నట్లు తెలిసింది. ఆర్‌సిఐలో అసలు చిరుతలు ఉన్నాయా? లేవా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది.

## కిడ్నాప్‌ను ధైర్యంగా ప్రతిఘటించిన స్కూలు బాలిక!

**థాణె,జూలై 12:** భయానక కిడ్నాప్ యత్నం నుంచి 16 ఏళ్ల బాలిక ధైర్యంగా తప్పించుకున్న ఘటన మహారాష్ట్రలోని థానేలో సంచలనం సృష్టించింది. తనను కిడ్నాప్ చేయాలని ప్రయత్నించిన ఆటోరిక్షా డ్రైవర్‌ను బాలిక జామెట్రీ కంపాస్ (గణిత పరికరం)తో ప్రతిఘటించి, కదులుతున్న వాహనం నుంచే దూకి ప్రాణాలను రక్షించుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ సంఘటన జూలై 9న భివాండి ప్రాంతంలో చోటుచేసుకుంది. స్కూలుకు వెళ్లేందుకు ఆ బాలిక ఒక ఆటోరిక్షా ఎక్కింది. అయితే, డ్రైవర్ ఆమెను నిర్దేశించిన మార్గంలో కాకుండా వేరే మార్గంలో తీసుకెళ్లడం ప్రారంభించాడు. డ్రైవర్ ప్రవర్తనపై అనుమానం వచ్చిన బాలిక వెంటనే అతన్ని ప్రశ్నించింది. ఆటోరిక్షాను ఆపమని పదేపదే కోరినప్పటికీ, డ్రైవర్ బాలిక మాటలను పెడచెవిన పెట్టడమే కాకుండా, తన వేగాన్ని మరింత పెంచాడు. దీంతో బాలిక భయాందోళనకు గురైంది. ఆ పరిస్థితిలో, తన దగ్గర ఉన్న జామెట్రీ కంపాస్‌ను ఆత్మరక్షణ కోసం ఉపయోగించాలని బాలిక నిర్ణయించుకుంది. ఆమె ఎటువంటి సంకోచం లేకుండా ఆ డ్రైవర్‌ను ఆ కంపాస్‌తో ప్రతిఘటించింది. ఆ డ్రైవర్‌పై కంపాస్‌తో దాడి చేయడం ద్వారా అతన్ని ఒక క్షణం పాటు దిగ్భ్రాంతికి గురిచేసింది. ఇదే అవకాశంగా భావించిన ఆ బాలిక, తన ప్రాణాలను రక్షించుకోవడానికి చివరి ప్రయత్నంగా, కదులుతున్న ఆటోరిక్షా నుంచే బయటకు దూకేసింది. ఆమె రోడ్డుపై పడిపోయినప్పటికీ, స్వల్ప గాయాలతో క్షేమంగా బయటపడింది. బాలిక అపాయం నుంచి బయటపడిన అనంతరం తన తల్లికి సమాచారం అందించింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన పోలీసులు, బాలిక ఇచ్చిన వివరాల ఆధారంగా కేసు నమోదుచేశారు. ఆటోరిక్షా డ్రైవర్‌పై కిడ్నాప్ యత్నం, దాడి ఆరోపణల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని పట్టుకోవడానికి అన్ని కోణాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నారు.

## సిట్ విచారణకు హాజరుకాని విజయసాయి

**విజయవాడ,జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో సిట్ విచారణకు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి హాజరు కాలేదు,మరో రోజు వస్తానని సిట్‌కు విజయసాయిరెడ్డి తెలిపారు.వాస్తవానికి లిక్కరు స్కామ్‌లో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి శనివారం విచారణకు హాజరుకావాల్సి ఉంది. అయితే తాను విచారణకు రాలేనని సిట్ అధికారులకు సమాచారం ఇచ్చారు మాజీ ఎంపీ. తనకు ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉండటం వలన రాలేకపోతున్నట్లు విజయసాయి సమాచారం పంపారు. తాను రేపో మాపో విచారణకు వచ్చే తేదీని తెలియజేస్తానని చెప్పారు. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఒకసారి సిట్ ముందు మాజీ ఎంపీ విచారణకు హాజరయ్యారు. ఈరోజు సిట్ ముందుకు విజయసాయి రావాల్సి ఉంది .రాలేదు. ఈ సందర్భంలో సామాజిక మాధ్యమం ఎక్స్‌లో విజయసాయిరెడ్డి ఆసక్తికరమైన పోస్ట్ చేశారు. ఎవరైతే కర్మను చేస్తారో వారు అనుభవించక తప్పదు అనే విధంగా భగవద్గీతకు సంబంధించి ఓ శ్లోకాన్ని ఆయన పోస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఏప్రిల్ 18న విజయసాయిని తొలిసారి సిట్ అధికారులు ప్రశ్నించారు. గత విచారణలో కీలక సూత్రధారులు, పాత్రధారుల పేర్లను మాజీ ఎంపీ వెల్లడించారు.

## ఐరోపా కూటమి, మెక్సికోపై ట్రంప్ 30శాతం సుంకాలు

>> అధిక సుంకాలు విధిస్తోంది. ఈ విధానాన్ని నిపుణులు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటివరకు ట్రంప్ 24 దేశాలపై, తాజాగా 27 దేశాల కూటమి ఈయూపై టారిఫ్‌లు ప్రకటించారు. మెక్సికోకు రాసిన లేఖలో ఆ దేశంపై తీవ్రమైన ఆరోపణలు గుప్పించారు. అక్రమ వలసదారులు, ఫెంటనిల్ మత్తుపదార్థాల ప్రవాహాన్ని అడ్డుకునేందుకు అమెరికాకు మెక్సికో సహకరిస్తోందని ట్రంప్ లేఖలో పేర్కొన్నారు. కానీ ఇప్పటికీ మెక్సికో బలమైన చర్యలు తీసుకోలేదన్నారు. అంతేకాకుండా, ఉత్తర అమెరికా నార్కో ట్రాఫికింగ్ ప్లేగ్రౌండ్‌గా మెక్సికో మారుతుందని చెప్పారు. అమెరికాఈయూ మధ్య వాణిజ్యలోటు జాతీయ భద్రతకు ముప్పుగా మారిందని ఈయూకు రాసిన లేఖలో ట్రంప్ పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్‌తో మా వాణిజ్య సంబంధాలు పరస్పరం ప్రయోజనకరంగా లేవు. ఈయూ విధించే టారిఫ్‌లు, వాణిజ్య అవరోధాల కారణంగా ఏర్పడిన దీర్ఘకాలిక, భారీ, స్థిరమైన వ్యాపార లోటులను తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2022లో ఈయూ నుంచి అమెరికా 553 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను దిగుమతి చేసుకుంది. ఇది ప్రపంచంలోనే అత్యధికం. ఇప్పటికే ఈయూపై అమెరికా 10శాతం ప్రాథమిక టారిఫ్‌లు విధిస్తోంది. ఏప్రిల్ 2న ట్రంప్ 20శాతం టారిఫ్ ప్రతిపాదించారు. చర్చలు వేగంగా సాగకపోతే దానిని 50శాతానికి పెంచుతామని హెచ్చరించారు. అయితే ప్రస్తుతానికి అయితే 10శాతం ప్రాథమిక టారిఫ్, కార్లపై 25శాతం, ఉక్కు-అల్యూమినియంపై 50శాతం ఉన్నట్లు తెలుస్తోంది.

## వారం - వర్జ్యం

**13-07-2025, ఆదివారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**ఆషాఢ మాసం, ఉత్తరాయణం,**
**గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం**
తదియ రా.1.03
శ్రవణం ఉ.6.53
వర్జ్యం : ఉ.8.11-9.40
దు.సా.4.18-5.05
శుభసమయం:ఉ.6.30-7.15, సా.6.30-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** విద్యార్థి విద్యార్థులకు నూతన విద్యావకాశాలు పొందుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో నిదానం చాలా అవసరం.

**వృషభం :** స్థిరాస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకొంటాయి. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మిథునం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకొంటారు.

**కర్కాటకం:** స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటుపోట్లు కొంతవరకు తీరుతాయి.

**సింహం:** ప్రముఖ వ్యక్తులతో పరిచయాలు ఏర్పడి కొన్ని ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**కన్య :** జీవిత భాగస్వామి సలహాతో కీలక నిర్ణయాలు తీసుకొంటారు. వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు.

**తుల :** సంఘంలో ఆదరణ పొందుతారు. ఉద్యోగాలలో స్వల్ప స్థానచలనం పొందుతారు.

**వృశ్చికం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్నా అవసరాలు డబ్బు అందుతుంది. సోదరుల నుండి శుభవార్తలు.

**ధనుస్సు:** పట్టుదలతో ముందుకు సాగుతారు. తొందరపాటు నిర్ణయాలు తగదు.

**మకరం:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకొంటారు. తలచినదొకటి జరిగేది మరొకటిగా ఉంటుంది.

**కుంభం:**కొత్త కార్యక్రమాలు చేపట్టినా ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. సన్నిహితుల సాయంతో పూర్తిచేస్తారు.

**మీనం :** కీలక నిర్ణయాలలో ఆచితూచి మసలుకోండి. సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రిజర్వేషన్ల కోసం ఇంకా చేస్తా..

>> కార్యక్రమం లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,మంత్రులు కొండా సురేఖ,జూపల్లి కృష్ణా రావు,సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిసీ నేతలతో సిఎం మాట్లాడుతూ మోడీ స్థానంలో రాహుల్‌గాంధీ ఉంటే 48 గంటల్లో నేను రిజర్వేషన్లు సాధించుకు వచ్చేవాడినని చెప్పారు. ప్రధాని మోడీని తెలంగాణకు చెందిన బిజెపి మంత్రులు ప్రశ్నించాలని, బిజెపి నాయకులు వాళ్ల నిబద్ధతను చూపించాలని సూచించారు. రిజర్వేషన్ల కోసం ఇంకా ఏం చేయాలన్నా నేను సిద్ధం... ఏం చేయాలో చెప్పండి... అర్ధరాత్రి కూడా నా మంత్రివర్గం సమావేశం ఏర్పాటు చేస్తా అని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో నన్ను ప్రశ్నించే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదని, నా నిబద్ధతను ప్రశ్నించలేరన్నారు. నెల రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు చేయాలని హైకోర్టు ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించిందన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసమే ఇంతకాలం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేశామన్నారు. 50శాతానికి మించి రిజర్వేషన్లు పెంచొద్దని గత కెసిఆర్ ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టం చేసిందని, ఈ చట్టం చేసినప్పుడు మంత్రులుగా గంగుల కమలాకర్,శ్రీనివాస్‌గౌడ్,తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఉన్నారని, కెసిఆర్ ఇప్పుడు వాళ్లను మా పైకి ఉసిగొల్పుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చట్టంలో పేర్కొన్న 50శాతం నిబంధనను సవరిస్తూ మేం ఇప్పుడు ఆర్డినెన్స్ తీసుకొచ్చామని స్పష్టం చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని తాపత్రయం పడుతున్నది నేను, నాకు తోడుగా ఉండండి, రక్షణ కవచంలా ఉండి రిజర్వేషన్లను కాపాడుకోవాలని పేర్కొన్నారు. రిజర్వేషన్లపై ఎవరైనా కోర్టుకు వెళ్తే వాదించడానికి ఢిల్లీ నుంచి ఉద్దండులైన న్యాయవాదులను వాదనల కోసం నియమిస్తానని చెప్పారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కాగితం పెట్టిన వాళ్లని,కాగితం పెట్టించిన వాళ్లను సామాజిక బహిష్కరణ చేస్తామని ప్రకటించండి అని బీసీ నేతలకు పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ ఫలాలను ఆయా వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని, ఇది కాంగ్రెస్ పార్టీ విజయం, బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఎక్కడా బీసీ లకు రిజర్వేషన్లు కల్పించలేదని చెప్పారు. 42శాతం బీసీ రిజర్వేషన్లపైన కాంగ్రెస్ ఎంపిలతో పాటు ఇండియా కూటమి ఎంపీలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామన్నారు. అన్ని రాష్ట్రాల్లో రిజర్వేషన్లు అమలు అయితేనే నిజమైన విజయమని, 2029 ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లే ప్రధాన అజెండా కావాలని పేర్కొన్నారు.ఆనాడు దళితులు,వెనుకబడిన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు కల్పించిందని, కులగణన చేస్తామని రాహుల్‌గాంధీ తన భారత్ జోడో యాత్రలో స్పష్టం చేశారని, రాహుల్‌గాంధీ మాట మాకు శిలాశాసనమని,నాయకుడు మాట ఇస్తే దానిని నెరవేర్చాల్సిన బాధ్యత నాది, మా పిసిసి అధ్యక్షుడిదిని పేర్కొన్నారు. కులగణన పైన ఎన్నో అవాంతరాలు వచ్చినా వాటిని అధిగమించామని, యేడాదిలో పూర్తి పారదర్శకంగా,పక్కాగా కులగణన పూర్తి చేశామన్నారు.కులగణన చాలా పకడ్బందీగా చేశాం, వ్యక్తులు స్వయంగా తమ వివరాలను డిక్లేర్ చేశారు, కులగణన డేటా 100 శాతం డిజిటలైజేషన్ చేశామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. భవిషత్తులో ఎవరూ ఛాలెంజ్ చేయడానికి వీలు లేకుండా డేటా భద్రపరిచామని తెలిపారు. దేశంలో తెలంగాణ కులగణన బెస్ట్ మోడల్ అని స్పష్టం చేశారు. దేశానికి తెలంగాణ కులగణన రోల్ మోడల్ అని రాహుల్ గాంధీ కొనియాడారని గుర్తు చేశారు.



శనివారం సిఎం రేవంత్‌కు అభినందనలు తెలుపుతున్న బిసి సంఘాల నేతలు

# 15న శుక్లా భూమిపైకి

>> వైద్యాధికారులు వ్యోమగాముల ఆరోగ్యం, ఫిట్‌నెస్ నిరంతరం పర్యవేక్షిస్తారని వెల్లడించింది. అంతరిక్షం నుంచి భూమికి బయల్దేరే ముందు కూడా వారికి పలు ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తారని స్పష్టం చేసింది. శుభాంశు శుక్లా మంచి ఆరోగ్యంగా, ఉత్సాహంతో ఉన్నారని వెల్లడించింది. కాగా, శుభాంశు శుక్లా రోదసీ యాత్ర కోసం ఇస్రో సుమారు రూ. 550 కోట్లు ఖర్చు చేసింది. అతడి యాత్ర అనుభవం 2027లో మానవ అంతరిక్ష ప్రయాణ కార్యక్రమం గగన్ యాన్‌ను ప్లాన్ చేయడంలో, అమలుకు పనికొస్తుందని భావిస్తోంది. మరోవైపు, డ్రాగన్ వ్యోమ నౌక 580 పౌండ్ల కంటే ఎక్కువ కార్గోతో భూమ్మీదకు తిరిగి వస్తుందని నాసా తెలిపింది. ఇందులో నాసా హార్డ్ వేర్, మిషన్ అంతటా నిర్వహించిన 60 కి పైగా ప్రయోగాల డేటా ఉందని పేర్కొంది. రీహైడ్రేటెడ్ రొయ్యల కాక్ టెయిల్స్, మంచి సహచరులతో స్పేస్ స్టేషన్‌లో మా చివరి కొన్ని రోజులను ఆస్వాదిస్తున్నాము అని యాక్సియం 4 మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాగా, శుభాంశు శుక్లా తోటి వ్యోమగాములకు పార్టీ ఇచ్చారు. తన వెంట తెచ్చిన క్యారెట్ హల్వా, మామిడి తాండ్రను వ్యోమగాములకు వడ్డించారు. అలాగే మైక్రోఆల్గే అనే సూక్ష్మ జీవులపై ప్రయోగం చేశారు. వీటికి జీరో గ్రావిటీలో ఆహారం, ఆక్సిజన్, జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని పరిశీలించినట్లు యాక్సియం స్పేస్ తెలిపింది. అలాగే వ్యోమగాముల బృందం వాయోజర్ డిస్ప్లేస్ అధ్యయనాన్ని చేసింది. ఇది అంతరిక్ష ప్రయాణం కంటి కదలికలు, సమన్వయాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో తెలియజేస్తుంది. అలాగే ఐఎస్ఎస్‌లో మానవ రక్త ప్రవాహంపై పరీక్షలు జరిపారు. మైక్రోగ్రావిటీ, పెరిగిన కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు హృదయనాళ పనితీరును ఎలా ప్రభావితం చేస్తాయో పరిశీలించారు. యాక్సియం4 మిషన్ ద్వారా శుభాంశుతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీవిస్నియెస్కీ, టిబర్ కపు ఫ్లోరిడాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి గతనెల 25న అంతరిక్షంలోకి వెళ్లారు. ఐఎస్ఎస్‌లో దాదాపు 60కి ప్రయోగాలు నిర్వహించారు. ఈ క్రమంలో 18 రోజుల రోదసి యాత్ర అనంతరం జూన్ 15న తిరిగి భూమ్మీదకు వస్తున్నారు. దాదాపు గత 2 వారాలుగా ఐఎస్ఎస్‌లో ఉన్న శుభాంశు శుక్లా ఏకంగా 96.5 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు యాక్సియం స్పేస్ ఇటీవలే వెల్లడించింది. వ్యోమగాములు ఇప్పటివరకు దాదాపు 230 సార్లు భూమిని చుట్టి వచ్చారని స్పష్టం చేసింది.



గురుతేగ్ బహదూర్ 350వ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం లక్నోలో 'బలిదాన్ సందేశ్ యాత్ర'ను ప్రారంభించిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్

# విదేశీ డిగ్రీల కోసం అప్పులు చేయొద్దు

>> సరిగ్గా ఉపయోగించుకుంటే తీర్పులను వేగంగా అందించడంలో సహాయపడుతుందని సీజేఐ తెలిపారు. న్యాయవాద వృత్తి అనేక సవాళ్లతో కూడుకున్నదని, న్యాయవాదులు ఎప్పటికప్పుడు,తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కోర్టుల తీర్పులపై పూర్తి అవగాహన కలిగి ఉండటం అవసరమని న్యాయవాదులకు సూచించారు. నేటి తరంలో న్యాయ విద్యను అభ్యసించేవారి సంఖ్య పెరుగుతోందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,డేటా ప్రైవేసీ వంటి కొత్త సాంకేతిక అంశాలు అనేక అవకాశాల, సవాళ్లను తెస్తున్నాయని పేర్కొన్నారు. సరైన మార్గదర్శకత్వం ద్వారా మాత్రమే నైపుణ్యం పెంపొందుతుందని, మెంటాంషిప్‌ను ఒక బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. వృత్తిని,చేసే పని పట్ల ప్రేమ ఉండాలని, అలా ఉన్నప్పుడు మాత్రమే విజయం సాధించగలుగుతామని అన్నారు. ఇప్పటి న్యాయవ్యవస్థలో ఎదుర్కొంటున్న ముఖ్యమైన సవాళ్లలో ఒకటి.. కొన్ని కేసుల విచారణ చాలా సంవత్సరాల పాటు కొనసాగడం క్షోభ కలిగించేదిగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# బిసిలకు బిఆర్ఎస్ ఏం చేసింది?

>> స్కాంలో ఊసలు లెక్కపెడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి ఎవరికి కట్టబెట్టారని ప్రశ్నించారు. బీసీలపై బీజేపీ చిత్త శుద్ధి ఏంటో తేలిపోయిందని విమర్శించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే బీసీలకి రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే అని తాము పదే పదే ఏఐసీసీ హై కమాండ్ దగ్గర పట్టుబట్టడం జరిగిందని గుర్తుచేశారు. తన కోరికను, రాహుల్‌గాంధీ ఆశయాన్ని నెరవేర్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఎవరూ దొంగలు..?, హీరోలు..? అన్నది తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్‌తోనే సాధ్యమని నొక్కిచెప్పారు. బీసీలకు చాంపియన్ కాంగ్రెస్... తమ హీరో రాహుల్ గాంధీ.. సీఎం రేవంత్‌రెడ్డి, తాము రాహుల్‌గాంధీ సైనికులమని ఉద్ఘాటించారు. కవిత ఏ పార్టీలో ఉందో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌లో దెయ్యాలు ఉన్నాయని చెప్పిన కవిత వారి పేర్లు ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి దెయ్యాలు పోయాయా? ఉన్నాయా చెప్పాలని ప్రశ్నించారు. తాము బీసీ రిజర్వేషన్లు తెస్తే కవిత రంగులు పూసుకొని తీన్మార్ డ్యాన్సులు చేస్తోందని సెటైర్లు గుప్పించారు. బీఆర్ఎస్ హయాంలో సామాజిక తెలంగాణ రాలేదన్న కవిత ఆపార్టీకి రాజీనామా ఎందుకుచేయడంలేదని ప్రశ్నించారు.

## వెలుగులోకి మరో భయానక కోవిడ్ వైరస్

### 30శాతం కేసులకు కొత్త 'స్ట్రాటస్' వేరియంట్ మూలం

**న్యూఢిల్లీ, జూలై 12:** ప్రమాదకరమైన కరోనా వైరస్ మళ్లీ విజృంభిస్తోంది. కొత్తగా స్ట్రాటస్ అనే కోవిడ్-19 ఉపవైరస్ వెలుగులోకి వచ్చింది. వ్యాక్సిన్లద్వారా వచ్చిన రోగనిరోధకశక్తిని కూడా తట్టుకుని వ్యాప్తిచెందుతుందని, అన్ని వయసులవారిని ఆవహించే ప్రమాదం ఉందని వైద్యరంగనిపుణులు చెపుతున్నారు. కరోనవైరస్ నిరంతరం పరివర్తనంచెందుతోంది. ప్రపంచ ఆరోగ్యరంగాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఎక్స్ ఎఫ్‌జి జాతికి స్ట్రాటస్ అనే మారుపేరుపెట్టారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ ఈ ఉప వేరియంట్‌ను పర్యవేక్షణలో ఉంచిన వేరియంట్‌గా వెల్లడించింది. ఆగ్నేయాసియా దేశాల్లో ఈకేసులు విస్తరణకు ఈ స్ట్రాస్ కారణమని తెలిపింది. ఇన్ఫెక్షన్లు వేగంగాపెరుగుతున్నప్పటికీ అనారోగ్యం, మరణాలు తక్కువగా ఉంటాయని చెపుతున్నారు. యుకెలోని ఈకేసుల తీవ్రత ఎక్కువ ఉంది. ఇక్కడ స్ట్రాటస్ కరోనాజాతి అధికారికంగా ఎక్స్ఎఫ్‌జితోపాటు ఎక్స్ఎఫ్‌జి.3 కింద వర్గీకరించారు. ఈ రెండు వేరియంట్లు ఇపుడు ఇంగ్లండ్‌లో 30శాతం కొవిడ్‌కేసులకు కారణం అవుతున్నట్లు వైద్యనిపుణులు చెప్పారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదికల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా గతనెలనాటికి ప్రపంచంలో 23శాతం కొవిడ్19 కేసులకు ఈస్ట్రాటస్ ఉప వేరియంట్ కారణమైనట్లు నిర్ధారించారు.

## కోర్సుల ఫీజులు, స్టైపెండ్ ప్రకటించాలి

>> తాము అందిస్తున్న కోర్సులకి సంబంధించి.. కోర్సు వారీగా ఫీజులను దాంతోపాటు జూనియర్, సీనియర్ డాక్టర్లకు ఇస్తున్న స్టయిఫండ్ వివరాలను తప్పకుండా వారి వెబ్‌సైట్‌లో పొందుపరచాలని ఎన్ఎంసి కాలేజీలను ఆదేశించింది. ప్రైవేటు మెడికల్ కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీలు కోర్సు ఫీజు వివరాలను, స్టయిఫండ్ వివరాలను వెల్లడించకపోతే కాలేజీలకు షోకాజ్ నోటీసు ఇవ్వడంతోపాటు భారీగా జరిమానాను విధించడం, కోర్సు గుర్తింపు రద్దుతోపాటు అడ్మిషన్లను రద్దు చేసే చర్యలు చేపట్టనున్నట్లు ఎన్ఎంసి కాలేజీలు, డీమ్డ్ యూనివర్సిటీలకు రాసిన లేఖల్లో పేర్కొంది.

**ఫ్యాకల్టీ వివరాలను అప్‌డేట్ చేయాలి..**

ఎన్ఎంసికి చెందిన మెడికల్ అసెస్‌మెంట్, రేటింగ్ బోర్డ్ జూలై 23, 2024న జారీ చేసిన పబ్లిక్ నోటీసు ప్రకారం.. అన్ని వైద్య కళాశాలలు, ఆరోగ్య సంస్థలు ప్రతి విభాగానికి సంబంధించిన సమగ్ర అధ్యాపక వివరాలను వారి అధికారిక వెబ్‌సైట్‌లలో అప్‌డేట్ చేయాలని ఎన్ఎంసి ఆదేశించింది. ఫ్యాకల్టీ వివరాలను ప్రతి విభాగం కింద విడిగా జాబితా చేయాలని.. ఒకవేళ మెడికల్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్, డీన్ ఏదైనా విభాగానికి చెందినవారైతే.. వారిని సంబంధిత విభాగం కింద కూడా చేర్చాలని సూచించింది. ఫ్యాకల్టీ వివరాలను వెల్లడించకపోవడం, తప్పుగా వెల్లడించినట్టయితే సంబంధిత వైద్య సంస్థపై చర్యలు తీసుకోనున్నట్టు ఎన్ఎంసి స్పష్టం చేసింది.

## వేగంగాభూసేకరణ

>> అంశాలలో ఎటువంటి పోరాబాట్లకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పనులలో అలసత్వం వహిస్తే అంచనాలు పెరుగుతాయన్నారు. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల పూర్తికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో సంభవిస్తున్న నీటి ప్రవహాలతో రాష్ట్రంలోని జలాశయాలలో పెరుగుతున్న నీటి మట్టాలపై మంత్రి ఆరా తీశారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు నీటి మట్టాలను గమనించాలన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణాలలో టన్నెల్ నిర్మాణాలు కీలకంగా మరాయని, అటువంటి టన్నెల్ నిర్మాణాలలో అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు గాను తెలంగాణా నీటిపారుదల శాఖలో భారత సైన్యంలో పని చేస్తున్న ఇద్దరు ఇంజినీరింగ్ నిపుణులను చేర్చుకోబోతున్నట్లు మంత్రి వెల్లడించారు. భారత సేన మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ జనరల్ హార్పల్ సింగ్ నీటిపారుదల శాఖలో గౌరవ సలహాదారుగా, అంతర్జాతీయ స్థాయిలో టన్నెల్ ఇంజినీరింగ్ నిపుణుడిగా ప్రసిద్ధి చెందిన కల్నల్ పరిక్షి త్ మెహ్రాలు నీటిపారుదల శాఖల్లో చేరుతున్నట్లు తెలిపారు. భారతదేశంలో అత్యంత క్లిష్టమైన రోహ్తాంగ్, జోజిలా టన్నెల్ నిర్మాణంలో వీరిద్దరూ కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు. రాజేంద్రనగర్‌లోని వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌ను మరింత బలోపేతం చేసేవిధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సాగునీటి నిర్వహణలో శిక్షణతో పాటు పరిశోధన కు కీలక కేంద్రంగా ఉందన్నారు. అటువంటి ఇనిస్టిట్యూట్‌కు చెందిన భూమి కబ్జాకు గురైందని తక్షణమే సర్వే జరిపి అక్రమ కబ్జాలను తొలగించాలన్నారు. సకాలంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు ప్రజాధనాన్ని సమర్థవంతంగా సద్వినియోగం చేయడమే ప్రభుత్వ సంకల్పమన్నారు.

# వింబుల్డన్ సింగిల్స్ విజేత ఇగా స్వియాటెక్!

**లండన్, జూలై 12:** వింబుల్డన్‌లో మరో కొత్త ఛాంపియన్. పోలాండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్ ఈ మెగా టోర్నీలో విజేతగా అవతవరించింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో అద్భుత విజయంతో టైటిల్ కైవసం చేసుకుంది. శనివారం ఏకపక్షంగా సాగిన 2సెట్లలో జోరు చూపించిన పోలాండ్ భామ అమెరికా సంచలనం అమండా అనిస్మోవాకు చెక్ పెట్టింది. రెండో సెట్ గెలుపొందిన తర్వాత సంతోషం పట్టలేకపోయిన స్వియాటెక్ కోర్టులోనే గెంతులు వేస్తూ సంబురాలు చేసుకుంది. ఆ తర్వాత గ్యాలరీలోని తనటీమ్, కుటుంబ సభ్యులతో తన విజయానందాన్ని పంచుకుంది. మొత్తంగా ఆమెకిది ఆరోగ్రాండ్‌స్లామ్‌టైటిల్. తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరిన అమెరికా ప్లేయర్ అమండా రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఫేవరెట్‌గా వింబుల్డన్ టోర్నీలో అడుగుపెట్టిన స్వియాటెక్ తన కలను సాకారం చేసుకుంది. సెంటర్ కోర్టులో తొలి నిమిషం నుంచి ధాటిగా ఆడిన పోలాండ్ బ్యూటీ 60తో తొలి సెట్‌ను అలవోకగా గెలుచుకుంది. అయితే అమండా అనిస్మోవా ఎంత ప్రయత్నించినా ఒక్క పాయింట్ కూడా సాధించలేకపోయింది. అదే జోరును చూపించిన స్వియాటెక్ రెండో సెట్‌ను కూడా 60తో ముగించి విజేతగా అవతరించింది. దాంతో, వింబుల్డన్ 114 ఏళ్ల చరిత్రలో ఒక్క పాయింట్ కూడా గెలవకుండా ఫైనల్లో ఓడిన క్రీడాకారిణిగా అమండా రికార్డు నెలకొల్పింది.

# ఎప్‌సెట్‌లో 77,154 మందికి మాక్ సీట్ అలాట్‌మెంట్

## 15 వరకు వెబ్‌ఆప్షన్ల మార్పులకు అవకాశం

## 18న సీట్ల కేటాయింపు

## సాంకేతిక విద్య శాఖ కమిషనర్ శ్రీదేవసేన

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటిసారిగా ప్రారంభించిన మాక్‌సీట్ అలకేషన్‌ను శనివారం ప్రకటించారు. వెబ్‌ఆప్షన్లు ఇచ్చిన వారిలో 77,154 మందికి సీట్ల కేటాయింపు చేశారు. వాస్తవానికి ఆదివారం మాక్ సీట్ అలాట్‌మెంట్‌ను చేస్తారని కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో ప్రకటించినప్పటికీ.. శని వారమే మాక్ సీట్ అలకేషన్‌ను చేశారు. మాక్ సీట్ అలకేషన్‌లో సీటు పొందిన వారు తమ వెబ్ ఆప్షన్లను మార్చుకోవడానికి ఈ నెల 15 వరకు అవకాశం కల్పిం చినట్టు సాంకేతిక విద్యశాఖ కమిషనర్ శ్రీదేవసేన శనివారం ప్రకటనలో తెలిపారు. ఎప్ సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 10తో ముగియగా.. రాష్ట్ర వ్యాప్తంగా 94,059 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ఈ నెల 8తో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ముగియగా.. సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువు ముగిసే నాటికి 95,256 మంది హాజరయ్యారు. ఈ నెల 7తోనే స్లాట్‌బుక్ చేసుకునే గడువు ముగియడంతో.. గడువు లోపుగా 97,533 మంది స్లాట్ బుక్ చేసుకున్నారు.94,059 మంది 56,63,308 వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. రాష్ట్రంలో 83,054 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉండగా వాటిలో 77,154 సీట్లను కేటాయించారు. మరో 5900 సీట్లు ఖాళీగా ఉన్నాయి. సీట్ల కేటాయింపులో గవర్నమెంట్ కాలేజీలో 195 సీట్లు ఉండగా.. 119 సీట్లను(61.03శాతం) కేటాయించారు. 20 యూనివర్సిటీ కాలేజీల్లో 6108 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో 5163 సీట్లను(84.53శాతం) కేటాయించారు. 2 ప్రైవేటు యూనివర్సిటీల్లో 1367 సీట్లు ఉంటే వాటిలో 1357 సీట్లను(99.26శాతం) కేటాయించారు. 149 ప్రైవేటు ఇంజి నీరింగ్ కాలేజీల్లో 75,384 సీట్లు అందుబాటులో ఉండగా70,515 సీట్లను (93.54శాతం) కేటాయించారు. మొత్తం 172 కాలేజీల్లో 83,054 సీట్లు అందుబాటులో ఉంటే వాటిలో 77,154 సీట్లు(92.89శాతం) కేటాయించారు. మరో 5900 సీట్లు ఖాళీగా ఉన్నాయి. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 16,905 మందికి సీట్లు కేటాయించ లేదని అధికారులు తెలిపారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో 6021 మందికి సీట్లను కేటాయించారు. ఇది కేవలం తాత్కాలిక పద్ధతిలో సీట్లను కేటాయించినట్టు కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు. జూన్ 28 నుంచే ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ నెల 6 నుంచి ప్రారంభమైన వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ ఈ నెల 10 వరకు కొనసాగింది. కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటిసారిగా మాక్ సీట్ అలాట్‌మెంట్‌ను ప్రవేశ పెట్టిన సంగతి తెలిసిందే. ఈ నెల 15 వరకు ఆప్షన్ల మార్పుకి అవ కాశం కల్పించారు. అనంతరం ఈ నెల 18లోపు మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. మొదటి విడతలో సీటు పొందిన విద్యార్థులు ఈనెల 18 నుంచి 22వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని ఇప్పటికే అధికారులు కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో ప్రకటించారు.

## హైదరాబాద్ కల్తీకల్లు ఎఫెక్ట్..

# రాష్ట్రవ్యాప్తంగా కల్లు డిపోలు, కాంపౌండ్లపై అబ్కారీ శాఖ దాడులు

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో కల్తీ కల్లు సేవించి తొమ్మిది మంది మరణించిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపగా దీని పర్యవసానంగా రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నాడు కల్లు డిపోలు, కంపౌండ్లపై అబ్కారీ శాఖ దాడులు చేబట్టింది. అబ్కారీ శాఖ పోలీసుల తో పాటు టాస్క్‌ఫోర్స్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఈ దాడుల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల అనుమతులు లేని డిపోలు, కంపౌండ్లను అధికారులు జప్తు చేశారు. ఇందులో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మూడు అక్రమ కల్లు కంపౌండ్లు వున్నాయి. వీటిని జప్తు చేశారు. దాడుల సందర్భంగా కల్తీ కల్లుకు వాడుతున్న జాగరీ వాష్ సహా ఇతర సామాగ్రిని భారీగా స్వాధీనం చేసుకున్నారు. వీటి నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## ఆర్‌టిసి ఎండిగా సురేంద్రమోహన్‌కు అదనపు బాధ్యతలు

### సెలవుపై వెళ్లిన విసి సజ్జనార్

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రవాణా శాఖ కమిషనర్‌గా కొన సాగుతున్న ఐఏఎస్ అధికారి కె సురేంద్ర మోహన్‌కి ఆర్‌టిసి ఎండి, వైస్‌ఛైర్మన్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌టిసి ఎండి, వైస్‌ఛైర్మన్‌గా కొనసాగుతున్న ఐపిఎస్ అధికారి విసి సజ్జనార్ సెలవుపై వెళ్లడంతో సురేంద్ర మోహన్‌కి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ జీవో ఆర్‌టి నంబర్ 298కి జారీ చేశారు. ఆగస్టు 10 వరకు సెలవుపై వెళ్లిన విసి సజ్జనార్ తిరిగి వచ్చే వరకు అదనపు బాధ్యతలను కొనసాగిస్తారని ఉత్తర్వులో పేర్కొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న పోలీసు కమిషనర్ అనురాధ

# బీమా డబ్బుల కోసం 'దృశ్యం' ప్లాన్

## అత్తను హత్య చేయించి అడ్డంగా దొరికిపోయిన అల్లుడు

### వివరాలను వెల్లడించిన పోలీసు కమిషనర్ అనురాధ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** బీమా డబ్బుల కోసం దృశ్యం సినిమా తరహా ప్లాన్ వేసి అత్తను హత్య చేయించి ప్రమాదంగా చిత్రీకరించిన అల్లుడు సిద్దిపేట పోలీసులకు అడ్డంగా బుక్ అయ్యాడు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పోలీసు కమిషనరేట్‌లో కమిషనర్ అనురాధ శనివారం విలేకరులకు అందించిన వివరాల ప్రకారం.. తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లికి చెందిన తాళ్ల వెంకటేష్(32) బీమా డబ్బుల కోసం అత్తను హత్య చేయించి ప్రమాదం చిత్రీకరించడానికి నాటకాలు ఆడారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని డబుల్‌బెడ్ ఇంటిలో నివాసముంటున్న దివ్యాంగురాలైన తన అత్తమ్మ తాటికొండ రామవ్వ(50) ఈనెల 7న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతి చెందిందని తొగుట పోలీసు స్టేషన్‌లో అల్లుడు తాళ్ల వెంకటేష్ దరఖాస్తు ఇవ్వగా కేసు పరిశోధన ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. కాగా దర్యాప్తులో భాగంగా వెంకటేష్‌ను స్టేషన్‌కు తీసుకవచ్చి విచారించగా నిజానిజాలు బయటపడినట్లు చెప్పారు. స్నేహితుడు కరుణాకర్‌కు తాను రూ.1,30,000 అప్పుగా ఇచ్చినట్లు తెలిపారు. పౌల్ట్రీఫామ్, వ్యవసాయం చేయడంతో రూ.22 లక్షల వరకు నష్టం వచ్చినట్లు నిందితుడు తెలిపారు. రామవ్వ పోస్టాఫీసులో రూ.15 లక్షల బీమా కోసం సంవత్సరానికి రూ.755 కడుతున్నట్లు తెలిపారు. అలాగే ఎస్‌బిఐలో యేడాదికి రూ.2 వేల చొప్పున ప్రమాద బీమా చేయించినట్లు తెలిపారు. అత్తమ్మను చంపి రోడ్డు ప్రమాదంలో మరణించినట్లు చిత్రీకరించి బీమా డబ్బులు తీసుకుందామని పథకం వేసినట్లు తెలిపారు. తన అత్తమ్మను కారుతో ఢీకొట్టి చంపితే తనకు అప్పుగా ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాల్సిన అవసరం లేదని కరుణాకర్‌తో నిందితుడు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ నెల 7న కరుణాకర్‌కు ఫోన్‌చేసి తన అత్తమ్మను నిందితుడు వెంకటేశ్ రోడ్డుపైన కూర్చుండబెట్టి పొలంలోకి వెళ్లినట్లు తెలిపారు. కాగా రోడ్డుపై కూర్చున్న రామ్వను తమ ప్లాన్ ప్రకారం కరుణాకర్ కారుతో ఢీకొట్టి చంపేసి వెళ్లిపోయాడని వివరించారు. నిందితుడు వెంకటేశ్, సహకరించిన కరుణాకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు కమిషనర్ తెలిపారు.

# రాజ్యాంగ సవరణలు అంబేద్కర్‌కు సమ్మతమే

## అతి కేంద్రీకృత విధానాన్ని ఆయన వ్యతిరేకించారు

## పౌర హక్కులను రక్షిస్తున్న ఆర్టికల్ 32

## 'సుప్రీం' ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్

**హైదరాబాద్ (తార్నాక), జూలై 12, ప్రభాతవార్త :** భవిష్యత్తు అవసరాలరీత్యా రాజ్యాంగ సవరణలను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అనుమతించారని, ఆ స్ఫూర్తితో పని చేయాల్సిన అవసరం ఉందని భారత ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ అభిప్రాయపడ్డారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాత్ర అనే అంశంపై ఉస్మానియా విశ్వ విద్యాలయం ఠాగూర్ ఆడిటోరియంలో ఆయన ప్రసంగించారు. భారత రాజ్యాంగ రూపకల్పన సమయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనా సరళిని లోతుగా విశ్లేషించారు. అతి సమైక్య, అతి కేంద్రీకృత రాజ్యాంగాన్ని అంబేద్కర్ వ్యతిరేకించిన విషయాన్ని జస్టిస్ గవాయ్ గుర్తు చేశారు. రాజ్యాంగ ఆత్మలా, రక్షణ కవచంలా ఆర్టికల్ 32 పౌరహక్కులకు భంగం కలగకుండా కాపాడుతోందన్నారు. పరిష్కార మార్గాలు లేని హక్కులున్నా ఉపయోగం లేదన్న అంబేద్కర్ ఆలోచనలను ఆవిష్కరించారు. పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లితే నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే వేసులుబాటును రాజ్యాంగం కల్పించిందని జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ వివరించారు. అమెరికాలో ద్వంద పౌరసత్వం అమల్లో ఉన్నప్పటికీ ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంతో పాటు సమాఖ్య పౌరసత్వం ఉందని అన్నారు. అందుకు భిన్నంగా రాష్ట్రాలన్నింటిని ఏకతాటిపైకి తెచ్చేలా బలమైన ప్రజాస్వామ్య దేశంగా పటిష్టపరిచే ఒకే దేశం ఒకే రాజ్యాంగాన్ని అంబేద్కర్ అమల్లోకి తీసుకురావటం గర్వించాల్సిన విషయమని చెప్పుకొచ్చారు. సమయాభావం వల్ల పూర్తి సమయం కేటాయించలేక పోతున్నానన్న జస్టిస్ గవాయ్.... త్వరలోనే మళ్లీ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వచ్చి ఎక్కువ సమయం కేటాయిస్తానని ప్రసంగాన్ని ముగించారు. తన నగరం, తన విశ్వవిద్యాలయానికి భారత ప్రధాన న్యాయమూర్తితో హాజరు కావటం ఆనందంగా ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి పమిడిఘంటం నర సింహా అభిప్రాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు హైదరాబాద్‌కు ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేశారు. నాటి నిజాం హైదరాబాద్ స్టేట్ చీఫ్ జస్టిస్ పదవి చేపట్టాల్సిందిగా అంబే ద్కర్‌ను ఆహ్వానించారని... అందుకు అంబేద్కర్ సున్నితంగా తిరస్కరించిన విషయాన్ని జస్టిస్ నరసింహా గుర్తు చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సామాజిక ఉద్యమాలకు అంబేద్కర్ మద్దతు ప్రకటించారని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తన ఆటో బయోగ్రఫీ లో హైదరాబాద్ ఉద్యమాలు, సామా జిక న్యాయం సహా అనేక విషయాలను వెల్లడించారని వివరించారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ రూపకల్పనలో అంబేద్కర్ పాత్రపై భారత ప్రధాన న్యాయ మూర్తితో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఉస్మానియా విశ్వవిద్యాలయ చొరవను ప్రశంసించారు. అద్భుతమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారంటూ... అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి, ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరంకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగరం 108 ఏళ్ల ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రగతిని నివేదించారు. ఓయూ తరఫున అతిథులను రిజిస్ట్రార్, ఓఎస్డీతో కలిసి ఉపకులపతి ప్రొఫెసర్ కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య నరేష్ రెడ్డి, ఓఎస్డీ ఆచార్య జితెందర్ కుమార్ నాయక్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్

# పాలిసెట్ కౌన్సెలింగ్‌లో సీట్ల కేటాయింపు చేపట్టాలి

## కౌన్సెలింగ్‌పై విద్యార్థుల అనుమానాలు నివృత్తి చేయాలి

## ప్రభుత్వానికి ఎస్ఎఫ్ఐ డిమాండ్

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** పాలిసెట్ -2025 కౌన్సెలింగ్‌లో భాగంగా వెంటనే సీట్ల కేటాయింపు చేపట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పాలిసెట్ కౌన్సెలింగ్‌పై విద్యార్థుల్లో నెలకొన్న అనుమానాలు నివృత్తి చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష -పాలిసెట్‌కి 22 వేల మంది విద్యార్థులు రాశారని.. వారికి పాలిటెక్నిక్ కళాశాలలో చేరేందుకు ఈ నెల 4నుండి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండగా .. అధికారులు ఇప్పటి వరకు నోరుమెదపడం లేదన్నారు. వివిధ కారణాలు చెప్పుతూ వాయిదా వేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం విద్యార్థుల డాటా ఎరేజ్ అయిందనే వార్తలు వస్తున్నాయని.. విద్యార్థులకు సకాలంలో పరీక్షలు నిర్వహించి ప్రవేశాలు కల్పించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా ఉన్నారని.. కౌన్సెలింగ్‌లో భాగంగా సీట్ల కేటాయింపు ఎందుకు వాయిదా వేశారో కూడా విద్యార్థులకు సమాచారం ఇవ్వడం లేదన్నారు.

సాంకేతిక సమస్య వల్లన వెబ్ ఆప్షన్లు ఇవ్వడం సాధ్యం కావడం లేదని చెబుతున్నారని.. ఫీజులు నిర్ణయించలేదని అందుకే ఆలస్యం అవుతుందని చెబుతున్నారని అన్నారు. సమస్యలను పరిష్కారం చేసి తక్షణమే ప్రభుత్వం సీట్లు కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు గందరగోళం కాకుండా సక్రమంగా సమాచారం ఇవ్వాలని సరైన సమాధానం చెప్పకుండా జాప్యం చేయడం సరికాదని.. తక్షణమే ప్రభుత్వం ప్రకటనచేసి కౌన్సెలింగ్ తేదీలను ప్రకటించాలని రజనీకాంత్, నాగరాజు డిమాండ్ చేశారు.

# ఇది ధర్మయుద్ధం చేయాల్సిన సమయం

## న్యాయవాదులు ముందుకు వచ్చి కీలకపాత్ర పోషించాలి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును సన్మానిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** ప్రజావ్యతిరేక విధానాలను ఎదుర్కొని ధర్మయుద్ధం చేయాల్సిన సమయం వచ్చిందని, ఇందులో న్యాయవాదులు మళ్లీ ముందుకు వచ్చి కీలకపాత్ర పోషించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడుగా రాం చందర్‌రావు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో లీగల్ సెల్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాం చందర్‌రావు మాట్లాడారు. నాకు న్యాయవాదులతో ఎంతో దగ్గర సంబంధం ఉందని, 1993లో తార్నాకలో ఓ షాపును 100మంది రిజర్వ్ పోలీసులు ధ్వంసం చేస్తున్నప్పుడు నేను ఆ చర్యను అడ్డుకున్నా న్నారు. అందుకు ప్రతిగా నాపై లాఠీచార్జ్ చేసి, అరెస్ట్ చేసి కేసు పెట్టారని, పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి, నేను హాస్పిటల్‌లో దాదాపు రెండు నెలలు చికిత్స పొందానని తెలిపారు. మేజర్ ఆపరేషన్ జరిగింది. ఆ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో న్యాయవాదులు 43 రోజుల పాటు కోర్టులను బహిష్కరించారు. నేను వ్యక్తిగతంగా బహిష్కర ణలకు వ్యతిరేకినే అయినా, నాతోపాటు మరో సీనియర్ న్యాయవాదిపై జరిగిన పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ, న్యాయ వాదులందరం బాయ్‌కాట్ చేశాం. చివరికి జ్యుడిషియల్ కమిషన్‌ను సాధించ గలిగాం అన్నారు. అప్పుడు న్యాయవాదులు నాకోసం పోరాడారు. అందుకే న్యాయవాదుల సంఘాన్ని నేను నా కుటుంబంలా భావిస్తానని తెలిపారు. న్యాయ వాదులు సంకల్పిస్తే ఏదైనా సాధ్యమేనని, బిఆర్ఎస్ నేతలు తెలంగాణ ఉద్యమ పితామహుడు కెసిఆర్ అని, కాంగ్రెస్ నేతలు తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ అని చెప్పుకుంటున్నా తెలంగాణ కోసం బిజెపి మద్దతివ్వడం కీలకమైన అంశం అన్నారు. బిజెపి మద్దతు లేకపోతే తెలంగాణ రాష్ట్రం సాధ్యం కాకపోయేది. ఇది చరిత్ర. తెలంగాణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టే ముందు నేను, సీనియర్ అడ్వకేట్ ప్రకాష్ రెడ్డి, బార్ కౌన్సిల్ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, రాజ్యసభ సభ్యుడు, సీనియర్ అడ్వకేట్ నిరంజన్ రెడ్డి కలిసి... తెలంగాణ బిల్లు కాపీలతో అరుణ్ జైట్లీని కలిశాం అన్నారు. ఆయన సూచనతో సుష్మా స్వరాజ్‌ని కలిసి చర్చించాం. అనంతరం ప్రకాష్ జవదేకర్‌ని కలిశామని తెలిపారు. తెలంగాణ బిల్లు పార్లమెంటులో న్యాయపరంగా ఇబ్బందులు లేకుండా పాస్ చేసే ప్రక్రియలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకం అన్నారు. తెలంగాణ సాధనలో న్యాయవాదుల పాత్రను మరువలేం అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, న్యాయవాదులను, విద్యార్థులను, రైతులను, ప్రజలందరినీ మోసం చేశాయని మండిపడ్డారు. తెలంగాణ సమాజాన్ని మోసగించాయి. తెలంగాణను వికసిత రాష్ట్రంగా మార్చాలంటే అది కేవలం బిజెపి తోనే సాధ్య మవుతుందన్నారు. తెలంగాణలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే లక్ష్యంతో కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. ఉద్య మాల్లో న్యాయవాదులు ఎప్పుడూ ముందుంటారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే న్యాయ వాదులు పెద్ద సంఖ్యలో భారతీయ జనతా పార్టీలో చేరాలి. కలిసికట్టుగా ముందుకు రావాలి. తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పాటు కోసం కృషి చేయాలన్నారు.

# బిసి బిల్లు పెండింగ్‌లో ఉండగా ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదిస్తారా?

## ముందే సంబురాలు చేసుకోవడం ఏమిటి?

## బిజెపి ఎంపి డా.లక్ష్మణ్

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** బిసి బిల్లు పెండింగ్‌లో ఉండగా మరోవైపు ప్రభుత్వం తెచ్చే ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదించే అవకాశం ఉందా? అని బిజెపి ఎంపి లక్ష్మణ్ ప్రశ్నించారు. శనివారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ బూసాని వెంకటేశ్వరరావు నివేదికను బహిర్గతం చేయకుండా ఎందుకు దాచిపెడుతుందని ప్రభుత్వానికి ఎందుకంత భయమని ప్రశ్నించారు. కనీస ఇంగితజ్ఞానం లేకుండా ప్రభుత్వం బిసిలను రాజకీయ అస్త్రంగా ఉపయోగించుకుని లబ్ధిపొందే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. బిసి రిజర్వేషన్లు అమలు కాకముందే కాంగ్రెస్ సంబురాలు చేస్తుంటే బిఆర్ఎస్ ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. ఆర్డినెన్స్‌ను ఓ వైపు ఎమ్మెల్సీ కవిత స్వాగతిస్తుంటే మరోవైపు మిగతా బిఆర్ఎస్ నేతలు ఇది సాధ్యం కాదంటున్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ బిసిల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. తెలంగాణ మోడల్‌ను రోల్‌మోడల్ అని కాంగ్రెస్ చెబుతుందని, కానీ ఇక్కడ జరిగిన సర్వే అంతా తప్పులతడక అని లక్ష్మణ్ విమర్శించారు. బిసిలలో ముస్లింలను చూపిస్తూ స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లు ముస్లింలకు కేటాయించి బిసిల హక్కులను కాలరాస్తారా అని నిలదీశారు. ముస్లింలకు బిసిల కోటాలో రిజర్వేషన్లు ఇస్తే మరి అసలు బిసిలు ఎక్కడికి పోవాలన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే డెడికేషన్ కమిటీ సేకరించిన సమాచారం మేరకు కేటగిరిల వారిగనైనా లెక్కలు చెప్పా లన్నారు. పార్టీ సామాజిక సమీకరణాల్లో భాగం గానే రామచందర్‌రావును రాష్ట్ర అధ్యక్షుడిని అది, స్థానం నిర్ణయించిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే ఏ పార్టీ ప్రకటించని విధంగా మొట్ట మొదటిసారి బిజెపి బిసి ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన సంగతి గుర్తుంచుకోవాలన్నారు.

# దేశ రాజధానిలో కూలిన ఐదంతస్తుల భవనం

## శిథిలాల కింద చిక్కుకున్న కుటుంబీకులు

**న్యూఢిల్లీ, జూలై 12:** దేశ రాజధాని ఢిల్లీలో ఘోరం జరిగింది. నాలుగు అంతస్థుల భవనం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. ఇప్పటికే కొంతమందిని రక్షించిన రెస్క్యూ సిబ్బంది మిగతావారి కోసం గాలిస్తున్నారు. ఈశాన్య ఢిల్లీ సీలంపూర్‌లోని జనతా కాలనీలో ఇవాళ ఉదయం భవనం కుప్పకూలింది. ఉదయం 7గంటలకు ఈ దుర్ఘటన జరిగింది. వెంటనే స్థానికులు శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్న 14 నెలల బాలుడితో పాటు నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలను బయటకు తీశారు. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ భవనంలో 10మంది గల ఫ్యామిలీ నివసిస్తున్నట్లు తెలుస్తోంది. ఉదయం 7 గంటలకు భవనం కూలిపోయినట్లు మాకు కాల్ వచ్చింది. వెంటనే వెళ్లి సహాయక చర్యలు చేపట్టామని పోలీస్ అధికారి తెలిపారు. ఈ ప్రమదానికి సంబంధించి స్థానికులు కీలక విషయాలు వెల్లడించారు. ఉదయం 7 గంటల సమయంలో నేను నా ఇంట్లో ఉన్నప్పుడు పెద్ద శబ్దం వినిపించింది. ఒక్కసారిగా పెద్ద మొత్తంలో దుమ్ము వ్యాపించింది. నేను కిందకు దిగి చూసేసరికి, మా పక్కన ఇల్లు కుప్ప కూలి పోయింది. ఆ బిల్డింగ్‌లో 10మంది ఉంటారు. ఎంతమంది శిథిలాల కింద చిక్కు కున్నారో తెలియదని అస్మా అనే స్థానికురాలు తెలిపింది. ఏప్రిల్‌లోనూ ఢిల్లీలో ఇటువంటి ఘటనే జరిగింది. ముస్తఫాబాద్‌లో నాలుగు అంతస్తుల భవనం కూలిపోవడంతో నలుగురు మరణిం చారు. ఆ ఘటన జరిగి మూడు నెలల కాకముందు మరో దుర్ఘటన జరగడం స్థానికులను కలిచివేసింది. అయితే అధికారులు అనుమతులు లేని భవనాలతో పాటు శిథిలావస్థకు చేరుకున్న భవనాలను నేలమట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.





# విమానప్రమాదంపై తుది నివేదిక దాకా వేచిచూద్దాం

## ప్రాథమిక నివేదికపై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

**న్యూఢిల్లీ, జూలై 12:** అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ఇచ్చిన ప్రాథమిక నివేదికపై పౌర విమాన యాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు స్పందించారు. విమాన ప్రమాదంపై అప్పుడే ఒక నిర్ణయానికి రావద్దని, తుది నివేదిక వచ్చేవరకు వేచి చూడాలని సూచించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిభ కలిగిన పైలట్లు, సిబ్బంది మన దగ్గర ఉన్నారు. వారు పౌర విమాన యానానికి వెన్నెముక వంటివారు. ఈ రంగానికి వారే ప్రధాన వనరులు. వారి సంక్షేమం, శ్రేయస్సు కోసం మా ప్రభుత్వం పనిచేస్తుంది. ఇలాంటి సమయంలో ఎలాంటి నిర్ధారణకు రాకుండా తుది నివేదిక కోసం వేచిచూద్దాం. ఈ కేసులో ఎన్నో టెక్నికల్ అంశాలు ఇమిడి ఉన్నాయి. అందుకే ఈ నివేదికపై ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు అవుతుంది అని విశాఖపట్నంలో మంత్రి అన్నారు. కాగా ఎఎఐబి 15 పేజీలతో తాజాగా ప్రాథమిక నివేదికను సమర్పించింది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్ మరో పైలట్‌ను ప్రశ్నించాడని రిపోర్ట్‌లో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఎఎఐబి తెలిపింది. తర్వాత పైలట్లు మేడే కాల్ ఇచ్చారని వెల్లడించింది. ఈ రెండు స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒకదాని తరువాత మరొకటి ఆగినట్లు నివేదికలో తెలిపింది. ప్రమాదానికి ముందు విమానం కేవలం 32 సెకన్లపాటు గాల్లో ఉన్నట్లు వెల్లడించింది. రన్‌వేకు కేవలం 0.9 నాటికల్ మైళ్ల దూరంలోని ఓ హాస్టల్ భవంతిపై విమానం కూలిపోయిందని నివేదిక వివరించింది. జూన్ 12న ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో ఫ్లైట్‌లో ఉన్న 240 మంది ప్యాసింజర్లతో పాటు ఇతరులు ప్రాణాలు కోల్పోయారు.



# 29 నుంచి ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు

## ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి: ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా టెన్త్, ఇంటర్ అడ్మిషన్లు పొందాలనుకునే వారు ఈ నెల 29 నుంచి అడ్మిషన్లు పొందవచ్చని ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ ప్రకటించారు. ఈ నెల 29 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 10వ తరగతితోపాటు ఇంటర్మీడియట్‌లోనూ అడ్మిషన్లను తీసుకోనున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అపరాధరుసుంతో ఆగస్టు 1 నుంచి 28 వరకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. మీ సేవా, ఈ సేవా ద్వారా దరఖాస్తు చేసుకున్న తరువాత మూడురోజుల లోపుగా తమ సర్టిపికెట్లను స్కూల్, కాలేజీలో సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## ఎసిబి వలలో పంచాయతీరాజ్ ఎఇ జగదీష్

**పెద్దపల్లి, ప్రభాతవార్త:** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో శనివారం రహదారిపైనే కాంట్రాక్టర్ రూపాయలు 90,000 సీసీ రోడ్డు పనులకు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఓదెల మండలం బాయమ్మ పల్లెకు చెందిన కాంట్రాక్టర్ కావేటి రాజు మండలం లోని వెన్నంపల్లిలో ఇటీవల 15 లక్షల రూపాయలతో ఆ గ్రామంలో సిసి రోడ్లు పనులు చేయడం జరిగింది. ఆ పనుల బిల్లుల కోసం ఏఈ జగదీష్ రూపాయలు 90,000 డిమాండ్ చేయడం జరిగింది. దీంతో కాంట్రాక్టర్ కావేటి రాజు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రక్కన ఉన్న ప్రధాన రహదారిపై కాంట్రాక్టర్ కావేటి రాజు రూపాయలు 90,000 ఏఈ జగదీష్ కు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.



ఎసిబికి చిక్కిన ఎఇ

## బెంగళూరులో బుల్లితెర నటి శ్రుతిపై హత్యాయత్నం.. భర్తే నిందితుడు

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** బెంగళూరులో ప్రముఖ బుల్లితెర నటి శృతి అలియాస్ మంజులపై హత్యాయత్నం జరిగింది. ఈ నెల నాలు గవ తేదీన జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనలో ఆమె భర్త అమరేష్ నిందితుడుగా తేలాడు. స్థానిక మునేశ్వర లే అవు ట్‌లో వుంటున్న శృతి (49) అమరేష్ దంపతులకు కాలేజికి వెళ్లే విద్యార్థులు వున్నారు. అయితే కొంతకాలంగా ఇద్దరి మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే గత ఏప్రిల్ నెల నుంచి శృతి భర్తను వదిలి సోదరుడి ఇంట్లో వుంటుంది. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు దంపతులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. అయితే అమరేష్ మాత్రం భార్యపై కోపంతో రగిలిపోయాడు. అనంతరం ఈ నెల నాలుగవ తేదీన సాయంత్రం వేళ తన భార్య వున్న ఇంటికి వెళ్లి ఇంట్లో ఎవరు లేని సమయంలో పెప్పర్ స్ప్రేను భార్య ముఖంపై చల్లాడు. అనంతరం కత్తితో పలు మార్లు పొడిచి, తలను గోడకేసి కొట్టి పారిపోయాడు. దీని తరువాత బాధితురాలు కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి ఆమెను ఆసుపత్రి కి తరలించారు. ఆమె ఆసుపత్రిలో కోలుకుంటోందని బంధువులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు అమరేష్‌ను అరెస్టు చేసి విచారణ చేబట్టారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. గాడి తప్పిన విద్యా వ్యవస్థను సరిదిద్దేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రయత్నాలు ప్రారంభించారు. గతంలో విద్యాశాఖలో ఎన్నో ఒడిదుడుకులు ఉండటంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా బదలీల్లోభాగంగా చేపట్టిన కౌన్సిలింగ్‌లో లోపాలు ఉండటం వారికి శాపంగా మారింది. అంతేకాక గతప్రభుత్వంలో మునుపెన్నడూ లేని విధంగా ఉపాధ్యాయుల చేత బోధనేతర పనులు చేయించారు. దీంతోఅప్పటి ప్రభుత్వం విధానాలతో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు గత ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పుఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంత్రి నారా లోకేష్ విద్యా శాఖను తన వద్ద ఉంచుకొని మార్పులు చేర్పులకు సన్నాహాలుచేస్తున్నారు. ముఖ్యంగా విద్యాశాఖలో ప్రిన్సిపల్ సెక్రటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారి కోన శశిధర్‌ను నియమించారు. కోన శశిధర్‌కు ఏ శాఖ అప్పగించిన తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి ఆ శాఖకి న్యాయం చేస్తారన్న అభిప్రాయం సర్వత్రా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ముఖ్యంగా మెగా డిఎస్సి నిర్వహించారు. అలాగే ఉపాధ్యాయుల బదిలీల కౌన్సిలింగ్ పారదర్శంగా నిర్వహించారు. లోకేష్ మార్క్ పాలనకు అద్దంపట్టారు. విద్యను అత్యంత ప్రాధాన్యత రంగాలలో ఒకటిగా గుర్తించింది. ఈ క్రమంలో పాఠశాల విద్యలో సంస్కరణలకు తెరతీసింది.మొదటిసారి మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలునిర్వహించారు. కార్యక్రమంలో 44,956పాఠశాలల్లో 25.46 లక్షలమంది తల్లిదండ్రులు, 27,395మంది పూర్వవిద్యార్థులు, 22,200 మందిదాతలు, 36,918 మంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈసమావేశంలో తమ పిల్లల అవకాశాల గురించి చర్చించారని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.

# విద్యాశాఖలో సంస్కరణల శకం

**ఎం రఘునాథ**

విద్యారంగంలో సంస్కరణలకు కూటమి ప్రభుత్వం జోరుగా ప్రయత్నాలు సాగిస్తోంది. ప్రస్తుతం ఈ వ్యవస్థలో ఉన్న లోపాలు గుర్తించడంతోపాటు వాటి పరిష్కారానికి మార్గాలను అన్వేషిస్తోంది. విద్యారంగానికి గొడ్డలి పెట్టుగా మారిన జీవో 117కు కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. విద్యారంగంలో సంస్కరణల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీవోతో ప్రాథమిక విద్యా నిట్టనిలువునా చీలిపోయింది. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతో తల్లిదండ్రులు ప్రైవేటుబడుల బాట పట్టారు. నాటి సీఎం జగన్ తీసుకున్న ఈ నిర్ణయం ఊరి బడికి ఉరిగా మారింది. ఈ జీవోతో ప్రాథమిక విద్యావ్యవస్థకు నష్టం వాటిల్లుతుందని ఉపాధ్యాయులు, మేధావులు ఆందోళన చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ వివాదాస్పద జీవోను రద్దు చేస్తామని ఇప్పటికే ప్రకటించగా, దాన్ని ఉపసంహరించిన తర్వాత ప్రత్యామ్నాయం తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ప్రారంభించింది. దీనిలో భాగంగా ఆ శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు మార్గదర్శకాలపై ఉత్తర్వులు విడుదల చేశారు. గతంలో ఉన్న ఆరు రకాల పాఠశాలలకు బదులు 10రకాల పాఠశాలల విధానాన్ని కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. గతంలో ప్రవేశపెట్టిన శాటిలైట్ ఫౌండేషనల్( పిపి1, పిపి2) స్కూళ్ల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు అప్పగించింది. ఫౌండేషనల్ (పిపి1, పిపి2, 1,2, తరగతులు) స్కూళ్లను అలానే కొనసాగించింది. ఒకటి నుండి ఐదు తరగతులలో 60 లోపు విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలను బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా, 60పైన విద్యార్థులున్న పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలలకు ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంతో పాటు తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదుమంది ఉపాధ్యాయులను కేటాయించడం జరిగింది. 60మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉన్న ప్రాథమికోన్నత (యూపీ) పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం జరిగింది. ఉన్నత పాఠశాలల కాంపౌండ్ లోని ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలలో విలీనం చేసి 1నుండి 10 తరగతుల వరకు గల ఉన్నత పాఠశాలలుగా మార్పు చేసింది. కొన్నిచోట్ల 6 నుండి 10 తరగతుల వరకు ఉండే ఉన్నత పాఠశాలలను కూడా ఏర్పాటు చేసింది. 1 నుండి 12 వరకు, 6 నుండి 12 వరకు తరగతులు ఉండే హైస్కూల్ ప్లస్‌లోరెండు రకాలుగా పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగింది.పాఠశాలల వారీగా వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఒక పాఠశాలకు ఒక



యాప్ పేరుతో సమగ్ర డాష్‌బోర్డును సిద్ధం చేశారు.ప్రభుత్వం లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ పేరుతో సమగ్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉపాధ్యాయులు నిత్యం ముఖ ఆధారిత హాజరు వేసే గుర్తింపు సంఖ్య (ఐడీ), పాస్‌వర్డ్‌తో యాప్‌లో లాగిన్ కావొచ్చు. ఈ యాప్‌లో స్కూల్, టీచర్, స్టూడెంట్, గవర్నెన్స్, కమ్యూనికేషన్, డ్యాష్‌బోర్డు అనే ఆరు విభాగాలున్నాయి. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు అందజేత. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఈ కిట్‌లో ఒక్కో విద్యార్థికి అవసరమైన పాఠ్యాంశాలు (టెక్స్ట్ బుక్స్) అలాగే వర్క్ బుక్స్, నోట్ బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ కూడా ఇస్తారు. విద్యార్థికి మూడు జతల యూనిఫాం, ఒక బ్యాగ్, బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్ కూడా ఇస్తారు. ఒకటో తరగతి పిల్లల కోసం బొమ్మలతో కూడిన డిక్షనరీని ప్రత్యేకంగా తయారు చేశారు.ఈ కిట్‌ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం రూ.953.71 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే ఒక్కో కిట్టుకు ప్రభుత్వం రూ.2,279 ఖర్చుచేస్తోంది. 2025-26 విద్యా సంవత్సరానికి 35,94,774 మంది విద్యార్థులకు కిట్లు కొనుగోలు చేసారు.ఇందులో కేంద్రం రూ.175.03 కోట్లు, రాష్ట్రం రూ.778.68 కోట్లు భరించనున్నాయి. 1 నుంచి 8 తరగతి విద్యార్థులకు ఏకరూప దుస్తులకుకుట్టుకూలి కింద రూ.120, 9, 10 తరగతుల వారికి రూ.240 చెల్లించనున్నారు. తల్లికి వందనంతో రికార్డు సృష్టించారు. తల్లికి వందనం పథకం కోసం మొత్తం రూ.10,091 కోట్లు ఖర్చు విడుదల చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఇందులో రూ.1,346 కోట్లు పాఠశాలల అభివృద్ధికి వెళతాయని వెల్లడించారు. అప్పట్లో ఒకరికి మాత్రమే ఇస్తే.. ఇప్పుడు ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ తల్లికి వందనం ఇస్తున్నామని ఆయన తెలిపారు. అంతేకాక విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించడానికి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా విలువలపై పుస్తకాలను తీసుకొచ్చారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు పాఠ్యాంశాల్లో సమూల మార్పులు తీసుకొస్తున్నారు. ఇంటర్మీడియట్ సిలబస్‌ను మార్పు చేయ డంతోపాటు ప్రశ్నాపత్రాల విధానాన్ని మార్చనున్నారు. వెను కబడిన విద్యార్థులతోపాటు పిల్లలకు అదనపు బోధన అం దించేందుకు ఐఐటీ మద్రాస్‌తో కలిసి విద్యాశక్తి కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు. అకడమిక్ క్యాలెండర్ ను సమర్థవంతంగా అమలు చేయడంతోపాటు డిజిటల్ మౌలిక సదుపాయాల్ని మెరుగుపర్చడం, ఫిజికల్, వర్చువల్ విద్యను ఏకీకృతం చేయడం ద్వారా మెరుగైన బోధన విధానాలను అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇంటర్మీడియట్‌లో వృత్తి విద్య విద్యార్థులకు డ్యుయల్ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. జాతీయ నైపుణ్య విద్య అర్హత ఫ్రేమ్ వర్క్, జాతీయ వృత్తి విద్య, శిక్షణ మండలితో కలిసి వీటిని ఇవ్వనున్నారు. పాఠశాల విద్యా శాఖలో కీలకమైన స్కూల్ కాంప్లెక్స్ విధానాన్ని ప్రభుత్వం రద్దుచేసింది. వాటి స్థానంలో క్లస్టర్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల రాష్ట్రవిద్యాశాఖ ముఖ్యకార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.వాటిని అనుసరించిన ప్రస్తుతస్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలు వాటి దూరం, ఆయా స్కూళ్లలో విద్యార్థులు, టీచర్ల సంఖ్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి 4,034 క్లస్టర్ కాంప్లెక్స్ లను ఏర్పాటు చేసింది. పాఠశాల విద్య డైరెక్టర్ వి. విజయరామరాజు పర్యవేక్షణలో అత్యంత సమర్థవంతంగా ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలను పూర్తి చేయడం జరిగింది. మొత్తం 67,732 బదలీలు, 4,477పదోన్నతులు అమలు చేయబడ్డాయి. వారిలో, 1,494 మంది గ్రేడ్॥ ప్రధానో పాధ్యాయులు బదలీకాగా, 1,375 మంది స్కూల్ అసిస్టెంట్‌లు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందారు. అదే విధంగా, 5,717 మంది మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా బదిలీ పొందారు. అందుకోసం స్కూల్ అసిస్టెంట్లను బదిలీ చేయడమే కాకుండా 1,592 మంది ఎస్జీటీలు మోడల్ స్కూల్స్ హెచ్ ఎమ్స్‌గాపదో న్నతులు పొందారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 27,804 మంది ఉపాధ్యాయులు బదిలీలు పొందగా, అదే విధంగా 1,510 మంది స్కూల్ అసిస్టెంటులుగా ఎస్‌జిటిల నుండి పదోన్నతి పొందారు. అదనంగా, 31,174 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, 1,199 మంది లాంగ్వేజ్ స్కాలర్లు 344 మంది ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లను బదిలీ చేశారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతుంది. ఇందులో భాగంగా విద్యా బోధనలో నాణ్యతను పెంపొందించేందుకు నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమం పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుండి 9 తరగతుల విద్యార్థులు గణితం, ఇంగ్లీష్, తెలుగు పాఠ్యాంశాల్లో వెనకబడి ఉంటే, సాంకేతికత సాయంతో విద్యార్థుల సవాళ్లను పరిష్కరించి, తరగతి గదిలో అభ్యసన ఫలితాలు మెరుగుపరచడమేలక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా శ్రీకారం చుట్టింది.ప్రభుత్వ పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇవ్వాలనివిద్యాశాఖ నిర్ణయించింది.విద్యార్థుల్లో క్రీడానైపుణ్యాలు పెంచేందుకు ఆటలకుసంబంధించిన సామగ్రి అందించనున్నారు. ప్రభుత్వ బడుల్లో కంప్యూటర్స్ ల్యాబ్‌లను ఏర్పాటుచేయనున్నారు. ●

---

రాష్ట్రం

మహారాష్ట్ర

# ఒకే ఒరలో రెండు..

**ఎ.వి.వి ప్రసాద్**

నేనీదరిని.. నువ్వాదరిని అంటూ రెండు దశాబ్దాలుగాఎడమొగం, పెడమొగంగా ఉన్న 'అపూర్వ సహోదరులు' మరోతీ కలిపింది మన ఇద్దరినీ అంటూ గతవారం చేతులు కలపడం మహారాష్ట్ర రాజకీయాలను కొత్త మలుపు తిప్పిందనే చెప్పాలి. బాలా సాహెబ్ ఠాకరే స్థాపించి పెంచి పోషించిన శివసేనలోనే తన రాజకీయ జీవితం ప్రారంభమైనా, 20సంవత్సరాల క్రితం 2005లో సొంత బాట వేసుకొని 'మహారాష్ట్ర నవ నిర్మాణ సేన' (ఎంఎన్ఎస్) అనే కొత్త పార్టీని స్థాపించి తనకు తానుగా ఎదుగుతున్న రాజ్ ఠాకరే తన పెదనాన్న కుమారుడైన ఉద్ధవ్‌ఠాకరేతో కలిసి ఒకే వేదికను ఎక్కడం,కలిసి ఉండేందుకే కలిసి వచ్చామని చెప్పడం రాష్ట్రంలోని అధికార బిజెపి కూటమికి వెన్నులో వణుకు పుట్టించిందని కూడా చెప్పాలి. ఎవరి కారణాలు వారికి ఉన్నా, శివసేన నుంచి రాజ్ విడిపోవడానికి, ఇప్పుడు కలవడానికి కూడా మరాఠీయే కారణం. అప్పట్లో శివసేన విద్యార్థి విభాగమైన'భారతీయ విద్యార్థి సేన' ను ప్రారంభించినవాడు రాజ్. మొదట్లో ఉద్ధవ్ కంటె పార్టీలో రాజ్‌కే ఎక్కువ ప్రాధాన్యం కనిపించడంతో బాలాసాహెబ్ కుమారునిగా ఉద్ధవ్‌ముందుకు వెళ్లడానికి చాలా ప్రయత్నాలే చేశారు. కానీ పదవుల పంపకంలో అలిగిన రాజ్ 2005లో శివసేన నుంచి నిష్క్రమించి 2006మార్చిలో ఎంఎన్ఎస్‌ను స్థాపించారు. ఆతర్వాత ఆయన మనసు మార్చి శివసేనలోకి తిరిగి రప్పించడానికి బాలా సాహెబ్ ఉన్నప్పుడే చాలా ప్రయత్నాలు జరిగాయి. కానీ ఏవీ ఫలించకపోగా, ఉద్ధవ్‌కు గట్టి ప్రత్యర్థిగా రాజ్‌బలాన్ని పెంచుకోవడంతో వారిద్దరిమధ్య రగిలిన సెగలు తర్వాత కాంగ్రెస్‌కు, బిజెపికి ఎంతో ఉపయోగించాయి. శివసేన కొన్నిసార్లు కాంగ్రెస్‌తోను, మరోసారి బిజెపితోను జతకట్టింది కానీ ఆ పొత్తును నిలుపుకొనలేక పోయింది. చివరికి అధికారానికి దూరమై బిజెపి కూటమికి రాష్ట్రాన్ని అప్పగించింది.. శివసేన గ్రాఫ్ పడిపోవడం, ఎంఎన్ఎస్ రేటింగ్ పెరగడంతో అన్నదమ్ములిద్దరిని తిరిగి కలపడానికి గతంలో కూడా కొన్ని ప్రయత్నాలు జరిగాయి.హిందీవ్యతి రేక ఉద్యమం జరిగినప్పుడల్లా ఇద్దరు వేర్వేరుగా ఆందోళనలు జరపడంతో వాటివల్ల తగినంత ప్రయోజనం లభించకుండా జారిపోయింది.ఇద్దరిలో రాజ్‌కు హిందీ వ్యతిరేకత చాలా అధికం. బిజెపి, కాంగ్రెస్‌తో చేతులు కలపడంతో ఉద్ధవ్‌ది సర్దుకుపోయే మనస్తత్వం. వారిద్దరూ ఇంతకాలం కలవకపోవడానికి అది కూడా ఒక కారణం. కానీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ హిందీని తప్పనిసరిచేసే త్రిభాషా విధానం అమలుచేయడానికి ప్రయత్నించడం, దానికి వ్యతిరేకంగా సోదరు లిద్దరూ వేర్వేరుగానే తొలుత ఆందోళనలు ప్రారంభించినా, చివరికి చేతులు కలపడంతో ప్రభుత్వ నిర్ణయం కూడా రాత్రికిరాత్రి మారిపోయి జూన్ 29న హిందీ అధ్యయనం తప్పనిసరి కాదంటూ ఫడ్నవిస్ కొత్త ఉత్తర్వులుజారీ చేయవలసి వచ్చింది.ఫడ్నవిస్ హిందీ విధానానికి నిరసనగా జులై 6,7 తేదీల్లో భారీఆందోళనలు జరపాలని సోద రులిద్దరు ప్లాన్ చేయడం తెలిసిన ముఖ్యమంత్రి వెంటనే కొత్త ఉత్తర్వులు జారీ చేయడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగినా వారిద్దరూ కలిసి విక్టరీ ర్యాలీ జరపాలనుకోవడంతో ఫడ్న విస్‌కు పచ్చివెలక్కాయ గొంతులో పడినట్లయింది. తాను అమలు చేద్దామనుకున్న త్రిభాషా విధానం ఠాకరే సోదరులిద్దరినీ తిరిగి కలపడంతో ఇప్పుడు బిజెపి కూటమికి కొత్త సమస్య మొదలయింది. శివసేన షిండే వర్గం, ఎన్సీపి అజిత్ వర్గం బిజెపి కూటమిలోని ప్రధాన మిత్రపక్షాలు.అవి అవసరం కొద్దీఏర్పడిన పొత్తులే కావడంతో సమీకరణాలు మారితే ప్రభుత్వం మనుగడకు ముప్పు ఏర్పడే అవకాశాలే అధికం. డిప్యూటీ సిఎంగా ఉన్న అజిత్‌పవార్, ఒక కాలు కూటమిలోను, మరో కాలుశరద్‌పవార్ నాయకత్వంలోని ఎన్సీపీలోను పెట్టి ఉంచారన్నది అందరూ ఎరిగినదే.షిండేకు బిజెపితో కలిసి సాగవలసిన అవసరం ఎక్కువఉంది. అధికారకూటమి లో లేకపోతే ఆగ్రూపులో ఎవరూ మిగలకపోవచ్చు. వారు మళ్లీ శివసేనలోకి వెళ్లే అవకాశాలే ఎక్కువ. అందువల్ల మిత్ర పక్షాలు జారిపోకుండా కాపాడుకోవడం ఫడ్నవిస్ మొదటి బాధ్యత. ఒక దశలో అజిత్‌వర్గం కూడా హిందీ వ్యతిరేకఆందోళనలకు మద్దతు ఇస్తుందని తెలియడం వల్లనే ఫడ్నవిస్ తనవిధానంలో మార్పు చేశారని అంటున్నారు. కానీ అది ఠాకరే సోదరులిద్దరు తిరిగి కలవడానికి ఉపయోగపడడంతో ఫడ్నవిస్‌కు కొత్త తలనొప్పి మొదలయినట్లయింది. అసెంబ్లీ ఎన్ని కలకు ఇంకా చాలా వ్యవధి ఉన్నా, డిసెంబర్ లేదా జనవరిలో బృహన్ముంబయి ఎన్నికలుజరు గబోతున్నాయి. ఆ ఎన్నికల్లో గెలిచిన వారికి మరాఠా రాజకీయంమీద ఎక్కువ పట్టు ఉంటుంది. ఠాకరే సోదరులిద్దరు చేతులు కలపడం వల్ల ముంబయి వారి ఖాతాలోకి వెళ్తే ఏంచేయాలన్న ది ఫడ్నవిస్‌కు మరో సమస్య. గత ఎన్నికల్లో ఉద్ధవ్ శివసేన గ్రూప్‌కు 84 సీట్లు వస్తే, బిజెపి కి రెండు తక్కువగా 82సీట్లు వచ్చాయి. ఎంఎన్ ఎస్‌కు ఏడు మాత్రమే లభించాయి.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి (బిజెపి,షిండే శివసేన, అజిత్ ఎన్సీపీ) విజయం సాధించడంతో ఎన్నికలు జరిగితే ముంబయి కూడా తమ అధీనంలోకి వస్తుందనే ధీమాతో వారు ఉన్నారు. కానీ ఇప్పుడు రాజ్, ఉద్ధవ్ చేతులు కలపడంతో సమీకరణాలు పూర్తిగామారిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. అసెంబ్లీఎన్ని కల్లో ఉద్ధవ్ కూటమికి 10 శాతం ఓట్లు వస్తే, రాజ్ ఎంఎన్ఎస్ కు 1.56 శాతం ఓట్లు వచ్చాయి. వారిద్దరితో పాటు షిండే గ్రూపు నుంచి కూడా కొంత ఓట్ల శాతం బదలీ అయితే వారి విజయాన్ని ఎవరూ నిరోధించలేకపోవచ్చు. ఇప్పుడు హిందీ కంటె ఫడ్నవిస్ ముందున్న ప్రధాన సమస్య ఇదే. రాజ్, ఉద్ధవ్ నిజంగా ఒకే ఒరలో ఇమడగలిగితే నిజంగానే అద్భుతాలు సృష్టించగలుగుతారు. హిందీ విధానంలో వెనక్కి తగ్గితే తనకు మద్దతు పెరుగుతుందనుకొన్న ఫడ్నవిస్ కు చుక్కెదురైనట్లే కనిపిస్తోంది. ●



ఉద్ధవ్, రాజ్ ఠాక్రే

---


దేశం

పాకిస్థాన్

# పాక్ కంట్లో నలుసుగా 'బెలూచ్'!

**గన్ని మోహన్**

భారత్‌పైకి నిత్యం కాలుదువ్వుతూ చొరబాట్లు, ఉగ్రవాదం ఇలా తనకు అందివచ్చిన ప్రతి అస్త్రాన్ని ప్రయోగించిన దాయాది పాకిస్థాన్‌కు ఇప్పుడు బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ అదే బిఎల్ఏ పక్కలో బల్లెంగా మారింది. మానీళ్లు, మావనరులు, మా సంపద మాకే దక్కాలంటూ ప్రత్యేక దేశంగా ఆవిర్భవించాలని దశాబ్దాలుగా జరుపుతున్న పోరాటం మరింత ఉద్రిక్తంగా మారింది. ప్రత్యేకించి పాక్‌లో సంకీర్ణకూటమి వచ్చిన తర్వాత ఈ డిమాండ్ మరింత పెరిగింది.తరచూ బెలూచ్ విముక్తి సైన్యం చేస్తున్న ఈ పోరాటంలో అనేక దాడులు చేసి తన లక్ష్యాలను సాధించింది. ఈ బిఎల్ఎను కట్టడిచేసేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నా బెలూచ్ సైన్యం మాత్రం తన దాడులు నిరంతరం కొనసాగిస్తూనే ఉంది.షెహబాజ్‌షరీఫ్ పదవిలోకి రావడం, ఆపై సైనిక చీఫ్‌గా మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఆసిమ్‌మునీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత బెలూచ్ సైన్యం దాడులు మరింత ఉధృతం చేసింది. ప్రత్యేక దేశంగా తాము ఏర్పడి తీరుతామంటూ బెలూచిస్తాన్ ప్రజలు ఎప్పటి నుంచో చేస్తున్న డిమాండ్ ఈసారి ఖచ్చితంగా సాధించుకుంటామన్న ధీమాతో ఉన్నారు. అందుకు సాయుధ పోరాటం ఒక్కటే మార్గం అన్నట్లు వారుచేస్తున్న దాడులు స్పష్టం చేస్తున్నాయి.బెలూచ్ జాతీయ విముక్తి పోరాటం పేరిట చేస్తున్న ఈ సాయుధ పోరును ముందుండి నడిపిస్తున్నది బెలూచిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్ మరికొన్ని స్వతంత్ర పోరాట శక్తులు మాత్రమే. అయినా కూడా సైన్యానికి సైతం అంతుబట్టకుండా దాడులు చేయడంలో వీటికవే సాటిగా నిలుస్తున్నాయి. బెలూచిస్తాన్ ప్రావిన్స్‌లో తాజాగా ఆపరేషన్ బామ్ పేరిట నిర్వహించిన దాడుల్లో ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం అయ్యాయి. 17 చోట్ల చేసిన దాడుల్లో అక్కడ ప్రభుత్వ ఆస్తులు మాత్రమే టార్గెట్‌గా నిలిచాయి. పంజ్‌గూర్, సురాబ్, కెచ్, ఖరన్ వంటి ప్రాంతాలతో పాటు అనేక జిల్లాల్లో దాడులు చేసింది. మక్రాన్ తీరం నుంచి కోహ్-ఎ-సులేమాన్ పర్వతశ్రేణివరకూ తమ పోరాటం విస్తరించిందని బిఎల్ఎఫ్ చెపుతోంది. సైనిక చెక్‌పోస్టులుసైతం ఈ దాడుల్లో ధ్వంసం అయ్యాయి. దాడులు చేయడం బిఎల్ఎఫ్‌కు కొత్తేమీ కాదు. రెండునెలలక్రితమే పాక్‌లో పర్వతశ్రేణుల మధ్య నుంచి వెళ్లే రైలు మార్గంలో జాఫర్‌రైలును హైజాక్ చేసారు. రైలులో ఉన్న పాక్ జవాన్లందరినీ బందీలుగాచేసారు. 90 మందిని కాల్చివేసినట్లు బిఎల్ఎఫ్ ప్రకటించింది. భారత్‌లో పహల్గాం దాడి తర్వాత పాక్ ఉగ్రస్థావరాలపై నిర్వహించిన ఆపరేషన్‌సింధూర్ అనంతరం ఈ బెలూచిస్తాన్ స్వాతంత్ర్య పోరాటం మరింత పెరిగింది. తాము ప్రత్యేక దేశంగా ప్రకటించుకుంటున్నామని, తమ దేశకరెన్సీ,తమ దేశ జెండా, తమ భౌగోళిక స్వరూపంగుర్తించాలంటూ ఇటు భారత్‌తోపాటుఅటు ఐక్యరాజ్యసమితిని కూడా కోరిన సంగతి తెలిసిందే. మరోపక్క ఈ పోరాటాన్ని అణిచివేయాలంటే పాకిస్థాన్‌కు సైనిక పాలన ఒక్కటే మార్గం అన్న ప్రచారం కూడా తెరపైకి వచ్చింది. అందుకు అనుగుణంగానే ఇటీవలి కాలంలో సైనిక చీఫ్ ఆసిమ్ మునీర్ వ్యవహారశైలి కూడా కనిపిస్తోంది. భారత్‌పై తలుచుకున్నపుడల్లా కాలు దువ్వడం, అంతర్జాతీయ వేదికలపై కాశ్మీర్ ఎప్పటికీ మాదే అంటూ ప్రగల్బాలు పలకడం అలవాటైన పాకిస్థాన్ తన దేశంలో ఎదురవుతున్న ముప్పును మాత్రం సర్దుబాటు చేసుకోలేని స్థితిలో ఉంది. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయిన తరుణంలో బెలూచిస్తాన్‌లో ఉన్న అపారమైన వనరులన్నింటినీ చైనాకు తాకట్టుపెట్టి పబ్బం గడుపుకుంటున్నదన్న భావన బెలూచ్ ప్రజల్లో నిలిచింది. వాస్తవానికి బెలూచిస్తాన్‌లో అపారమైన ఖనిజ వనరుల సంపద ఉంది. రాగి, బంగారం, క్రోమైట్, బొగ్గు, ముడి ఇనుముతో పాటు లిథియం వనరులు కూడా అపారంగా ఉన్నాయి. అలాగే బారైట్, సల్ఫర్, మార్బుల్, లెడ్, జింక్ వంటివి అనేక వనరులున్నాయి. రేఖో డిఖ్ ప్రాజెక్టు పరంగా చూస్తే ప్రపంచంలోనే అతిపెఒద్ద రాగి, బంగారం నిల్వలున్న ప్రాంతంగా నిలిచింది. ముస్లింబాగ్ ప్రాంతంలో క్రోమైట్, ఛాగాయ్, ఖుజ్దార్ ప్రాంతాల్లో అపారమైన లిథియం నిల్వలున్నట్లు పాక్‌కు దగ్గరవుతున్న చైనా గుర్తించింది. అందుకే ఈ ప్రాంతంలోనే వివిధ ప్రాజెక్టులు, కారిడార్లు నిర్మించేందుకు పాక్ ప్రభుత్వానికి ఆర్థికవనరులు దండిగా అందిస్తోంది. రానురాను ఈ ప్రాంతంపై పట్టు సాధిస్తున్నది. ఈ ధోరణులు గుర్తించిన తర్వాతనే బెలూచిస్తాన్‌లో స్వాతంత్ర్యపోరాటం, విముక్తి పోరాటం పేరిట ఆందోళనలు పెరిగిపోయాయి. ఇటు బెలూచ్ విముక్తి పోరాటంతో పాటు పాకిస్థాన్‌కు ఇప్పుడు అఫ్ఘాన్ సరిహద్దు వైపు నుంచిమరో ఉగ్రవాదసంస్థ నుంచి ముప్పుపొంచి ఉంది.టిటిపి పేరిట ఈసంస్థ ఒకవిధంగా మారణహోమాన్ని సృష్టిస్తున్నదనే చెప్పాలి. ఈ ఒండు అంతర్గత ముప్పును అధిగమించలేని పాకిస్థాన్ భారత్ పైకి మాత్రం అటు చైనా,ఇటు బంగ్లాదేశ్‌లను కలుపుకుని కయ్యానికి కాలు దువ్వుతోంది. నిజానికి వ్యవసాయం,పశుసంపద కూడా అపారంగా ఉంది. సహజవాయువు, బొగ్గు, ఇతర ఖనిజ వనరుల తవ్వకాలతో ఆర్థిక వ్యవస్థకు ఈ ప్రావిన్స్ మూలస్తంభంగా నిలిచింది. పాక్ నైరుతి భాగంలో ఉన్న బెలూచిస్తాన్‌కు సరిహద్దు ఇరాన్, అఫ్ఘానిస్థాన్‌లతోపాటు ఖైబర్ ఫఖ్తూన్‌క్వా, పంజాబ్, సింధ్‌రాష్ట్రాలు ఉన్నాయి. అపారమైన ఖనిజ వనరులున్న ఈ ప్రాంతాన్ని పాక్ వదులుకునేందుకు సిద్ధంగా లేకపోయినా అగ్రరాజ్యాలు అంటే చైనా,అమెరికా వంటి దేశాలు మాత్రం ఈ ప్రాంతంపైనే ఫోకస్ పెంచాయి. తమ ప్రాంతం అభివృద్ధికి స్థానిక వనరులే కీలకం అని భావించిన బెలూచ్ పౌరుల పోరాటం సాయుధ పోరాటంగా మారటానికిఇదే కారణం.ఈస్థాయిలో ఉద్రిక్తతలు, హింస పెరిగి పోవడానికి కారణం కూడా పాక్ పాలకులేనని చెప్పకతప్పదు. ఇప్పటికైనా తప్పులు తెలుసు కుని ప్రాయా శ్చిత్తం లేకుంటే పాక్ పాలకులు మరింతగా ముప్పును ఎదుర్కొనాల్సి వస్తుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ●



బెలూచ్

---

# ప్రజల జీవితాలతో కల్తీ కల్లు దళారుల చెలగాటం!



మన్నారం నాగరాజు

పొద్దంతా కష్టపడే కార్మికులు, రైతులు సాయంత్రం ఓ గ్లాసు మంచి కల్లు తాగి అలసట మరిచిపోవాలని ఆశ పడతారు.సహజమైన కల్లు ఒక్కసారైనా జీవానికి ఊపిరిలా కావాలి. కానీ వారికి కల్తీ కల్లు నీటికి బాదం వాసనలు కలిపి, రసాయనాలు మిక్స్‌చేసి వాసన వచ్చేలా చేసి, అసలు ఆరోగ్యాన్ని నాశనం చేసే ద్రవ్యాలను కలిపి ప్రజల జీవితాలతో దళారులు ఆడుకుంటున్నారు. కల్లును తాటి చెట్టు లేదా ఈత చెట్టు నుంచి నేరుగా తీసుకుంటారు. దీన్ని త్రాగుట వలన కొంత ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని భావించబడుతుంది. అయితే, కల్లును మితంగా తీసుకుంటే మంచిదే కాని, అధికంగా తీసుకుంటే అనారోగ్యానికి దారితీస్తుంది. కల్లు తయారీలో స్వచ్ఛత లేదనేది మరో సమస్య. అయినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో కల్లు ఆదాయ మూలంగా మారినప్పటికీ, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని కల్లుపై నియంత్రణ అవసరం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కల్తీకల్లు అనేది ఒక పెద్ద ముప్పుగా మారింది. ఇది నేరగాళ్లకు లాభాన్ని తెస్తున్నా, సామాన్య ప్రజలకు మాత్రం విషపూరిత జీవనాన్ని అందిస్తోంది. కల్తీకల్లు ఉత్పత్తి, వ్యాప్తికి అనేక కారణాలు ఉన్నాయి. వీటిని సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా ఈ కారణాలు సామాజిక, ఆర్థిక, పాలనా విధానాలలో లోపాలు కలిగినవిగా చెప్పవచ్చు.అసలైన మద్యం ధరలు అధికం కావడం. రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగాలు చేసే వారు ఎక్కువ ఖర్చు చేయలేరు. అందువల్ల చవకగా దొరికే కల్తీ కల్లు వైపు మొగ్గు చూపుతారు.కల్తీ కల్లు కారణంగా ఎందరో జీవితాలు అర్థంతరంగా ముగిసిపోతున్నాయి. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కల్లు ప్రియుల బలహీనతలను ఆసరాగా చేసుకుని కల్లు డిపో నిర్వాహకులు కల్లులో నిషేధిత మత్తు పదార్థాలు మోతాదుకు మించి కలిపి విక్రయిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని రాబట్టుకునేందుకు ఈ విధంగా అడ్డదారి ఫార్ములాను వాడుతున్నారు. దీంతో కొద్దికొద్దిగా మత్తుకు అలవాటు పడి, ఒక్కరోజు కూడా కల్లు మత్తు లేకుండా ఉండలేని స్థితిలోకి వెళ్లిపోతున్నారు. కల్తీ కల్లుకు బానిసలవుతున్నారు. డిపో నిర్వాహకులు తమ వ్యాపారాన్ని పెంచుకోవడానికి నిరుపేదలు, రోజువారీ కూలీలనే టార్గెట్ చేసుకుంటున్నారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కల్లు గీసే చెట్లు, వాటి నుంచి ఉత్పత్తయ్యే కల్లుకు, ప్రతిరోజూ కల్లు సేవించే కల్లు క్వాంటిటీకి ఎక్కడా పొంతన ఉండదు. దీంతో కృత్రిమంగా కల్లు తయారు చేయడం పైనే దృష్టి సారిస్తున్నారు కల్లు డిపో నిర్వాహకులు. నీళ్లలో తెల్లగా నురుగు వచ్చేలా ఓ లిక్విడ్ కలిపి కల్లులా కనపడేలా కృత్రిమ కల్లును తయారు చేస్తారు. దానిలో మత్తు కోసం డైజోఫాం, ఆల్ప్రాజోలం వంటి నిషేధిత మత్తు పదార్థాలు కలుపుతారు. కల్లు తాగే వారి అవసరాలను బట్టి కొంచెం మోతాదుకు మించి కూడా డైజోఫాం, ఆల్ప్రాజోలం, మిథైల్ ఆల్కహాల్, యాసిడ్లు, రంగు పదార్థాలు వేసి నకిలీగా తయారుచేసి అమ్ముతారు. ఈత చెట్ల నుండి తీసే కల్లు మాదిరిగా కనిపిస్తున్నప్పటికీ సహజసిద్ధమైన కల్లు కాదని తెలిసినా, కృత్రిమంగా మత్తు పదార్థాలు కలిపి తయారుచేసిన కల్లు అని తెలిసినా కల్లు ప్రియులు దాన్నే ఇష్టంగా తాగుతున్నారు. క్రమక్రమంగా కృత్రిమ కల్లుకు బానిసలుగా మారిపోతున్నారు. కల్తీ కల్లు విక్రయాలు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కల్లు డిపో నిర్వాహకుల నుంచి తమకు రావాల్సిన నెలవారీ ముడుపులు ఠంచనుగా వారి జేబుల్లోకి వెళితే ఎవడెలా చస్తే తమకేంటనే ఉద్దేశంతో ఎక్సైజ్ అధికారులు పనిచేస్తున్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసు, ఎక్సైజ్ అధికారులు కొన్ని సందర్భాల్లో పట్టించుకోకపోవడం, లేదంటే లంచాల విషయంలో రాజీపడటం వల్ల ఈ వ్యాపారం పెరుగుతోంది. ఇది కల్తీకల్లు వ్యాపారులకు మరింత ధైర్యాన్ని



ఇస్తోంది. హైదరాబాద్ నగరంలో కల్లు తాగుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా మురికివాడలలో నివసించే పేదలు ఎక్కువగా కల్లు తాగుతున్నారు. కల్లుకు ఉన్న డిమాండును దృష్టిలో ఉంచుకొని కల్లు అమ్మేవారు సింథటిక్ కల్లు తయారుచేయడం మొదలుపెట్టారు. దానిలో మత్తు రావడానికి ప్రమాదకరమైన క్లోరల్ హైడ్రేట్, డైజోపామ్, ఆల్ప్రజోలం వంటివి కలపడంతో ప్రజల ఆరోగ్యంపై చాలా ప్రభావం పడడం మొదలైంది. క్లోరల్ హైడ్రేట్ నాడీ మండలంపై ప్రభావం చూపుతుంది. కడుపులోని పేగులలో మంటలకు కారణమవుతుంది. లివర్ డామేజ్ చేస్తుంది. కంటిచూపు మందగించడం, గుండెపై ప్రభావం చూపుతుంది.ఈ పరిస్థితులను గమనించి 2004లో అప్పటిప్రభుత్వం హైదరాబాద్ నగరంలో 50కి.మీ. లోపు ఈత, తాటి చెట్లు లేనందున దుకాణ దారులు సింథటిక్ కల్లు తయారుచేస్తున్నారని కల్లు దుకాణాలన్నీ మూయించారు. దీనిపై గీత సహకార సంస్థ వారు హైకోర్టును ఆశ్రయించారు. (డబ్ల్యుపి. సంఖ్య 18181 /2004). రాష్ట్ర ప్రభుత్వం ఆబ్కారీ శాఖ పాలసీ ప్రకారం హైదరాబాద్ నగరం చుట్టూ 50 కి.మీ.లలోపు తాటి,ఈత చెట్లు లేవని, హానికరమైన రసాయనాలతో కల్తీ కల్లు తయారుచేసి అమ్ముతున్నారని, 2002 నుంచి 2004 సంవత్సరాలలో కల్తీకల్లు అమ్మకంపై3,100 కేసులు నమోదు చేయడం జరిగిందని, సుమారు 100 మంది కల్తీ కల్లు బారినపడి చనిపోయినారని కోర్టుకు తెలిపింది. ప్రజల ఆరోగ్య దృష్ట్యా హైదరాబాద్ నగరంలో కల్లు దుకాణాలు మూయించినట్లు వెల్లడించింది. ప్రభుత్వ చర్యను కోర్టు సమర్థిస్తూ కేసు కొట్టివేసింది. 2004 నుంచి 2014 వరకు హైదరాబాద్ నగరంలోని కల్లు దుకాణాలు మూతపడ్డాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మూతపడ్డ కల్లు దుకాణాలను ప్రభుత్వం జీఓ 24 ప్రకారం 49 2014న మళ్లీ తెరిపించింది. ప్రభుత్వం నీరా అమ్మకం అంటూ కొత్త రాగం అందుకుంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గుడుంబాను 2015లో ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేసింది. కానీ, కల్తీకల్లు హానికరమని తెలిసినా మూతపడ్డ దుకాణాలు తెరిపించికల్లు తాగడాన్ని ప్రోత్సహించింది. నిజానికి ప్రస్తుత సీజన్లో తాటి చెట్లకు ఆశించిన స్థాయిలో కల్లు ఉత్పత్తి కాదు. ఒకటి రెండు తాటి చెట్ల నుంచికల్లును సేకరించినా, ఇది వారి సొంత అవసరాలకు కూడా సరిపోదు. కానీ జిల్లాలోని ఏ ప్రధాన రోడ్డువెంట చూసినా కృత్రిమ కల్లు దుకాణాలే దర్శనమిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఆయా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, నమూనాలు సేకరించాల్సిన ఎక్సైజ్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈవిషయంపై సరియైన నిర్ణయం తీసుకోవాలి. ఇక తమిళనాడురాష్ట్రంలో తాటి చెట్టు రాష్ట్ర వృక్షం అక్కడ కల్లు అమ్మకం పై నిషేధముంది. తాటికల్లును బెల్లంగా తయారుచేసి గీత పని వారు అధిక లాభాలు పొందుతున్నారు. కేరళ రాష్ట్రంలో కల్లును మత్తు పానీయంగా ప్రకటించారు. దీనిపై గీత కార్మికులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా కేరళ ప్రభుత్వం కల్లులో 8.1శాతం ఆల్కహాల్ ఉంటుందని, మామూలు బీరులో 6 శాతం మాత్రమే ఆల్కహాల్ ఉంటుందని అందుకే కల్లును మత్తుపానీయంగా ప్రకటించామని కోర్టుకి తెలుపగా కేసు కొట్టివేసింది. ఇక మొన్న కూకట్‌పల్లిలో కల్తీ కల్లు తాగి అవస్థకు గురైన వారిలో ఐదుగురు చనిపోయారు. దాదాపు 15 మందిని నిమ్స్,గాంధీ హాస్పిటల్‌లకు తరలించారు. కూకట్‌పల్లి ఉషా ముల్లపూడి రోడ్డులో ఎల్లమ్మబండ ప్రాంతంలోని కల్లు దుకాణాల్లో కల్లు తాగిన వారికి సోమవారం ఉదయం వాంతులు విరోచనాలు అయినట్టు తెలుస్తుంది. కల్తీకల్లు నిర్మూలన ఒకటే ప్రభుత్వ బాధ్యత కాదు. ఇది సమాజం మొత్తం కలసి చేయాల్సిన బాధ్యత. దీన్ని అరికట్టేందుకు కొన్ని ముఖ్యమైన కల్తీకల్లు తయారీదారులపై జీవిత ఖైదు లేదా మరణశిక్ష విధించాలి. నేరస్తులకు బెయిల్ అవకాశాలు తగ్గించాలి. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం చేస్తే వారిపై సస్పెన్షన్‌తో పాటు విచారణ జరిపించాలి. అధిక ధరల వల్ల ప్రజలు కల్తీవైపు వెళ్లకూడదు. చౌక ధరలోహానికర రసాయనాలు లేని మద్యం అందుబాటులో ఉండేలా చూడాలి. గ్రామీణ ప్రాంతాల్లో నాటకాల ద్వారా, విద్యార్థులకు కథానికల ద్వారా కల్తీకల్లు ప్రమాదాలను తెలియజేయాలి. మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించాలి.బాధిత కుటుంబాలకు తక్షణపరిహారం మాత్రమే కాదు దీర్ఘకాలిక పునరావాసం,ఉపాధి అవకాశాలు కల్పించాలి. ●

# దక్షిణాదిరాష్ట్రాల అభివృద్ధితోనే 'వికసిత్ భారత్'

## కేరళలో బిజెపి మొరార్జీభవన్ ప్రారంభించిన హోంమంత్రి అమిత్‌షా



**తిరువనంతపురం, జూలై 12:** దక్షిణాది రాష్ట్రాలు బలోపేతం కాకుండా వికసిత్ భారత్ సాధ్యం కాదు అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. శనివారం కేరళలో బీజేపీ రాష్ట్ర కమిటీ కార్యాలయాన్ని, మొరార్జీ భవన్‌ను ప్రారంభించిన ఆయన, అక్కడి అధికార, ప్రతిపక్ష పార్టీలపై విమర్శల వర్షం కురిపించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం నిర్వహించబోయే నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాల ఆందోళనను గమనించామని, వాటిని కూడా పరిగణనలోనికి తీసుకునే పునర్విభజన జరుగుతుందని ఆయన అన్నారు. సీపీఎం నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్, ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌లు రాష్ట్రంలో అవినీతిని సృష్టించాయని, బుజ్జగింపు రాజకీయాలను అనుసరిస్తున్నాయని దుయ్యబట్టారు. ఈ రెండు పార్టీలు కేరళను పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) లాంటి దేశ వ్యతిరేక శక్తులకు సురక్షితమైన స్వర్గధామంగా మార్చాయని ఆరోపించారు. పుత్తారికండం మైదానంలో జరిగిన వార్డు స్థాయి నాయకుల సమావేశంలో, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో బీజేపీ పెద్ద సమావేశాన్ని నిర్వహించింది. అందులో పాల్గొన్న అమిత్ షా పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ మాత్రమే కేరళ రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకురాగలదు. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ వల్ల ఇది సాధ్యంకాదు. బలమైన దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి లేకుండా వికసిత్ భారత్ సాకారం కాదు. వికసిత్ భారత్‌కు మార్గం వికసిత్ కేరళం ద్వారానే ఉంటుంది. కనుక ఇప్పటి నుంచి బీజేపీ ప్రాథమిక లక్ష్యం వికసిత్ కేరళం అవుతుందని అన్నారు. వికసిత్ కేరళ మిషన్ లోగోను ఆవిష్క రించిన అమిత్ షా ఇదే సభలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పీఠం కంటే కేరళ రాష్ట్ర అభివృద్ధే (వికసిత్ కేరళం) తమ ధ్యేయమని అన్నారు. 2022లో కేంద్ర ప్రభుత్వం పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియాఫి (పీఎఫ్ ఐ)తోపాటు, దాని అనుబంధ సంస్థలను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటిం చింది. అయితే పీఎఫ్ఐపై కేరళ ప్రభుత్వం నిషేధం విధించలేదు. దీనిపై కూడా అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎఫ్ఐ సంస్థపై నిషేధం విధించే అన్ని అధికారాలు కేరళ ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, ఎందుకు అలా చేయ డంలేదని ప్రశ్నించారు. కానీ మోదీ సర్కార్ దేశ వ్యతిరేక శక్తులపై ఉక్కుపాదం మోపిందని, అందులో భాగంగా వివిధ ప్రాంతాలకు వ్యాపించిన పీఎఫ్ఐపై నిషేధం విధించి, దాని అగ్ర నాయకులను అరెస్ట్ చేయించిందని అమిత్ షా పేర్కొన్నారు. బీజేపీ, సీపీఎం రెండూ కేడర్ ఆధారిత పార్టీలు. అయితే ఈ రెండు పార్టీల మధ్య ప్రధానమైన వ్యత్యాసం ఉంది. బీజేపీ కేడర్ కోసం కాకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేస్తుంది. కానీ సీపీఎం రాష్ట్ర అభివృద్ధి కంటే కార్యకర్తల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తుందని అమిత్ షా అన్నారు. అసోం, త్రిపురల్లో బలమైన పార్టీలు ఉన్నప్పటికీ, అక్కడ బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసిందని, అలాగే తమిళనాడులో కూడా తమ పార్టీ అధికారంలోకి వస్తుందని అమిత్ షా అన్నారు. ఇక 2026 కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి, ప్రభుత్వం ఏర్పాటు చేయడమే లక్ష్యంగా బీజేపీ బరిలోకి దిగుతుందని ఆయన ప్రకటించారు. కేరళలో ఈ ఏడాది చివర్లో స్థానిక సంస్థల ఎన్నికలు, వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే అమిత్ షా కేరళలో బీజేపీ రాష్ట్ర కమిటీ కార్యాలయాన్ని, మొరార్జీ భవన్‌ను ప్రారంభించారు.



# ఉత్పత్తిరంగమే ఉపాధికల్పనకు మూలం

## రోజ్‌గార్‌మేళా 16వ ఎడిషన్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూలై 12:** ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేందుకు భారత్ వేగంగా అడుగులు వేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన గత 11 ఏళ్లలో ప్రతి రంగంలోనూ దేశం పురోగతి సాధించిందని పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళ 16వ ఎడిషన్‌లో వర్చువల్‌గా ప్రధాని మోదీ ఈసందర్భంగా కొంతమందికి రోజ్‌గార్ నియామకపత్రాలను అందజేసారు. భారతదేశానికి ఉన్న గొప్ప బలాల్లో తయారీ రంగం ఒకటని అన్నారు. తమ ప్రభుత్వం ప్రైవేట్ రంగంలో ఉపాధి పెంచడానికి చర్యలు చేపడుతోందని వెల్లడించారు. భారత ప్రభుత్వం ప్రైవేట్ రంగంలో కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడంపై దృష్టి పెట్టింది. ఇందుకోసం ఇటీవలే ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకం (ఈఎల్ఐ) ను ఆమోదించింది. ఈ పథకం కింద, ప్రైవేట్ రంగంలో మొదటిసారి ఉద్యోగాన్ని పొందినవారికి ప్రభుత్వం మొదటి నెల రూ.15,000 అందిస్తుంది. ఇందుకోసం ప్రభుత్వం దాదాపు రూ.1లక్ష కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. ఈ పథకం సుమారు 3.5 కోట్ల ఉద్యోగాలు సృష్టించడంలో సహాయ పడుతుందని మోడీ అన్నారు. తమ ప్రభుత్వం తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. నేడు భారతదేశపు గొప్ప బలాల్లో తయారీ రంగం ఒకటి. దీని ద్వారా పెద్ద సంఖ్య ఉద్యోగాలు సృష్టించబడుతున్నాయి. అందుకే తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఈ సంవత్సరం బడ్జెట్‌లో మిషన్ మాన్యుఫాక్చరింగ్‌ను ప్రకటించాం. అంతేకాదు మేము మేక్ ఇన్ ఇండియా ప్రచారాన్ని బలోపేతం చేశాము. భారత్‌లో ఎలక్ట్రానిక్స్, మొబైల్ ఫోన్ తయారీ, రక్షణ తయారీ రంగాలు భారీ స్థాయిలో వృద్ధి సాధించాయని మోదీ తెలిపారు. పీఎల్ఐ స్కీమ్ కింద దేశంలో 11 లక్షల ఉద్యోగాలు సృష్టించామన్నారు. ముఖ్యంగా ఇటీవలి సంవత్సరాల్లో మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్స్ రంగాలు బాగా విస్తరించాయి. నేడు దేశంలో రూ.11 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ తయారవుతున్నాయి. గత 11 ఏళ్లలో ఈ రంగం 5 రెట్లు ఎక్కువగా వృద్ధి సాధించింది. గతంలో మొబైల్ ఫోన్ తయారీలో 24 యూనిట్లు మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడు ఇవి 300 యూనిట్లకు పెరిగాయి. ఇందులో లక్షలాది మంది యువత పనిచేస్తున్నారు అని మోదీ చెప్పారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ ఉత్పత్తుల తయారీలో వేగవంతమైన వృద్ధి జరుగుతోందని మోదీ అన్నారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో భారత్ కొత్త రికార్డులు సృష్టిస్తోందని మన డిఫెన్స్ ప్రొడక్షన్ ఏకంగా రూ.1.25 లక్షల కోట్లు దాటిపోయిందన్నారు.

# చిరాగ్‌పాశ్వాన్‌ను హత్య చేస్తామని ఇన్‌స్టా పోస్టులు!

## సైబర్‌సెల్‌కు ఫిర్యాదులు చేసిన ఎల్జేపీ నాయకులు



**పాట్నా,జూలై 12:** కేంద్ర మంత్రి లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్‌కు సోషల్ మీడియాలో హత్యా బెదిరింపులు వచ్చాయని, ఆయన పార్టీ ప్రతినిధి రాజేష్ భట్ శుక్రవారం తెలిపారు. చిరాగ్‌ను చంపేస్తానని బెదిరిస్తూ టైగర్ మెరాజ్ ఇడిసి పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టారని ఆయన తెలిపారు. ఈ సంఘటన బిహార్ రాజకీయాల్లో కలకలం రేపింది. ఈ విషయంపై భట్ పాట్నాలోని సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాశ్వాన్‌కు పెరుగుతున్న ప్రజాదరణ కారణంగానే ఈ బెదిరింపులు వచ్చాయని పేర్కొన్నారు. పోలీసులు వెంటనే ఈ విషయంపై స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. గతవారం సారన్‌లో జరిగిన సభలో పాశ్వాన్ ప్రసంగించారు. అందులో రాబోయే బిహార్ ఎన్నికలకు తాను పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. బిహార్ ప్రజలు, సోదర సోదరీమణుల కోసం పోటీ చేస్తానని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ఈ క్రమంలోనే ఆయనకు హత్యా బెదిరింపులు రావడం గమనార్హం. ఈ ఏడాది చివర్లో అక్టోబర్ లేదా నవంబర్‌లో బిహార్ ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఇందుకు సంబంధించి భారత ఎన్నికల కమిషన్ అధికారిక తేదీని ప్రకటించలేదు. ఎన్నికల్లో నేను ఏ స్థానం నుంచి పోటీ చేయాలనేది ప్రజలే నిర్ణయిస్తారు. నేను ఏ నిర్ణయం తీసుకున్నా అది ప్రజల మంచి కోసమే" అని చిరాగ్ పేర్కొన్నారు. చిరాగ్ పాశ్వాన్ రాష్ట్ర రాజకీయాల్లోకి తిరిగి రావడం కీలక పరిణామంగా మారబోతోంది.

# ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థలు ధ్వంసం: రష్యా రక్షణ శాఖ వెల్లడి



**మాస్కో, జూలై 12:** ఉక్రెయిన్‌పై రష్యా భారీ స్థాయిలో దాడులు కొనసాగిస్తోంది. తాజాగా కీవ్‌లోని ఆయుధ పరిశ్రమలపై మాస్కో 600 డ్రోన్లు, క్షిపణులతో వైమానిక దాడులకు పాల్పడింది. ఉక్రెయిన్‌కు చెందిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ కేంద్రాలు, సైనిక వైమానిక స్థావరాలపైనా దాడులు నిర్వహించినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా నివాస భవనాలు, మౌలిక సదుపాయాలు, విశ్వవిద్యాలయాలు దెబ్బతిన్నాయి. పదులసంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. రష్యా ప్రయోగించిన 319 డ్రోన్లు, 25 క్రూజ్ క్షిపణులను నేలకూల్చినట్లు ఉక్రెయిన్ ఎయిర్ డిఫెన్స్ ఫోర్స్ వెల్లడించింది. కీవ్ చేపట్టిన ఎదురుదాడుల్లో మాస్కోలోని పలు భవనాలు ధ్వంసమయ్యాయి. తమతో జరుగుతున్న యుద్ధంలో రష్యా వాడుతున్న 40 శాతం బాలిస్టిక్ క్షిపణులు, ఫిరంగి వ్యవస్థలు ఉత్తరకొరియా నుంచే రష్యాకు అందుతున్నాయని ఉక్రెయిన్ ఆరోపించిన కొన్ని గంటల్లోనే పుతిన్ సేనలు ఈ దాడులకు పాల్పడడం గమనార్హం. పుతిన్ సేనలు కొనసాగిస్తున్న యుద్ధానికి గట్టిగా బదులు చెప్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శుక్రవారం పేర్కొన్నారు. యుద్ధం విషయంలో త్వరగా ఓ నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌కు తాత్కాలికంగా నిలిపివేసిన కొన్ని ఆయుధాల సరఫరాను తిరిగి ప్రారంభించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ఇందులో 155 ఎంఎం మందుగుండు సామాగ్రితో పాటు జిఎంఎల్ఆర్ ఎస్‌గా పిలిచే ప్రెసిషన్ గైడెడ్ రాకెట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

## వీసా వస్తే సరిపోదు.. నిబంధనలు పాటించాల్సిందే

# 'బహిష్కరణ ముప్పు'పై యుఎస్ హెచ్చరిక




**వాషింగ్టన్, జూలై 12:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి వలసదారులపై కఠిన వైఖరి అనుసరిస్తున్నారు. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. అయితే, వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని అగ్రరాజ్యం తాజాగా హెచ్చరించింది. ఈ మేరకు భారత్‌లోని యుఎస్ రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది. 'వీసా మంజూరుతోనే వలసదారులపై స్క్రీనింగ్ ఆగిపోదు. వారి ప్రతి కదలికను నిశితంగా గమనిస్తూనే ఉంటాం. అమెరికా చట్టాలు, ఇమిగ్రేషన్ నిబంధనలను వీసాదారులు తప్పనిసరిగా పాటించాల్సిందే. వాటిని అతిక్రమిస్తే మాత్రం తక్షణం వీసాలను రద్దుచేసి దేశం నుంచి వెళ్లగొడతాం' అని ఎంబసీ తమ పోస్టులో స్పష్టం చేసింది. వీసా దరఖాస్తుదారులు తప్పనిసరిగా తమ ఐదేళ్ల సోషల్ మీడియా ఖాతాలను సమర్పించాల్సి ఉంటుందని ఇటీవల అమెరికా వెల్లడించిన విషయం తెలిసిందే. ఫేస్‌బుక్, లింక్డిన్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌ఖాతాలనూ,అందులో అభ్యర్థులు చేసిన పోస్టులు, కామెంట్లు, వెల్లడించిన అభిప్రాయాలనూ అగ్రరాజ్య అధికారులు పరిశీలిస్తారు. అలా అని వాటిలో ఉన్న పోస్టులు ఏవీ ఇప్పుడు డిలీట్ చేయడానికివీల్లేదు. ఒకవేళ అలా చేసినట్లు కనిపిస్తే పరిశీలన మరింత లోతుగా వెళ్లి తనిఖీచేసే అవకాశం ఉంటుంది. ఈ వివరాలను ఇవ్వకపోతే వీసా తిరస్కరిస్తారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకమైన ఆలో చనలు ఉన్నట్లు కనిపించిన వ్యక్తులను దేశంలోకి రాకుండా చూడటంకోసం ఈ 'సోషల్ మీడియా వెట్టింగ్'ను అగ్రరాజ్యం తీసుకొచ్చినట్లు తెలు స్తోంది.



# ప్రేమకోసం సరిహద్దులు దాటి కటకటాల పాలు!

**ఐజ్వాల్, జూలై 12:** ప్రేమ కోసం సరిహద్దు దాటిన యువతి భారత్‌లో కటకటాల పాలైంది. తమ ప్రేమను పంచుకోవడానికి అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన బంగ్లాదేశ్ యువతి గుల్షానా అఖ్తర్‌ను త్రిపుర పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ ఘటన త్రిపురలోని సెపాహిజాల జిల్లాలో చోటుచేసుకుంది. ఆమె కోసం కర్ణాటక నుంచి వచ్చిన ప్రియుడు దత్తా యాదవ్‌ను కూడా త్రిపుర పోలీసులు అరెస్ట్ చేశారు. గుల్షానా అఖ్తర్ బంగ్లాదేశ్‌లోని బొగురా జిల్లాలోని పల్సా గ్రామానికి చెందిన యువతి. ఆమెకు 8నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా భారతదేశానికి చెందిన దత్తా యాదవ్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. దత్తా యాదవ్ కర్ణాటకలోని బెంగళూరులో నివసిస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో వారి పరిచయం టెక్స్ట్ మెసేజ్‌లు, ఫోటోలు, వీడియో కాల్స్ ద్వారా కొనసాగింది. ఈ వర్చువల్ పరిచయం క్రమంగా గాఢమైన ప్రేమగా మారింది, చివరికి వారు వ్యక్తిగతంగా కలుసుకోవాలనే తీవ్రమైన కోరికను పెంచుకున్నారు. ఈ కోరికతోనే గుల్షానా గురువారం సరిహద్దు దాటడానికి ప్రమాదకరమైన నిర్ణయం తీసుకుంది. అదే సమయంలో, దత్తా బెంగళూరు నుండి త్రిపురలోని సెపాహిజాల జిల్లాలో ఉన్న హరిహోర్దులా సరిహద్దు గ్రామానికి చేరుకున్నాడు. వారిద్దరూ సరిహద్దు వద్ద కలుసుకున్నప్పటికీ, వారి ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. సమాచారం అందుకున్న భారత సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఆ జంటను అదుపులోకి తీసుకుంది. వెంటనే వారిని మధుపూర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. గురువారం వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. గుల్షానా మరియు దత్తాలపై పోలీసులు పాస్‌పోర్ట్ చట్టం, విదేశీయుల చట్టం, మరియు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద కేసులు నమోదు చేశారు.

# సెల్ఫీతీసుకుందామని భర్తను నదిలోకి తోసేసిన భార్య

**బెంగళూరు, జులై 12:** కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కద్లూరు వద్ద సెల్ఫీ తీసుకునే నెపంతో భర్తను కృష్ణా నదిలోకి తోసివేసిన ఘటన కలకలం రేపింది. కర్ణాటకతెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఈ అమానుష ఘటన చోటు చేసుకుంది. నదిలో పడిపోయిన భర్తను గ్రామస్థులు చాకచక్యంగా రక్షించడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే తాయప్ప, చిన్ని అనేదంపతులు కృష్ణానది ఒడ్డున విహార యాత్రకు వచ్చారు. ఇద్దరూ సెల్ఫీలు తీసుకుంటుండగా, భార్య చిన్ని తన భర్త తాయప్పను ఒక్కసారిగా నదిలోకి తోసివేసింది. ఊహించని ఈ పరిణామంతో తాయప్ప నీటిలో పడిపోయి ప్రాణాలకోసం అల్లాడాడు. అయితే, అతడు నీట మునుగుతుండడాన్ని గమనించిన స్థానికులు వెంటనేస్పందించి, తాళ్ల సాయంతో సురక్షితంగా బయటకు తీశారు. ఈఘటనపై తాయప్ప స్పందిస్తూ, తన భార్య తనను చంపడానికి పథకం ప్రకారం నదిలోకి తోసిందని ఆరోపించాడు.

# 8వ పేకమిషన్ సిఫారసులపైనే ఉద్యోగుల ఫోకస్




**న్యూఢిల్లీ,జూలై 12:** కేంద్రం అమలుచేయనున్న 8వ వేతన సంఘం సిఫారసులకోసం 1.12 కోట్ల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఇది 7వ వేతన సంఘం గడువు డిసెంబర్ 2025తో ముగిసిన వెంటనే ప్రారంభమవుతుంది. 8వ వేతన సంఘం ప్రాథమిక వేతనం, అలవెన్సులు, పెన్షన్లు, పదవీ విరమణ ప్రయోజనాలను పెంచే అవకాశం ఉన్నందున, ఇది వచ్చే ఏడాది జనవరి 2026 నుంచి అమల్లోకి వస్తుందా లేదా ఆలస్యం అవుతుందా అని చాలా మంది ఆందోళన చెందుతున్నారు. 8వ వేతన సంఘం 2027లో అమలులోకి వచ్చే అవకాశం ఉందని ఒక నివేదిక పేర్కొంది. దీనికి కారణం జనవరి 2025లో కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సంఘాన్ని ప్రకటించినప్పటికీ, జులై 2025 వరకు దాని ఛైర్మన్, సభ్యులు లేదా నిబంధనలకు సంబంధించిన వివరాలను వెల్లడించలేదు. మరోవైపు ఇప్పటికే 8వ వేతన సంఘం ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల జీతాలు, పెన్షన్లను 3034 శాతం వరకు పెంచే అవకాశం ఉందని అంబిట్ క్యాపిటల్ నివేదిక అంచనా వేసింది. ఈదృష్ట్యా 2027వరకు అమలులోకి వచ్చే అవకాశం లేదు. కమిషన్ ఏర్పాటు నుంచి అమలు వరకు చాలా సమయం పడుతుంది. 7వ వేతన సంఘం ఫిబ్రవరి 2014లో ఏర్పాటైతే, అది జనవరి 2016 నుంచి మాత్రమే అమలులోకి వచ్చింది. సుప్రీంకోర్టు న్యాయవాది సందీప్ బజాజ్ అభిప్రాయం ప్రకారం, 8వ వేతన సంఘం జనవరి 2025లో అధికారికంగా ప్రకటించినప్పటికీ, దాని పురోగతి నెమ్మదిగా ఉంది. కమిషన్ ఛైర్‌పర్సన్, సభ్యుల నియామకం, నిబంధనల ఖరారు వంటి ముఖ్యమైనవి ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. వేతన సంఘాలు సాధారణంగా వాటి ఏర్పాటు నుంచి అమలు వరకు 2 సంవత్సరాలు తీసుకుంటాయని బజాజ్ తెలిపారు. దీని ప్రకారం, 8వ వేతన సంఘం జనవరి 2026 నుంచి అమలులోకి వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఇది 2027 వరకు వాయిదా పడే అవకాశం ఉందని తెలుస్తోంది. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో 8వ వేతన సంఘానికి ఎటువంటి నిధులు కేటాయించలేదని బజాజ్ ప్రస్తావించారు. యాంబిట్ క్యాపిటల్ డేటా ప్రకారం, జీతాలు, పెన్షన్లలో అంచనా వేసిన 3034 శాతం పెంపును పరిగణనలోకి తీసుకోవడానికి ప్రభుత్వానికి అదనంగా రూ. 1.8 లక్షల కోట్లు అవసరం అవుతాయి.

# సోషల్ మీడియాలో విడియో చేస్తే రోడ్డు రాదు!

## గర్భిణులు వైరల్‌చేసిన విడియోపై మధ్యప్రదేశ్ మంత్రి వ్యాఖ్యలు



**సిద్ధి(ఎంపీ)జూలై 12:** మధ్యప్రదేశ్‌లోసిధి జిల్లాలోని ఒక గ్రామానికి చెందిన కొంతమంది గర్భిణీ స్త్రీలు తమ గ్రామానికి రోడ్డు కావాలంటూ ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా అది వైరల్‌గా మారడం, ఆపై ఎంపీ మంత్రి స్పందించిన తీరు అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఖడ్డీ ఖుర్ద్ గ్రామానికి సరైన రోడ్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గర్భిణీలు ఆస్పత్రులకు వెళ్లాలంటే అరిగోస అనుభవిస్తున్నారు. ఈ క్రమంలో లీలా సాహు అనే మహిళ గ్రామంలోని కొంతమంది గర్భిణీలతో కలిసి తమకు రోడ్డు కావాలంటూ 2023లో ఓ వీడియో చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఆ పోస్ట్‌ను ప్రధాని మోడీతో పాటు నితిన్ గడ్కరీకి ట్యాగ్ చేసింది. మధ్యప్రదేశ్ నుంచి 29మంది ఎంపీలను గెలిపించాం. కానీ మేం రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని రాసుకొచ్చింది. లీలాకు సోషల్ మీడియాలో లక్ష మంది ఫాలోవర్లు ఉండడంతో అది వైరల్‌గా మారింది. దీంతో తగిన చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరిస్తామని స్థానిక కలెక్టర్ సహా ఎంపీ హామీ ఇచ్చారు. కానీ ఏడాది గడిచినా ఆ గ్రామానికి రోడ్డు రాలేదు. ఈ క్రమంలో బీజేపీ ఎంపీ రాజేశ్ మిశ్రా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. మహిళ డెలివరీ డేట్‌కు వారం ముందు రోడ్డు వేస్తామని అన్నారు. అంతేకాకుండా ఆమె కోరుకుంటే మా వద్దకు రావచ్చు. ఆమెకు అన్నీ సౌకర్యాలు కల్పిస్తాం. కానీ ఇలా బహిరంగంగా మాట్లాడడం కరెక్ట్ కాదు. అత్యవసరమైతే తమ వద్ద హెలికాప్టర్లు ఉన్నాయి. ఆశా కార్యకర్తలతో పాటు అంబులెన్స్‌లు ఉన్నాయని అన్నారు. అటవీశాఖ అనుమతుల వల్ల రోడ్డు వేయడం ఆలస్యం అవుతుందని చెప్పారు. ఆన్ లైన్‌లో వీడియో పెట్టగానే సమస్యలు పరిష్కారం కావని మంత్రి రాకేశ్ సింగ్ అన్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టగానే వారి వద్దకు సిమెంట్, కాంక్రీట్‌తో చేరుకోవాలా అని ప్రశ్నించారు. బడ్జెట్ పరిమితంగా ఉంటుందని నిబంధనల ప్రకారం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని తెలిపారు. ఎంపీ, మంత్రి వ్యాఖ్యలపై నెటిజన్లు మండిపడుతున్నారు.

# ప్రాచీన వైద్యపద్ధతులు కృత్రిమ మేధతో విలీనం

## తొలిదేశంగా భారత్: ప్రపంచ ఆరోగ్యసంస్థ వెల్లడి



**జెనీవా,జూలై 12:** భారత్ మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రాచీన వైద్య పద్ధతుల సమాచారాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సమీకృతం చేసిన తొలి దేశంగా భారత్ అవతరించింది. ఈ విషయాన్ని స్వయంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఆయుష్ చికిత్సా పద్ధతుల వివరాలను కూడా ఏఐతో భారత్ సమీకృతం చేసిందని తెలిపింది. ఈ నేపథ్యంలోనే తాము మ్యాపింగ్ ది అప్లికేషన్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ ట్రెడిషనల్ మెడిసిన్ శీర్షికన సంప్రదాయ వైద్య విధానాలపై ఏఐ కార్యాచరణ ప్రణాళికను ప్రకటించామని వెల్లడించింది. ఆయుర్వేద, సిద్ధ, యునాని, సోవా రిగ్పా, హోమియోపతి వంటి ప్రాచీన వైద్య విధానాలను ట్రెడిషనల్ నాలెడ్జ్ డిజిటల్ లైబ్రరీ ద్వారా డిజిటల్ రూపంలోకి తెచ్చిన తొలి దేశం భారతేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ కొనియాడింది. ఇందులోని విలువైన ప్రాచీన సమాచారాన్ని ప్రతీ వైద్య నిపుణుడు అర్థవంతంగా తెలుసుకునేందుకు ప్రత్యేక ఏఐ టూల్స్ ఉన్నాయని తెలిపింది. డిజిటల్ ఆరోగ్య ఆవిష్కరణలతో పాటు ప్రాచీన వైద్య విధానాల సమాచారాన్ని భావితరాలకు చేర్చే విషయంలో ప్రపంచంలో అగ్రగామిగా భారత్ నిలవాలనే నరేంద్రమోదీ సర్కారు సంకల్పానికి ఈ పురోగతి నిదర్శనమని తెలిపింది. సంప్రదాయ ఔషధాల వినియోగ సమాచారాన్ని ఏఐతో సమీకృతం చేయాలనే డబ్ల్యూహెచ్ఓ కార్యాచరణ ప్రణాళికకు భారత్ మార్గదర్శిగా నిలిచిందని పేర్కొంది. ప్రాచీన వైద్య పద్ధతులను ప్రోత్సహించేందుకు ఒక శాస్త్రీయమైన వ్యవస్థను అందుబాటులోకి తేవాలనే బలమైన సంకల్పంతో కేంద్ర సర్కారు ముందుకుసాగుతోందని ఆయుష్ శాఖ వెల్లడించింది. ప్రపంచ సంప్రదాయ ఔషధ చికిత్సా మార్కెట్‌లో భారత్ ప్రభావం పెరుగుతోందని, ఏఐ, ఆయుష్ విభాగాల్లో భారత్ కీలక పురోగతిని సాధించిందని, ఆయుర్వేద, సిద్ధ, యునాని, సోవా రిగ్పా, హోమియోపతి వంటి చికిత్సా పద్ధతులపై ఏఐ సాఫ్ట్‌వేర్లను భారత్ అందుబాటులోకి తెచ్చింది. ఈ చికిత్సలు అందించే క్రమంలో రోగి నాడిని పరిశీలించడం, నాలుకను పరీక్షించడం వంటి రోగ నిర్ధరణ పద్ధతులను ఎలా అనుసరించాలనే సమాచారం ఆయా సాఫ్ట్‌వేర్లలో ఉందని డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది. రోగులకు ఆయుర్వేద చికిత్సను అందించే క్రమంలో వాత, పిత్త, కఫ దోషాలను గుర్తిస్తారు. ఇందుకోసం ప్రకృతి మదింపు పరీక్ష చేస్తారు. మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లు, డీప్ న్యూరల్ నెట్‌వర్క్‌లతో ఈ మదింపును చేసేలా టెక్నాలజీని భారత్ అందుబాటులోకి తెచ్చింది. భారత్ తీసుకొచ్చిన ఆయుర్ జీనోమిక్స్ కాన్సెప్ట్‌ను డబ్ల్యూహెచ్ఓ కొనియాడింది. ఆయుర్వేద సిద్ధాంతాలతో జీనోమిక్స్‌ను మిళితం చేయడం గొప్ప విషయమని పేర్కొంది. జీనోమిక్స్ అనేది జీవరాశుల డీఎన్ఏలు, జన్యువుల గురించి అధ్యయనం చేస్తుంది. ఏయే వ్యాధులు ఎందుకు వస్తాయి, ఎలాంటి ఆరోగ్య సమస్యలకు ఏవిధమైన పరిష్కారాలు ఉంటాయి, అనే ప్రశ్నలకు ఆయుర్వేదం ప్రకారం సమాధానాలను అందించే ఏఐ సాఫ్ట్‌వేర్‌లను భారత్ అందు బాటులోకి తెచ్చింది.

# సంక్షిప్తంగా..

## ఇరాన్‌లో బాలికపై హత్యాచారం: దోషికి బహిరంగ మరణశిక్ష



**టెహ్రాన్, జూలై 12:** ఓ బాలికను హత్యాచారం చేసిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి ఇరాన్ అధికారులు బహిరంగంగా మరణశిక్ష విధించారు. ఈ మేరకు స్థానిక మీడియా కథనాల మేరకు బుకాన్‌కు చెందిన ఓ బాలికపై అత్యాచారం, హత్య చేసిన కేసులో ఓ వ్యక్తి దోషిగా తేలాడు. అతడికి బహిరంగంగా మరణశిక్ష విధించాలని బాధిత కుటుంబసభ్యులు, ప్రజల నుంచి పెద్ద ఎత్తున అభ్యర్థనలు వచ్చాయి. మార్చిలో అతడికి మరణశిక్ష ఖరారు కాగా సుప్రీంకోర్టు కూడా దాన్ని సమర్థించింది. భావోద్వేగాలతో ముడిపడిన కేసు కాబట్టి కఠినశిక్షపై నిర్ణయం తీసుకున్నామని న్యాయ మూర్తి పేర్కొన్నారు. బాధిత కుటుం బసభ్యుల కోరిక మేరకు శిక్షను విధిస్తున్నట్లు చెబుతూ తాజాగా దాన్ని అమలు చేశారు.

## భర్త సెల్‌ఫోన్ చోరీకి భార్య సుపారీ..

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఇద్దరు వ్యక్తులు వున్నట్లుండి అతన్ని అడ్డగించి సెల్‌ఫోన్‌ను లాక్కున్నారు. దీనిపై బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేసి, సెల్‌ఫోన్ చోరీ చేసిన నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసి విచారించగా అదిరిపోయే ట్విస్ట్ వెలుగు చూసింది. సెల్‌ఫోన్ చోరీ చేయమని బాధితుడి భార్య తమకు సుపారి ఇచ్చిందని నిందితుడు వాంగ్మూలం ఇవ్వడంతో పోలీసులు షాక్‌కు గురయ్యారు. బాధితుడి భార్య కొంతకాలంగా మరో వ్యక్తితో అక్రమ సంబంధం కొనసాగిస్తోంది. అయితే ప్రియుడితో సదరు మహిళ సన్నిహితంగా వున్న ఫోటోలను ప్రియుడు చిత్రీకరించి వాటిని తన సెల్‌ఫోన్‌లో దాచుకున్నాడు. దీని తరువాత తనతో అక్రమ సంబంధం నడిపే మహిళకు పంపాడు. దీంతో పాటు ఆమె భర్తకు కూడా పంపాడు. దీంతో సదరు మహిళ తన అక్రమసంబంధం వ్యవహారంకుటుంబ సభ్యులకు తెలిసిపోయి పరువుపో యేలా వుందని భావించి తన భర్త సెల్‌ఫోన్‌ను దొంగిలించాలని ఇద్దరువ్యక్తులకు సుఫారి ఇచ్చింది. సుఫారి తీసుకున్న నేరగాళ్లు సెల్‌ఫోన్‌ను దొంగిలించారు కానీ నిజాలను మాత్రం పోలీసులకు చెప్పేశారు. ఈకేసులో సెల్‌ఫోన్‌ను దొంగిలించిన నేరగాళ్లలో ఒకడితో పాటు సుఫారి ఇచ్చిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు.

## జీతాలు సరిపోవడంలేదు: ఎంపి కంగనా రనౌత్



**సిమ్లా, జూలై 12 :** రాజకీయ నాయకుల వేతనాలపై ఎంపీ కంగనా రనౌత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, రాజకీయాల్లో నిజాయితీగా పని చేసే ఎంపీలకు వేతనం సరిపోవడం లేదని అన్నారు. తమతో ఉండే సిబ్బందికి జీతాలు ఇచ్చిన తర్వాత ఎంపీలకు మిగిలేది అంతంత మాత్రమేనని అన్నారు. ప్రజాప్రతినిధులు, పీఏలతో కలిసి నియోజకవర్గాలకు వాహనాలలో వెళ్లేందుకు లక్షల రూపాయలు ఖర్చవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశం కనీసం 300 నుండి 400 కిలోమీటర్ల దూరంలో ఉండటమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. రాజకీయాలు చాలా ఖర్చుతో కూడుకున్నవని ఆమె అభిప్రాయపడ్డారు. ఎంపీలకు వచ్చే వేతనం ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. అందుకే మరో ఉద్యోగం చేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ఇప్పటికే చాలామంది ఎంపీలకు వ్యాపారాలు ఉన్నాయని, కొందరు న్యాయవాద వృత్తిలో ఉండగా, ఇంకొందరు ఇతర వృత్తుల్లో ఉన్నట్లు చెప్పారు.

# రైతు పొలంలో పురాతన నాణేలు!



**రాయ్‌బరేలి, జూలై 12:** ఉత్తరప్రదేశ్‌లోని రాయ్ బరేలీ జిల్లా మోరవాన్ తహసీల్‌లోని బైజనాథ్ ఖేడా గ్రామంలో ఆశ్చర్యకర ఘటన వెలుగు చూసింది. జూలై 6వ తేదీ మధ్యాహ్నం గ్రామానికి చెందిన యూసుఫ్ అనే రైతు పొలంలో మేకలు మేపుతోన్న కాపరులు అకస్మాత్తుగా మట్టిలో ఏదో మెరుస్తూ ఉండటాన్ని గమనించారు. దగ్గరగా వెళ్లి చూసేసరికి అవి పాత నాణేలుగా అనిపించాయి. అక్కడే పక్కనే పాత విగ్రహం ముక్కలు, ఇటుకల భాగాలూ కనిపించాయి. వెంటనే గ్రామస్థులు ఈ విషయాన్ని స్థానిక అధికారులకు తెలియజేశారు. సమాచారం అందుకున్న పురాతత్వశాఖ జోక్యం చేసుకొని అధికారికంగా ఆ పొలాన్ని అధీనంలోకి తీసుకుంది. అక్కడి చుట్టూ బ్యారికేడింగ్ వేసి ప్రజల రాకపోకలపై తాత్కాలిక నిషేధం విధించారు. ఈ ప్రాంతంలో పరిశోధనలు జరిపేందుకు లక్నో కేంద్రంగా పని చేసే పురాతత్వశాఖ బృందం రంగంలోకి దిగింది.

# బిసిలపై కాంగ్రెస్ మళ్లీ కుట్ర చేస్తోంది

## 42 శాతం రిజర్వేషన్ల అమలుపై స్పష్టత లేదు

### బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను మళ్లీ మోసం చేయాలని కుట్ర చేస్తుందని బిజెపి శాసనసభ్యుడు పాయల్ శంకర్ అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బిసి రిజర్వేషన్ల అమలు విషయంపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లపై పూర్తి స్పష్టత ఇవ్వాలన్నారు. గతంలో ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌లో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఇద్దరు బిసిలకు టికెట్లు ఇస్తామని చెప్పి, ఆ హామీని కాంగ్రెస్ తుంగలో తొక్కిందన్నారు. బిజెపి బిసి రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు ప్రకటించిందన్నారు. శాసనసభలో కూడా మద్దతుగా నిలిచిందన్నారు. సంవత్సరన్నర పాలనలో కామారెడ్డి డిక్లరేషన్ హామీల అమలు గాలికొదిలేశారని, ప్రతి ఏడాది రూ.20 వేల కోట్లు బిసి సబ్‌ప్లాన్ కింద ఇవ్వాలని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు ఆ నిధుల సంగతే లేదన్నారు. బిసిలను మోసం చేస్తే, ప్రజల ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ సమావేశం ఏర్పాటు చేసి, 42శాతం రిజర్వేషన్ల చర్చ జరపాలని డిమాండ్ చేశారు.

# పవర్ షేరింగ్ కాదు.. పర్సంటేజీల షేరింగ్‌లో కాంగ్రెస్ మంత్రులు నిమగ్నం

### బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** మంత్రులు పవర్ షేరింగ్ కాదు.. పర్సంటేజీల షేరింగ్‌లో మాత్రమే నిమగ్నమయ్యారని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై అధిష్టానం సంతృప్తిగా ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొనడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదన్నారు. వాస్తవానికి 19 నెలల పాలనలో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం జరగకపోయినా, అధిష్ఠానం మాత్రం సంతృప్తిగా ఉంది. కారణమేంటంటే వాళ్లకు కావాల్సిన వాటాలు, కోటాలు సకాలంలో, సరైన రీతిలో అందుతున్నాయి తప్పితే మరేం కాదన్నారు. దీన్ని చూసే కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రైజింగ్ అంటున్నట్టుగా ఉందన్నారు. ఇక్కడ అసలు ప్రశ్న ప్రజలు సంతృప్తిగా ఉన్నారా? ప్రభుత్వ పనితీరు నిజంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందా? అనేది ముఖ్యం అన్నారు. ఇక కాంగ్రెస్ మంత్రుల పనితీరును పరిశీలిస్తే, ఇటీవల ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తెలంగాణకు వచ్చారని, మంత్రుల పనితీరు, అభివృద్ధి రిపోర్టులను పరిశీలించగా చాలా మంది మంత్రులు "బిలో పాస్" మార్కులతో ఉన్నారని అర్థమైందని తెలుస్తుందన్నారు. అంటే రాష్ట్ర మంత్రుల పనితీరు పూర్తిగా అసంతృప్తికరంగా ఉన్నట్టు వారికి బాగా అర్థమైంది.అందుకే ఢిల్లీ అధిష్టానం కాంగ్రెస్ మంత్రులను ఒక్కొక్కరిని పిలిపించి మాట్లాడుతుందన్నారు. ఈ సిరీస్‌లో భట్టి విక్రమార్క సైతం వెళ్లొచ్చారు. తాను చేసిన పనితీరు, తన పదవి రక్షించుకునే ప్రయత్నం కిందే జరుగుతున్నదని స్పష్టంగా అర్థమవుతుందన్నారు.

# బిజెపి నేతలపై డిప్యూటీ సిఎం భట్టి ఆరోపణలు చేయడం దౌర్భాగ్యం

### బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** డిప్యూటీ సిఎం పదవిలో ఉండి ప్రభుత్వాన్ని నడపలేక, ప్రజలకు హామీలు నెరవేర్చలేకపోతున్న భట్టి విక్రమార్క బిజెపి నాయకులపై ఆరోపణలు చేయడం దౌర్భాగ్యం అని బిజెపి తెలంగాణ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్ అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. వేముల రోహిత్ మరణాన్ని రాజకీయ లబ్ధికోసం వాడుకోవడమే కాకుండా, ఆ అంశాన్ని అడ్డుపెట్టుకుని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుపై తప్పుడు ఆరోపణలు చేయడం దుర్మార్గ చర్య అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ దిగజారిన రాజకీయాలకు సంకేతమని, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తన స్థాయిని మరిచి మాట్లాడటం బాధాకరంగా ఉందన్నారు. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వ్యక్తిని పిసిసి అధ్యక్షుడిగా చేసి, ఇప్పుడు సిఎం పీఠానికి చేర్చిన కాంగ్రెస్ పార్టీకి నైతికత గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. ఇతర పార్టీ నాయకులపై నిందలు మోపే ముందు కాంగ్రెస్ పార్టీలో ఉన్న అవినీతి నాయకుల గురించి ఆలోచించుకోవాలన్నారు. రాంచందర్ రావు నక్సలైట్ బెదిరింపులు, దాడులు ఎదుర్కొని తీవ్ర గాయాలపాలైన వ్యక్తి అని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వ్యక్తి అని అన్నారు. అలాంటి నాయకుడిని విమర్శించడం తగదని కాంగ్రెస్ నాయకులను హెచ్చరిస్తున్నామన్నారు. భట్టి విక్రమార్క ఇతర పార్టీల నాయకులపై నిందలు మోపేముందు నేషనల్ హెరాల్డ్ కేసులో బెయిల్ మీద ఉన్న సోనియాగాంధీ, రాహుల్ గాంధీని తొలగించమని డిమాండ్ చేయాలన్నారు. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడైన రేవంత్ రెడ్డి సిఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేయాలని, కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు, యువత అందరూ మోసపోయారన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ సరిగ్గా అమలు కాలేదన్నారు. ప్రజల మద్దతుతో బిజెపి ఎదుగుతుందని, కాంగ్రెస్ నేతలు మాట్లాడే ప్రతి అసత్యానికి ప్రజలే సమాధానం చెబుతారన్నారు. ఆర్థిక మంత్రిగా భట్టి విక్రమార్క రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని అన్నారు. వడ్డీ చెల్లింపులకే అప్పులు తెచ్చే స్థితికి తీసుకువచ్చారు. రాష్ట్రం ఆర్థికంగా విఫలమైందనే సత్యాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిన తీరును, కాంగ్రెస్ నాయకుల మాయ మాటల వెనుక కుట్రలను బహిర్గతం చేయడంలో బిజెపి ఎస్సీ మోర్చా సిద్ధంగా ఉందన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి గత, ప్రస్తుత చరిత్రను, ప్రభుత్వ విధాన వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టేలా ఎస్సీ మోర్చా ఎల్లప్పుడూ ముందుండి దిశగా పనిచేస్తుందన్నారు.



ధర్నాలో ప్రసంగిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం వేయాలి

### మహాధర్నాలో ఎంపి ఈటల రాజేందర్ డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూలై 12, ప్రభాతవార్త:** ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికై మంత్రివర్గ ఉపసంఘం వేయాలని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేం దర్, ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 30 సంవత్సరాలుగా ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం అమలవుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారని అన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల మీద మంత్రివర్గ ఉపసంఘం వేయాలని డిమాండ్ చేశారు. రాజ్యసభసభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ విధానం అన్యాయమని, దీన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల్లో మార్పు రావాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను శాసనసభలో లేవనెత్తుతానని అన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

# దేశ ప్రగతికి యువతే పునాది

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి




కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, అధికారులు

**హైదరాబాద్ (సికిందరాబాద్), జూలై 12, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ స్వప్నమైన వికసిత్ భారత్ 2047 లక్ష్యాలను చేరుకోవడంలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైందని, ఉద్యోగులు శక్తివంచన లేకుండా కృషి చేయాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సికిందరాబాద్ రైల్ కళారాంగ్‌లో జరిగిన 16వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇప్పటివరకు జరిగిన 15 విడతల రోజ్‌గార్ మేళాలో దేశవ్యాప్తంగా 10 లక్షల 50 వేల మందికి నియామక పత్రాలు అందజేశామని, ఈ విడతలో మరో 51వేల మందికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా (సగటున 30 ఏళ్లు) ఉండటం మన దేశానికి ముఖ్యబలమన్నారు. ఇది దేశం పట్ల మన బాధ్యతను మరింతగా పెంచడంతోపాటుగా విస్తృతమైన అవకాశాలకు బాటలు వేసిందన్నారు.

ఈ యువశక్తి సామర్థ్యం కారణంగానే ఇవాళ మనం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగామన్నారు. మోడీ నేతృత్వంలో కేవలం ఉద్యోగాల కల్పనతోపాటుగా యువతే కొత్త అవకాశాలను సృష్టించేలా సంపూర్ణమైన సహకారాన్ని అందిస్తున్నామన్నారు.

యువత ఉద్యోగాల కోసం వేచి చూసే పాత పద్ధతికి స్వస్తి పలికి వారికి స్టార్టప్స్, స్కిల్లింగ్ వంటి వాటి ద్వారా సాధికారత కల్పిస్తూ ఓ బలమైన వ్యవస్థను నిర్మించే దిశగా ప్రధాని పనిచేస్తున్నారన్నారు. దీని ఫలితంగా 2017 నుంచి 8.5 కోట్ల మందికి కొత్త ఉద్యోగాలొచ్చాయని ఈపీఎఫ్ఓ లెక్కలు తెలియజేస్తున్నాయన్నారు. 2025లోనే 1.13 కోట్ల మంది ఇపిఎఫ్ఒలో చేరారన్నారు. స్టార్టప్ ఇండియా ద్వారా యువతను ఉద్యగ కల్పనకోసం ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా 1.6 కోట్ల మంది యువత నైపుణ్యాభివృద్ధి జరిగిందని వివరించారు.

అంతకుముందు దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్ స్వాగత ప్రసంగం చేశారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే అధికార పరిధిలో, రైల్వేలతో సహా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు మొదలైన వాటిలో 200 మంది నియామకపత్రాలను అందు కుంటున్నారని ఆయన పేర్కొన్నారు.

# రోహిత్ వేముల దళితుడు కాదని సర్కారే చెప్పింది కదా?

## కుల వివక్షకు గురైనట్లు ఆధారాల్లేవని కోర్టు కేసును ముగించింది

### బిజెపి ఎంపి జి.నగేశ్

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** హెచ్‌సియు విద్యార్థి రోహిత్ వేముల దళితుడే కాదని ఈ కేసుపై విచారణ చేపట్టిన సైబరాబాద్ పోలీసులే తేల్చారని బిజెపి ఎంపి జి.నగేశ్ అన్నారు. శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కుల వివక్షకు గురైనట్లు ఆధారాల్లేవని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే కోర్టుకు నివేదించారన్నారు. అలాంటప్పుడు ఆత్మహత్యకు బిజెపి అధ్యక్షుడు రాంచందర్ రావుకి ఏం సంబంధం? అంటూ ప్రశ్నించారు. రోహిత్ వేముల కేసులో నమోదైన ఎఫ్ఐఆర్‌లో రాంచందర్ రావు పేరు లేదని, ఆయనపై ఎలాంటి చట్టపరమైన కేసు లేదనే విషయాన్ని పోలీసులే స్పష్టం చేశారన్నారన్నారు.

సుదీర్ఘ విచారణ చేసిన హైకోర్టు ఈ కేసును ముగించిందన్నారు. అయినప్పటికీ రామచందర్‌రావుపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆరోపణలు చేయడం దుస్సాహసం అన్నారు. పోలీస్ వ్యవస్థను, కోర్టులను చులకన చేయడమే అన్నారు. రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని ప్రమాణం చేసి డిప్యూటి సిఎం పదవిలో కొనసాగుతున్న భట్టి విక్రమార్క రాజ్యాంగానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నారన్నారు. కోర్టు తీర్పులను అంగీకరించలేని నేతలు అధికారంలో ఉండడం ప్రమాదకరమని, గతంలో బిఆర్ఎస్ చేసిన ఆరోపణలనే నిన్న భట్టి విక్రమార్క వల్లె వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కెసిఆర్ కుటుంబంపై ఎన్ని అవినీతి స్కాంలు వచ్చినా తూతూ మంత్రంగా విచారణలు జరుపుతూ అరెస్ట్ చేయకుండా కాంగ్రెస్ నేతలు కాపాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ పాలనా వైఫల్యాలను ప్రజల నుండి దాచేందుకే కాంగ్రెస్ నేతలు ఇట్లాంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ పబ్బం గడుపుతున్నారంటూ మండిపడ్డారు. ఇది కచ్చితంగా ప్రజాస్వామ్యానికి వ్యతిరేక చర్య అని, ఇటువంటి విచ్ఛిన్నకర రాజకీయాలకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పడం తథ్యం అన్నారు.

# తెలంగాణ అస్తిత్వంపై పెరుగుతున్న దాడులు

## నీళ్లు, నియామకాలు, నిధులు అంశాన్ని గాలికి వదిలేశారు

## పాలకుల నిర్లక్ష్యం వల్ల దేశం పటం నుంచి తెలంగాణ మాయమైపోయే ప్రమాదం



శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన తెలంగాణ వికాస సమితి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, డాక్టర్ మాడభూషి శ్రీధర్, గోరటి వెంకన్న తదితరులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూలై 12, ప్రభాతవార్త:** తెలంగాణ అస్తిత్వంపై ఆధిపత్యం కొనసాగుతూనే ఉందని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రదేశ్‌ను పునరుద్ధరించేందుకు తెలంగాణ అస్తిత్వంపై దాడులు జరుగుతున్నాయని సదస్సులో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'తెలంగాణ అస్తిత్వం-సవాళ్లు, కర్తవ్యాలు'పై రౌండ్‌టేబుల్ సమావేశం ప్రముఖ పాత్రికేయుడు పి. వేణుగోపాలస్వామి అధ్యక్షతన జరిగింది. శాసన మండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రా పెట్టుబడిదారుల ప్రభావం ఇంకా జరుగుతూనే ఉందన్నారు. రాజకీయ శక్తులను ఎదగనీయకుండా అడ్డుకోవడం వంటి సవాళ్లు ఎదుర్కొంటూనే ఉన్నామన్నారు. ఉద్యమ నిర్మాణంలో సాహిత్య, కళాకారులు, భావజాల పరివ్యాప్తం అయిందన్నారు. నేటికి కూడా అన్నిరంగాల్లో తెలంగాణ వ్యతిరేకుల ఆధిపత్య సీమాంధ్ర పెట్టుబడిదారుల ఆధిపత్యం నడుస్తోందన్నారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం ఇటువంటి సంస్థల ద్వారా ప్రజలను మరోసారి చైతన్యవంతులను చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడ లేని కుల వ్యవస్థ తెలంగాణలో ఉందని, ఈ ప్రాంతం సస్యశ్యామలం ఉన్న ప్రదేశం, పోరాట చైతన్యాన్ని నిలిపిన ప్రాంతం అని అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఇగోపై దెబ్బ కొట్టేందుకు సీమాంధ్ర పాలకులు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. రాష్ట్రం ఇప్పుడిప్పుడే వచ్చింది అనుకుంటున్న తరుణంలో తెలంగాణ లోగో నుంచి కాకతీయ తోరణం మాయమైపోయిందని, చూస్తుంటాం, పోయినీయ్యిలే అనుకుంటున్న తరుణంలో తెలంగాణ తల్లి చేతుల్లో నుంచి బతుకమ్మ మాయమైపోయిందని, అలాగే చూస్తూ ఊరుకుంటే భారతదేశ పటం నుంచి తెలంగాణ మాయమైపోయే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్ర సమాచార పూర్వ కమిషనర్ డాక్టర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఎవరివైపు పోరాడుతుందో తెలియని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ఎన్నికల సంఘం చట్టాలను పూర్తిగా మార్చివేశారన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, వికాస సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్తి స్థాయిలో ప్రాయోజిత పథకాల అమలు

## కేంద్రం నుండి వీలైనన్ని గ్రాంట్లు రాబట్టే యోచన

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** కేంద్రం అమలు చేస్తున్న ప్రాయోజిత పథకాలను రాష్ట్రంలో పూర్తి స్థాయిలో అమలు చేయాలని తెలంగాణ సర్కార్ యోచిస్తోంది. తద్వారా సాధ్యమైనన్ని ఎక్కువ నిధులను రాబట్టాలనే ప్లాన్‌లో రాష్ట్ర సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకు అనుగుణంగా కేంద్రం నుండి వీలైనన్ని గ్రాంట్లు రాష్ట్రానికి అందేలా ఆర్థిక శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటి వరకూ కేంద్ర ప్రాయోజిత పథకాను రాష్ట్రంలో సక్రమంగా అమలు చేయకపోవడంతో పాటు, వాటికి రాష్ట్ర వాటాగా కేటాయించాల్సిన నిధులు జత చేయకపోవడంతో పలు సందర్భాలో కేంద్ర నిధులు మంజూరు కావడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక నుండి అటువంటి నిర్లక్ష్యం జరగకుండా సకాలంలో కేంద్ర నిధులకు రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంట్లు కలిపి ప్రాయోజిత పథకాల నిధులు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు తీసుకోనుంది. ఇందుకు కేంద్రం సింగిల్ నోడల ఏజెన్సీ ద్వారా సిస్టమ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్విక్ ట్రాన్స్‌ఫర్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక శాఖలు, రిజర్వ్ బ్యాంక్‌కు చెందిన ఈ కుబేర్ వ్యవస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఆయా ప్రాయోజిత పథకలను అమలు చేసే కేంద్ర శాఖలతో పాటు, రాష్ట్ర శాఖలు ప్రత్యేక ఖతాలను తెరచి వాటి ద్వారా లావాదేవీలు నిర్వహిస్తాయి. ఈ విధానం అమలు కోసం రాష్ట్రంలో ఖజానా శాఖలో ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేశారు.

# ఉద్యోగుల శ్రమదోపిడీ కోసం పని పది గంటలా?

## ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు

### ఎఐబిఇఎ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** సామాన్య ప్రజలకు సేవలందించేందుకు జాతీయకరణ చేసిన బ్యాంకులను పాలకులు క్రమంగా ప్రజలకు దూరం చేసేందుకు, తద్వారా ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఇఎ) ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం విమర్శించారు. నేటి పాలకులు యాజమాన్యాలకు మద్దతునిస్తూ వారి పక్షం వహిస్తున్న నేపథ్యంలో యూనియన్లు, ఉద్యోగులు, కార్మికుల ఐక్యత మరింత అవసరమని, సమస్యల పరిష్కారానికి పోరాటం ఒక్కటే మార్గమన్నారు. శనివారం కాచిగూడలో కొటక్ మహీంద్రా బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ (కెఎంబిఇయు) 31వ జాతీయ మహాసభకు కెఎంబిఇయు అధ్యక్షుడు వి.నాగ రాజ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిహెచ్. వెంకటాచలం మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు ఉద్యోగుల శ్రమను మరింతగా దోపిడీ చేయడానికి పది గంటల పని విధానాన్ని తెచ్చేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 గంటల పని విధానం స్థానంలో పది గంటల విధానాన్ని తీసుకువచ్చేందుకు పాల కులు, కార్పొరేట్ శక్తులు వ్యూహాలు రచిస్తున్నారని, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలన్నారు. దేశంలో అసంఘటిత రంగంలో ఉన్న దాదాపు 40 కోట్ల మంది కార్మికులకు సంఘాలే లేవని, సర్వీస్ కండిషన్లు లేవని, వారు పనిచేస్తున్న గంటలకు లెక్కనే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణను వ్యతిరేకించిన వారే ప్రస్తుతం దేశాన్ని పరి పాలిస్తుండడం దురదృష్టకరమన్నారు. బ్యాంకులు సృష్టిస్తున్న సంపద సంపన్నుల జేబుల్లోకి వెళుతున్నదన్నారు. సామాన్య ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింతగా అందుబాటులోకి తీసుకురావడానికి ప్రైవేటు బ్యాంకులను జాతీయకరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొటక్ మహీంద్రా బ్యాంక్ సిహెచ్ఆర్ఓ అనుపమ్ కౌర మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో పోటీకి తట్టుకుని నిలబడాలన్నారు. కొటక్ బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు, డిమాండ్ త్వరలోనే బ్యాంక్ సానుకూల నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.



కెఎంబిఇయు 31వ జాతీయ మహాసభలో మాట్లాడుతున్న ఎఐబిఇఎ ప్రధాన కార్యదర్శి సిహెచ్ వెంకటాచలం




# యేడాది పాలనపై చర్చకు సిద్ధం

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పదేళ్ల బిఆర్ఎస్ పాలన యేడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం అని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. యేడాది పాలనపై 100 శాతం రండి చర్చించుకుందాం అంటూ సవాల్ విసిరారు. ఇరిగేషన్ మాత్రమే కాదు నీళ్ల, నిధులు, నియామకాలపై చర్చకు సిద్ధం అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల అభీష్టం వ్యతిరేకంగా పదేళ్ల బిఆర్ఎస్ పాలన సాగిందన్నారు. నీళ్ల ,నిధులు, నియామకాలపై తుంగలో తొక్కారు.. పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ నేతలు చిత్త శుద్ధితో పనిచేస్తే తెలంగాణ అప్పుల కుప్పగా మారేదీ కాదని అన్నారు. పదేళ్ల పసిపాప ఎందుకు చిక్కిపోయింది.ఎందుకు ఐసియూకి పోవాల్సి వచ్చిందో ప్రజలకు తెలియాలని అన్నారు. గోదావరి, బనక చర్ల టాపిక్ తెచ్చి ఆంధ్ర సెంటిమెంట్ రెచ్చగొట్టాలని పిచ్చి ఆలోచనతో బిఆర్ఎస్ నేతలు ముందుకు వెళ్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ నేతలను 70 ఎంఎంలో చూపిస్తాం, లోటు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రం ఎందుకు అప్పుల పాలయిందో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. సిఎం, మంత్రులను దుషించి వాస్తవాలకు దూరంగా బుర్ర, హరికథలు చెప్పుకుంటూ స్పీకర్‌ని సైతం దుషిస్తే మైకులు ఎంధుకు కట్ చేయరు?.. పదేళ్ల పాలన గురించి మీరు, యేడాదిన్నర పాలన గురించి మేము క్లారిటీగా మాట్లాడితే ప్రజలకి నిజాలు తెలిసిపోతాయని అన్నారు. నీళ్ల కోసం పోరాటం చేసినప్పుడు కృష్ణ పరివాహక ప్రాంతం 68 శాతం తెలంగాణలో ఉన్నప్పుడు అప్పుడు గాడిద పళ్ల తొమారా? అంటూ ప్రశ్నించారు. 811 టిఎంసిల ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కేటాయించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కంప్లీట్ చేయకముందే 22 కోట్ల రూపాయల యాడ్స్‌తో బిఆర్ఎస్ ప్రచారం చేసుకుందని, 299 టిఎంసిల నీళ్లను కాపాడుకుంటామని ప్రజలకు చెబుదాం రండి హరీష్ రావు, తెలంగాణను సస్య శ్యామలం చేద్దాం అన్న ద్యాస బిఆర్ఎస్ నేతలకి లేదన్నారు. నీళ్ల విషయంలో ఆంధ్ర ప్రాంతం వాళ్ల అన్యాయం చేస్తే, బిఆర్ఎస్ ద్రోహం చేసిందన్నారు.

తెలంగాణకు 968, ఆంధ్రకు 511 వాట కేటాయించారు. పదేళ్లలో 968 టిఎంసిలను వాడుకునే ప్రయత్నం బిఆర్ఎస్ హయంలో జరగలేదని, తెలంగాణలో ఉన్న ఆర్థిక వనరులను తీసుకెళ్ళి కాళేశ్వరంపై పెడితే అది కాళేశ్వరం అయ్యిందన్నారు. పదేళ్ల దౌర్భాగ్య పాలన చేసి ప్రజెంటేషన్లు అంటూ కాంగ్రెస్ పార్టీపై బుదర జల్లే ప్రయత్నం చేస్తున్నారు అన్నారు. బనకచర్ల పేరుతో రేవంత్ రెడ్డి చంద్రబాబు శిష్యుడు అంటూ కెసిఆర్ ఫాం హౌజ్‌లో బిగ్ బాస్ తరహా షో పెట్టాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయలేని కెసిఆర్‌కి ప్రతి పక్ష హోదా ఎందుకు అన్నారు. కెసిఆర్‌కి బదులు మీరన్న ప్రతిపక్ష హోదా తీసుకొని చర్చకు రండి అన్నారు.

# రోడ్డు పక్కన ఆపివున్న ట్రక్కు నుంచి రూ. 10 లక్షల సెల్‌ఫోన్లు చోరీ

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు సెల్‌ఫోన్ల లోడ్‌తో వెళుతున్న ట్రక్కు నుంచి పది లక్షల రూపాయల విలువచేసే సెల్‌ఫోన్లు చోరీ అయిన ఉదంతం ఇది. శనివారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. సెల్‌ఫోన్ల లోడ్‌తో హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు శుక్రవారం అర్ధరాత్రి సమయంలో వెళుతున్న ఒక ట్రక్కు కామారెడ్డి వద్దకు రాగానే డ్రైవర్ భోజనం కోసం వాహనాన్ని ఆపాడు. దీని తరువాత కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేందుకు వాహనాన్ని దాబా వద్ద ఆపాడు. ఇదే సమయంలో దోపిడి దొంగలు ట్రక్కులోని సెల్‌పోన్లు గల కొన్ని బాక్స్ లు దొంగిలించారు. నిద్ర లేచిన తరువాత డ్రైవర్ తన ట్రక్కులో సెల్‌ఫోన్లు చోరీ అయిన విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ కి గురైన సెల్‌ఫోన్లు పది లక్షల రూపాయల వరకు వుంటాయని డ్రైవర్ తెలిపారు. దీనిపై కామారెడ్డి పోలీసులు విచారిస్తున్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వర్‌లాల్, వెంకటేశ్వర్లు, నరేందర్ తదితరులు

# డిగ్రీ గెస్ట్ లెక్చరర్లను రెన్యూవల్ చేసి సర్వీస్ కొనసాగించాలి

### అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్‌లాల్

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** గత యేడాది కాలేజీల్లో విధులు నిర్వర్తించిన ప్రతి డిగ్రీగెస్ట్ లెక్చరర్లను రెన్యువల్‌తో పాటు సర్వీస్ కంటిన్యూ చేయాలని డిగ్రీ గెస్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ( డిజిఎల్ ఏ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొర్ర ఈశ్వర్‌లాల్, కోఆర్డినేటర్ పి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నరేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ప్రతి నెల 50 వేల కన్సలిడేటెడ్ పేతో ఏడు నెలలకు కాకుండా 12 నెలలకు వేతనం చెల్లించాలని, గంటల పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డిగ్రీ రెసిడెన్షియల్, డిఎడ్, బి.ఎడ్, ఎంఎడ్, యూనివర్సిటీలలో పార్ట్ టైం లెక్చరర్‌లను, ఇంటర్ గెస్ట్ లెక్చరర్లను ఒక్కసారి డెమోతో ప్రతి సంవత్సరం రెన్యువల్ చేస్తున్నారని, డిగ్రీ గెస్ట్ లెక్చరర్లను మాత్రం త్రీమెన్ కమిటీ పేర డెమోల ద్వారా నియామకాలు చేపట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. విద్యావ్యవస్థ పటిష్టత, విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేస్తున్న ప్రభుత్వం డిగ్రీ గెస్ట్ లెక్చరర్లకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర నేతలు ఎ.అశోక్, శివుడు, టి.గోపాల్ ఎస్.రాజు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా పెరిగిన ఖరీఫ్ విస్తీర్ణం

## ఇప్పటి వరకూ 223 లక్షల ఎకరాల్లో సాగు

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. మెరుగైన రుతుపవనాల ప్రభావం కారణంగా వర్షాలు కురియడంతో పాటు, అనుకూల వాతావరణం, పెరిగిన కనీస మద్దతు ధరల నేపథ్యంలో వ్యవసాయానికి ఆశాజనకమైన పరిస్థితులు ఏర్పడ్డాయని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ పేర్కొంది. దేశం మొత్తం మీద ఈ ఖరీఫ్ సీజనులో ఇప్పటి వరకూ 223 లక్షల ఎకరాలలో (89 లక్షల హెక్టార్లకు) వివిధ పంటలు సాగయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి 219 లక్షల ఎకరాలు (87.81 లక్షల హెక్టార్ల) లో జరిగిన ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం ఈ ఏడాది పెరిగింది.

ఈ సీజన్ ప్రారంభంలో 3.7 లక్షల ఎకరాలు (1.48 లక్షల హెక్టార్ల) లో పంటల సాగు పెరగడం వల్ల రైతుల ఆదాయాలు పెరిగే అవకాశం ఉందని తద్వారా ఆహార ధరలను స్థిరీకరించడానికి ఇది దోహదపడుతుందని వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారులు చెబుతున్నారు. దేశంలో ప్రధానంగా వరి నాట్లు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి, ఇప్పటి వరకూ 11 లక్షల ఎకరాల్లో (4.53 లక్షల హెక్టార్ల) విస్తీర్ణంలో నాట్లు పడ్డాయి.. గత సంవత్సరం ఇదే కాలంలో ఇది (10 లక్షల ఎకరాలు) 4 లక్షల హెక్టార్లు, కంది, మినుములు మరియు పెసరపప్పు వంటి పప్పుధాన్యాల విస్తీర్ణం 5.15 లక్షల ఎకరాలు (2.6 లక్షల హెక్టార్ల) నుండి 7 లక్షల ఎకరాలు (3.07 లక్షల హెక్టార్లకు)కు విస్తరించింది. ఇక దేశం మొత్తం మీద నూనెగింజల విస్తీర్ణం 3.75 లక్షల ఎకరాలు (1.5 లక్షల హెక్టార్ల) నుండి 5 లక్షల ఎకరాలు (2.05 లక్షల హెక్టార్ల) కు పెరిగింది, ఇది సీజన్ ప్రారంభంలో సానుకూల ధోరణిని సూచిస్తుంది.

# జూరాలకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

## 10 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 12, ప్రభాతవార్త:** జూరాల డ్యామ్‌కు వరద స్వల్పంగా స్థిరంగా కొనసాగు తున్నది. శనివారం జూరాలకు 108,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.573 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 31,624 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 68,810 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -1కు 1,300 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1030 క్యూసెక్కులు, కుడి కాలువకు 470 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,04,493 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.



### నిండుకుండలా శ్రీశైలం డ్యాం

### 883 అడుగులకు చేరుకున్న నీటిమట్టం

శ్రీశైలం జలాశయం నిండుకుండలా మారింది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 3గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతున్నది.

కర్ణాటక నుంచి కృష్ణా నదికి భారీగా వరద జలాలు రావడంతో జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నమోదవుతున్నది, దీంతో ప్రాజెక్టు నీటిమట్టలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులగాను ప్రస్తుతం 883.00 అడుగులకు చేరుకున్నది. ఇక నీటి నిల్వలు 215 టీఎంసీలకుగాను 204.3520 టీఎంసీలకు చేరుకున్నాయి. ప్రాజెక్టు ఒక గేటు 10అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.

కాగా భారీ ఇన్ ఫ్లోతో ఏపీలోని పోతిరెడ్డిపాడుతో పాటుగా తెలంగాణలోని మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి నీళ్లు విడుదల చేస్తున్నారు. అలాగే కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రానికి 33,015 క్యూసెక్కులు, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రానికి 35,315 క్యూసెక్కులు ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలకు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టుకు జూరాల నుంచి 31,624 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 39,170క్యూసెక్కుల నీళ్లు వచ్చి డ్యాంలోకి చేరుతున్నాయి. మొత్తంగా శ్రీశైలం జలాశయం నుంచి 153120క్యూసెక్కులు దిగువకు నాగార్జున సాగర్‌కు విడుదలయ్యాయి.



# ఐఐఎం విద్యార్థిని అత్యాచారం కేసులో కొత్త ట్విస్ట్

**కోల్‌కతా, జూలై 12:** కోల్ కతాలోని ప్రఖ్యాత ఐఐఎం బాయ్స్ హాస్టల్ లో ఓ విద్యార్థి తనపై అత్యాచారం చేశాడంటూ ఓ విద్యార్థిని సంచలన ఆరోపణలు చేయడం తెలిసిందే. తాను మానసిక సమస్యలతో బాధపడుతున్నానని, దాంతో ఆ విద్యార్థి కౌన్సెలింగ్ ఇస్తానని హాస్టల్ కు పిలిచి తనకు మత్తుమందు కలిపిన కూల్ డ్రింక్ ఇచ్చాని ఆ అమ్మాయి తెలిపింది. తాను స్పృహ కోల్పోగా, తనపై అత్యాచారం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఈ వ్యవహారం ఆసక్తికర మలుపు తిరిగింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) కలకత్తా విద్యార్థినిపై అత్యాచారం జరిగిందన్న వార్తలను ఆమె తండ్రి ఖండించారు. తన కుమార్తె ఆటోరిక్షాలో నుంచి పడిపోయిందని, అపస్మారక స్థితిలోకి వెళ్ళిందని ఆయన తెలిపారు. శుక్రవారం రాత్రి 9:34 గంటలకు తనకు ఫోన్ వచ్చిందని, తన కుమార్తెను పోలీసులు రక్షించి ఎస్ఎస్‌కేఎం ఆసుపత్రిలోని న్యూరాలజీ విభాగానికి తరలించారని ఆయన పేర్కొన్నారు. తన కుమార్తెపై ఎటువంటి లైంగిక దాడి జరగలేదని, ఆమెను హింసించలేదని లేదా దురుసుగా ప్రవర్తించలేదని తండ్రి పేర్కొన్నారు.

# ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై నిఘా

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త :** తెలంగాణలోని స్థానిక సంస్థలకు కేంద్రం ఇస్తున్న ఆర్థిక సంఘం నిధులను వినియోగిస్తున్న తీరుతెన్నులపై నిఘా ఉంచనుంది. స్థానిక సంస్థలు ఆర్థిక సంఘం నిధుల ద్వారా జరిపే లావాదేవీలన్నింటినీ కేంద్ర వెబ్ సైట్ ఈ మార్కెట్ ప్లేస్ (జీఈఎం)లో పొందుపరచాలని కేంద్రం స్పష్టం చేసింది. ఇప్పటికే అన్ని రాష్ట్రాలతో పాటు, వాటి పరిధిలోని వివిధ శాఖలు, సంస్థలు ఈ పోర్టల్ ద్వారానే కొనుగోళ్లు జరుపుతున్నాయి. ఈ విధంగానే ఆర్థిక సంఘం నిధులను గ్రామాల్లో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులు వంటి అవసరాలకు స్థానిక సంస్థలు వినియోగిస్తున్నాయి. జీఈఎం పోర్టల్ ద్వారా కొనుగోళ్లు జరిగితే వాటి వివరాలు కేంద్రానికి చేరతాయి. దీంతో ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై పూర్తి వివరాలు కేంద్రం వద్ద ఉండటంతో ఎప్పటికప్పుడు వాటి పర్యవేక్షణ చేసే వీలుంటుంది.

# కాలువలోకి దూసుకుపోయిన కారు

## ముగ్గురు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

**పాట్నా, జూలై 12:** బీహార్‌లోని పాట్నా జిల్లాలోని పాలిగంజ్ సబ్ డివిజన్‌లోని రాణితలాబ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున ఒక ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాణితలాబ్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని సరయ్యా గ్రామం సమీపంలో ఒక కారు అదుపు తప్పి కాలువలో పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గురించి సమాచారం అందు కున్న స్థానిక పరిపాలన బృందం, చుట్టుపక్కల ప్రజలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జెసిబి సహాయంతో కారును బయటకు తీశారు, కానీ అప్పటికి కారులో ఉన్న ఐదుగురిలో ముగ్గురు చనిపోయారు. ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స కోసం పాట్నా ఎయిమ్స్‌కు తరలించారు. మృతులను 52 ఏళ్ల నిర్మలా దేవి, 36 ఏళ్ల నీతు సింగ్, 10 ఏళ్ల అస్తితు కుమారిగా గుర్తించారు. వారంతా వైశాలి జిల్లాలోని మహువా ప్రాంతానికి చెందినవారు. గాయపడిన వారిలో నందన్ సింగ్, రిద్ధి సింగ్ ఉన్నారు, వారు చికిత్స పొందుతున్నారు. వారంతా ఒకరి వివాహ వార్షికోత్సవంలో పాల్గొనడానికి ఛత్తీస్‌గఢ్ నుండి వైశాలిలోని హాజీపూర్‌కు వెళుతున్నారు. అప్పుడు ఈ ప్రమాదం జరిగింది.



# ఫిరంగినాలాను సందర్శించిన బక్కిని నర్సింహులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 12:** తెలంగాణ తెలుగుదేశం పార్టీ నేతలు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోగల ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులకు వచ్చే ఫిరంగినాలాను సందర్శించారు. స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఫిరంగినాలాను తొవ్వి రోడ్డు వేస్తున్నారని తెలిసిన వెంటనే పార్టీ రాష్ట్ర నాయకులు బక్కిని నరసింహులు శనివారం సందర్శించారు. బక్కిని నరసింహం మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులోకి ఫిరంగినాల అనేది షాద్నగర్ నుండి ఇబ్రహీంపట్నం వరకు అన్యాక్రాంతమైందని, ఆదభట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఫిరంగి నాలో కట్టను తొవ్వి రోడ్డు వేయడం జరిగిందని చెప్పారు.

ఇక్కడ ఉన్న రైతులు ఎన్నోసార్లు కంప్లైంట్ ఇచ్చినదని ఇరిగేషన్ ఆఫీసర్లు ఇలాంటి చర్యలు చేపట్టలేదని చెప్పారు. ఇప్పటికైనా ఇలాంటి చర్యలు చేపట్టకపోతే తెలుగుదేశం పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ అధ్యక్షులు మెట్టు దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సందర్శన కార్యక్రమంలో పార్టీ స్టేట్ సెక్రెటరీ కుమార్ గౌడ్, పార్టీ నేతలు వెంకటయ్య, జక్కరామ్ రెడ్డి, కాసోజు వీరాచారి, కొంగర వెంకటరెడ్డి, శంకరయ్య, పేరాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అణు విద్యుత్ ఉత్పత్తి

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త :** తెలంగాణలో అణు విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులపై రాష్ట్ర సర్కార్ దృష్టిసారించింది. రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన అణు విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతోంది. అందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలియవచ్చింది. తదుపరి వచ్చిన ఫీడ్ బ్యాక్‌పై నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నారు.

రాష్ట్రంలో ప్రధానంగా అణు ఇంధన ఉత్పత్తికి కావాల్సిన వనరులు వివిధ ప్రాంతాల్లో ఉన్నట్లు ఇప్పటికే అధికారులు ఒక అంచనాకు వచ్చారు. కాగా రాష్ట్రంలో ప్రస్తుతం 14 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా, అందుకు అనుగుణంగా ఉత్పత్తి చేయడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో పాటు థర్మల్ విద్యుత్ యూనిట్ సగటున 4 రూపాయలు వరకూ ఉండగా, సోలార్ విద్యుత్ యూనిట్ 2.15 రూపాయలకు లభిస్తోంది. ఇక రాత్రి వేళలల్లో ఎక్సేంజలో విద్యుత్ సేకరిస్తే యూనిట్‌కు 9 రూపాయల వరకూ చెల్లించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అణు విద్యుత్ కేంద్రాలపై సర్కార్ దృష్టిసారించినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.

# బంగ్లాదేశ్‌లో తుక్కు వ్యాపారి దారుణ హత్య!

**ఢాకా, జూలై 12:** బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో జరిగిన 43 ఏళ్ల స్క్రాప్ వ్యాపారి లాల్ చంద్ సోహాగ్ దారుణ హత్య షాక్‌కు గురిచేసింది. ఈ ఘటన మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం దేశంలో చట్టవ్యవస్థ లోపాన్ని బహిర్గతం చేసిందని పలువురు విమర్శిస్తున్నారు. ఈ హత్య జూలై 9న సర్ సలీముల్లా మెడికల్ కాలేజ్ మిట్‌ఫోర్డ్ ఆసుపత్రి ఎదుట జరిగింది. సోహాగ్ 'సోహనా మెటల్ ' అనే తుక్కు సామాను వ్యాపార సంస్థను నిర్వహిస్తున్నారు. స్థానిక మార్కెట్‌లో ఆయన సంస్థ బలమైన పట్టు కలిగి ఉంది. అయితే సోహాగ్ వ్యాపార ప్రత్యర్థులైన మహ్మదుల్ హసన్ మొహిన్, హుసైన్ టిటు గత రెండుమూడు నెలలుగా అతని వ్యాపారంలో 50 శాతం వాటా లేదా నెలవారీ చెల్లింపులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ డిమాండ్‌లను సోహాగ్ తిరస్కరించాడు. దాంతో అతడిపై మొహిన్, హుసైన్ కక్ష పెంచుకున్నారు. బుధవారం నాడు సోహాగ్ ఒంటరిగా ఉండడం గుర్తించిన మొహిన్ తన సహచరులతో కలిసి దాడి చేశాడు. వారు సోహాగ్‌ను నగ్నంగా చేసి, రాళ్లతో కొట్టి, తీవ్రంగా గాయపరచడంతో అతను మరణించాడు. ఈ ఘటన బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతల లోపాన్ని స్పష్టంగా ఎత్తిచూపింది. స్థానిక మీడియా మరియు సోషల్ మీడియాలో వైరల్ అయిన ఈ హత్య దృశ్యాలు ఢాకాలో నేరాలు అదుపు తప్పినట్లు సూచిస్తున్నాయి. యూనస్ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను అణచివేయడం, జర్నలిస్టులపై దాడులు, మైనారిటీలు మరియు అవామీ లీగ్ పార్టీ సభ్యులపై హింసాత్మక ఘటనలను నియంత్రించడంలో విఫలమైందని ఆరోపణలు వస్తున్నాయి. హిందూ ఆలయాలపై దాడులు, జర్నలిస్టులపై తప్పుడు కేసులు, మరియు రాజకీయ హింసను ప్రోత్సహించడం వంటి ఘటనలు కూడా నివేదికల్లో కనిపిస్తున్నాయి. యూనస్ ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని గుర్తించడంలో ఇష్టపడకపోవడం, ఎన్నికల కోసం ఖచ్చితమైన గడువు ప్రకటించకపోవడం పట్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఈ హత్య బంగ్లాదేశ్‌లో చట్టవ్యవస్థ పునరుద్ధరణకు తక్షణ చర్యలు అవసరమని స్పష్టం చేస్తోంది.

# టీచర్ వేధింపులతో ఒంటికి నిప్పంటించుకున్న విద్యార్థిని

## 95శాతం గాయాలతో ఆస్పత్రికి తరలించిన తోటి విద్యార్థులు

**భువనేశ్వర్, జూలై 12:** లైంగిక కోరిక తీర్చాలని ఒక విద్యార్థిని టీచర్ వేధించడమేకాకుండా తీర్చకపోతే ఆమె భవిష్యత్తును నాశనం చేస్తానని బెదిరించాడు. ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆ విద్యార్థిని నిప్పంటించుకున్నది. ఒడిశాలోని బాలాసోర్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక యువతి ఫకీర్ మోహన్ కాలేజీలో ఇంటిగ్రేటెడ్ బీఎడ్ కోర్సు చదువుతున్నది. విభాగాధిపతి అయిన ఉపాధ్యాయుడు సమీర్ కుమార్ సాహు లైంగిక కోరిక తీర్చాలని ఆమెను వేధించాడు. లేకపోతే ఆమె భవిష్యత్తును నాశనం చేస్తానని బెదిరించాడు. కాగా, ఈ టీచర్ వేధింపులను ఆ విద్యార్థిని భరించలేకపోయింది. జూలై 1న ఆ కాలేజీ అంతర్గత ఫిర్యాదుల కమిటీకి ఆమె ఫిర్యాదు చేసింది. విచారణ జరిపి ఏడు రోజుల్లో చర్యలు తీసుకుంటామని ఆ కమిటీ తెలిపింది. అయితే ఎలాంటి ఫలితం లేకపోవడంతో శనివారం కాలేజీ ప్రిన్సిపాల్‌ను కలిసింది. ఎలాంటి స్పందన లేకపోవడంతో మిగతా స్టూడెంట్స్ తో కలిసి ప్రిన్సిపాల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టింది. ఇంతలో ఉన్నట్టుండి తన ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నది. మంటల్లో కాలుతున్న ఆమె ప్రిన్సిపాల్ కార్యాలయం నుంచి బయటకు పరుగెత్తింది. మరోవైపు ఇది చూసి అక్కడున్న విద్యార్థులు షాక్ అయ్యారు. ఆమెను కాపాడేందుకు ఒక స్టూడెంట్ ప్రయత్నించగా అతడికి కూడా మంటలు అంటుకున్నాయి. నిప్పంటించుకున్న విద్యార్థినికి 95 శాతం, కాపాడబోయిన స్టూడెంట్‌కు 70 శాతం కాలిన గాయాలయ్యాయి. భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కు వారిని తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, ఈ సంఘటనపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కీచక టీచర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ రాష్ట్ర ఉన్నత విద్యా మంత్రి సూర్యబన్షి సూరజ్ కూడా ఈ సంఘటనపై స్పందించారు. కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోవైపు విద్యార్థినిని లైంగికంగా వేధించిన ఉపాధ్యాయుడు సమీర్ కుమార్ సాహును అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, కాలేజీలో కలకలం రేపిన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



# యాంటీరేబిస్ వ్యాక్సిన్ కోసం

# 20 కిలోమీటర్లు నడిచివెళ్లిన 90 యేళ్ల బామ్మ

**నువాపడ(ఒడిశా),జూలై 12:** తొంభై ఏళ్ల బామ్మ నడవడమే కష్టం అలాంటిది ఏకంగా 20 కిలోమీటర్లు నడవక తప్పని పరిస్థితి ఏర్పడింది. కుక్క కరవడంతో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ కోసం ఆసుపత్రికి నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే ఒడిశాలోని నువాపడ జిల్లాకు చెందిన వృద్ధురాలు మంగల్ బారి మోహరాకు 92 ఏళ్ళు అడుగుతీసి అడుగువేయడమే కష్టంగా మారింది. ఈ క్రమంలో మోహరాను ఇటీవల ఓ కుక్క కరిచింది. దీంతో అందుబాటులో ఉన్న వైద్యుడి వద్ద చికిత్స చేయించుకుంది. ప్రాథమిక చికిత్స చేసిన సదరు వైద్యుడు రేబిస్ రాకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలని, అ టీకా ప్రస్తుతం తన వద్ద లేదని చెప్పాడు. దీంతో వ్యాక్సిన్ కోసం మోహరా తమ గ్రామానికి సమీపంలోని సీనపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు బయలుదేరింది. దాదాపు పది కిలోమీటర్లకు పైగా దూరం ఉన్న సీనపల్లి వెళ్లేందుకు రవాణా సదుపాయం లేకపోవడంతో చేసేదేంలేక మోహరా కాలినడకనే బయలుదేరింది. ఓవైపు వయోభారం, మరోవైపు కుక్క కరిచిన గాయంతో నడవలేక నడుస్తూ హెల్త్ సెంటర్ ను చేరుకుంది. అక్కడ వ్యాక్సీన్ తీసుకున్నాక తిరిగి నడుచుకుంటూనే గ్రామానికి చేరుకుంది. రాష్ట్రంలో ప్రైవేటు వాహనాల డ్రైవర్లు సమ్మెకు దిగడంతో రెండు రోజులుగా రవాణా సౌకర్యం నిలిచిపోయిందని గ్రామస్థులు తెలిపారు.



# అఖండ భారత్ చిత్రపటంలో అభ్యంతరాలు ఏమిటి?

## కొండను తవ్వి ఎలకను పట్టినట్లేనన్న రాష్ట్ర బిజెపి

## ఎక్స్ వేదికగా విమర్శలకు గట్టిగా బదులిచ్చిన వైనం

## రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును అభినందించిన మాధవ్



**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన సందర్భంగా ఆ రాష్ట్రానికి చెందిన బిజెపి అధ్యక్షుడు మాధవ్ ఇచ్చిన అఖండ్ భారత్ చిత్రపటంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో తెలంగాణ బిజెపి కౌంటర్ ట్వీట్ చేసింది. బిజెపి తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావుకు తెలంగాణతో కూడిన అఖండ్ భారత్ చిత్రపటాన్ని మాధవ్ బహూకరించారు. ఈ చర్యతో ఎక్స్ వేదికగా జరుగుతున్న విమర్శలకు తెలంగాణ బిజెపి గట్టిగా బదులిచ్చిందన్నారు. అఖండ భారతావని యొక్క అమోఘమైన చరిత్రను తెలియజేసే చిత్రపటంలో అభ్యంత రాలు వెతకడం అనేది కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఉంటుందని తెలంగాణ బిజెపి తన ట్వీట్‌లో పేర్కొంది. మాధవ్ శనివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా రామచంద్రరావును కలిసి అభినందనలు తెలియజేశారని, భారత సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే ఒక చిత్రపటాన్ని అందజేసి తమ ఆప్యాయతను, సోదర భావాన్ని, తెలంగాణ పట్ల తనకున్న గౌరవాన్ని చాటుకున్నారని ఆ పార్టీ తెలిపింది.

**మాధవ్ ట్వీట్.. తెలంగాణ బిజెపి రీట్వీట్**

"తెలుగు ఐక్యతపై రాజకీయ గీతలు గీసేవారు చరిత్ర ముందు లొంగిపోక తప్పదు" అంటూ మాధవ్ తన ట్వీట్‌ను ప్రారంభించారు. ఓట్ల కోసం ఫోటోల్లో గీతలు గీసి, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే వారిని తెలుగు ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని, తెలంగాణ, ఆంధ్ర ప్రజల మధ్య బంధాన్ని చీల్చే ప్రయత్నాలు వారి సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. నేను ఒక జాతీయవాదిని. ఒక గర్వించదగిన తెలుగువాడిని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగు భాష, సంస్కృతి, గౌరవం కోసం శాసనమండలిలో, శాసనాల్లో చురుకుగా పనిచేశాను. తెలంగాణ పట్ల, ఆ గొప్ప సంస్కృతి పట్ల నాకు ఉన్న ప్రేమ, గౌరవం రాజకీయ విమర్శలకు అతీతం. రజాకార్లను పొగిడే, నిజాం వారసుల ముందు తల వంచిన వారికి, తెలంగాణ ప్రజల హృదయాలలో ప్రతిఫలించే సంస్కృతి, జాతీయత, సమానత్వం అనే విలువలు ఎప్పటికీ అర్థం కావు. నాకు సోదర తెలంగాణ రాష్ట్రం పట్ల ఉన్న ప్రేమను, గౌరవాన్ని ఎవరూ తగ్గించలేరు, మార్చలేరు" అని ఆయన స్పష్టం చేశారు.

# రాష్ట్ర ఆదాయం వడ్డీలకే సరిపోతోంది

## వడ్డీ తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నాం

## సమాఖ్య విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలి

## సిఎం రేవంత్‌రెడ్డితో ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 12:** రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.



రేవంత్ రెడ్డి అన్నారు. సమాఖ్య విధానంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం గౌరవించుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని జుబ్లీహిల్స్‌లో గల తన నివాసంలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్. మహేంద్ర దేవ్‌తో సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే అంశంపై ఈ సందర్భంగా వారు చర్చలు జరిపారు. హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించినట్లు ముఖ్య మంత్రి ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. హైదరా బాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు.రీజినల్ రింగ్ రోడ్‌కు అనుసంధానంగా రేడియల్ రోడ్లను కూడా నిర్మిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అధిక వడ్డీల కారణంగా రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందని, తిరిగి చెల్లించడం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీలు చెల్లించడం కోసమే రాష్ట్ర ఆదాయం ఖర్చు చేయవలసి వస్తోందని అన్నారు. అధిక వడ్డీ రేట్లకు తీసుకున్న రుణాలపై వడ్డీ తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నామని ఆయన తెలిపారు.యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని,రాష్ట్రం లో పారిశ్రామిక రంగం తో పాటు సేవల రంగం అభివృద్ధి కోసం ప్రణాళిక లు రూపొందిస్తున్నామని చెప్పారు. ఉద్యోగులకు సముచితమైన అవకాశాలు కల్పిస్తేనే రాష్టానికి కంపెనీ లు వస్తాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

# బెల్ట్‌షాపులపై చర్యలు

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆగ్రహం

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పలు గ్రామాల్లో ఉన్న బెల్ట్‌షాపుల్లో మద్యం ఏరులై పారుతుంటే వాటిపై ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. విచ్చలవిడిగా నడుస్తున్న బెల్ట్ షాపులను ఎత్తివేసేందుకు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. తాము వివిధ జిల్లాల్లో పర్యటనలకు వెళ్లిన సందర్భంలో గ్రామాల్లోని మహిళలు బెల్టుషాపులపై ఫిర్యాదులు చేస్తున్నారని కమిషన్ పేర్కొన్నది. మహిళలు చేసిన ఫిర్యాదులను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. హైదరాబాద్లఓ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్‌తో కలిసి కమిషన్ సభ్యులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖలో ఉద్యోగులతో కమిషన్ సభ్యులు మాట్లాడారు. అనంతరం చైర్మన్ వెంకటయ్య మాట్లా డు తూ.. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో అన్యాయం జరిగితే ఊరు కునేది లేదని హెచ్చరించారు.బదలీలు, ప్రమోషన్లలో అగ్రవర్ణాలు అడ్డు పడితే ఊరుకునేది లేదని, ఎంతటివారైనా ఉపేక్షి ంచేదిలేదని స్పష్టం చేశారు.

# ఇళ్లు లేని 13 వేల మంది గిరిజనులు

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త :** తెలంగాణలో ఇండ్లు లేని గిరిజనులు 13,151 మంది ఉన్నారు. ప్రధానంగా రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో ఉన్న గిరిజనులకు ఇండ్లు లేవని ఆయా జిల్లాల కలెక్టర్లు కేంద్రనికి నివేదిక పంపించారు. తద్వారా ఒక్కో ఇంటి నిర్మాణానికి 2.39 లక్షల రూపాయల మేర ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉన్నట్లు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చెబుతున్నారు. దీనిపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులు ఇటీవల కేంద్రం దృష్టికి కూడా తీసుకెళ్లారు. పిఎం జన్ మన్ పథకం కింద రాష్ట్రంలోని 13 వేల మంది గిరిజనులకు నిధులు వస్తే రాష్ట్ర ప్రభుత్వంపై కొంత వరకూ ఆర్థిక భారం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ నియామకాలకై కమిటీ ఏర్పాటు

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త :** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు, అని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలపై రాష్ట్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ విభాగాల పాత్ర, ప్రధాన విధులు మరియు ప్రాధాన్యతలలో కాలక్రమేణా వచ్చిన గణనీయమైన మార్పులను పరిగణనలోకి తీసుకుని, కాంట్రాక్ట్ మరియు అవుట్‌సోర్సింగ్ నియామకాలను కమిటీ సమీక్షి స్తుందని భావిస్తున్నారు. ఈ కమిటీలో రాష్ట్ర ప్రభుత్వం మాజీ ప్రధాన కార్యదర్శి ఎ. శాంతి కుమారి, మరో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్. శివశంకర్, అర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జనరల్ అడ్మినిస్ట్రేషన్ (సాధారణ పరిపాలన) శాఖ కార్యదర్శి ఎం. రఘునందన్‌రావులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. అన్ని ప్రభుత్వ విభాగాలు, కార్పొరేషన్లు, పీఎస్‌యులు, స్థానిక సంస్థలు, సంఘాలు, విశ్వవిద్యాలయాలు, సంస్థలలో సిబ్బంది హోదాను సమీక్షి ంచడానికి ఈ కమిటీని ఏర్పాటు చేసింది.

# 18న 'కొత్తపల్లిలో ఒకప్పుడు'


రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ప్రజెంట్ చేస్తున్న రూరల్ కామెడీ కొత్తపల్లిలో ఒకప్పుడు. ఉమా మహేశ్వర ఉగ్ర రూపస్య వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రాలతో అనుబంధం కలిగి ఉన్న నటిచిత్రనిర్మాత ప్రవీణ పరుచూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పరుచూరి విజయ ప్రవీణ ఆర్ట్స్ ఈ ప్రాజెక్టును నిర్మిస్తోంది. మనోజ్ చంద్ర, మోనికా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఫస్ట్ లుక్, టీజర్ ట్రైలర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా ఈ నెల 18న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా టీం ప్రెస్ మీట్ నిర్వహించింది. ప్రెస్ మీట్‌లో హీరో మనోజ్ చంద్ర మాట్లాడుతూ, అందరికి నమస్కారం. కొత్తపల్లిలో ఒకప్పుడు సినిమాలో ఇది ఒక చోటు. కానీ ఈ సినిమా మా గుండెల్లో చోటు. 18వ తారీఖున మీ గుండెల్లోకి దూసుకొస్తున్నాము. మా కలని నిజం చేసిన ప్రొడ్యూసర్, డైరెక్టర్ ప్రవీణకి కృతజ్ఞతలు. స్పిరిట్ మీడియా ద్వారా నన్ను పరిచయం చేస్తున్న రానాకి ధన్యవాదాలు. ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఆర్టిస్టు టెక్నీషియన్ కష్టాన్ని నేను దగ్గర నుండి చూశాను. వారికి నేను జీవితాంతం రుణపడి ఉంటాను. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మీరందరూ థియేటర్స్ కొచ్చి సపోర్ట్ చేసి మా సినిమాని ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను. ప్రవీణ పరుచూరి సినిమాల్లో నటించాలంటే నటిస్తే సరిపోదు జీవించాలి. అలా రామకృష్ణ క్యారెక్టర్‌కి నేను ప్రాణం పోశాను. మీరందరూ కూడా ఈ సినిమాని ఆస్వాదిస్తారని భావిస్తున్నాను. తప్పకుండా థియేటర్స్‌లోకి రండి. మిమ్మల్ని డిసప్పాయింట్ చెయ్యము. థాంక్యూ సో మచ్ అన్నారు. డైరెక్టర్ ప్రవీణ పరుచూరి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఇది నా మూడో సినిమా. అందులో ఏదో ఒక ప్రత్యేకత ఉండాలని అనుకున్నాను. ఒక పల్లెటూర్ని ఒక ఫారిన్ సినిమాటోగ్రాఫర్‌తో షూట్ చేయించాం. ఈ సినిమాకి ఒక ఫారిన్ డీవోపీ పనిచేస్తున్నారు. నేను ఫస్ట్ సినిమా కేరాఫ్ కంచరపాలెం తీశాను. జీవితంలో ఒక్క సినిమా చాలు అనుకున్నాను. ఆ సినిమాకి ఆడియన్స్ చాలా పెద్ద విజయాన్ని ఇచ్చారు. ఆడియన్స్ ఎంకరేజ్మెంట్ నన్ను చాలా ఆశ్చర్యపరిచింది. ప్రేక్షకుల ప్రోత్సాహం వలన నేను మరో సినిమా తీయగలిగాను. కేరాఫ్ కంచరపాలెం సినిమాని చాలామంది థియేటర్స్‌లో చూడలేదని చెప్తుంటారు. సినిమా చూస్తున్నప్పుడు చాలా హాయిగా నవ్వుకుంటారు. సెకండ్ హాఫ్‌లో నా స్టైల్‌లో కొన్ని సెన్సిబిలిటీస్ కాన్సెప్ట్స్ ఉంటాయి. తప్పకుండా ఆలోచన కలిగించేలా ఉంటుంది. జులై 18న ఎవరు కూడా థియేటర్స్‌లో మిస్ అవ్వొద్దు అని కోరుకుంటున్నా. నేను ఈసారి నేను డైరెక్షన్ చేసిన సినిమా ఇది.



# 'పెద్ది' ఫస్ట్ లుక్ రిలీజ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ పెద్ది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్ తో దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పవర్ ఫుల్ కొలాబరేషన్, అద్భుతమైన టీంతో పెద్ది భారతీయ సినిమాలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడానికి సిద్ధంగా ఉంది. ప్రముఖ పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్ ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ శివరాజ్ కుమార్ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ఇంటెన్స్ చూపు, రఫ్ అండ్ టఫ్ లుక్‌తో శివరాజ్‌కుమార్ కనిపించే తీరు అదిరిపోయింది. ఈ చిత్రంలో గౌర్నాయుడు అనే పవర్ ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రల్లో కనిపించ నున్నారు. చిత్రానికి స్టార్ డీవోపీ ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న నవీన్ నూలి ఎడిటర్. వినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ చేశారు. ఈ చిత్రం 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజున ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తారాగణం: రామ్ చరణ్, జాన్వి కపూర్, శివ రాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ

సాంకేతిక సిబ్బంది:రచన, దర్శకత్వం: బుచ్చి బాబు సానా, సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, బ్యానర్: వృద్ధి సినిమాస్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, సంగీతం: ఎఆర్ రెహమాన్, డిఒపి: ఆర్ రత్నవేలు, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, ఎడిటర్: నవీన్ నూలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్: ఫస్ట్ షో పీఆర్వో: వంశీ శేఖర్.



# 'ఓజీ' షూటింగ్ పూర్తి



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ శక్తివంతమైన పాత్ర గంభీరగా అలరించనున్న చిత్రం ఓజీ. పవన్ కళ్యాణ్ అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానుల్లో ఈ చిత్రంపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ ఓజీ చిత్రీకరణ పూర్తయిందని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా నిర్మాతలు ఒక ప్రత్యేక పోస్టర్ ను విడుదల చేశారు. వర్షంలో తడుస్తూ కారు దిగి గన్‌తో ఫైర్ చేస్తున్న పవన్ కళ్యాణ్ పోస్టర్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఓజీ ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలు జరుపుకుంటోంది. 2025 సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో అడుగు పెట్టనుంది. ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, ప్రియాంక అరుల్ మోహన్, ప్రకాష్ రాజ్, శ్రియ రెడ్డి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్ తమన్ సంగీతం సమకూరుస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న ఆర్‌ఆర్‌ఆర్‌ను నిర్మించిన డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో ఈ చిత్రం రూపొందుతోంది. డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. 2025లో అతిపెద్ద సినిమాటిక్ ఈవెంట్‌గా ఇప్పటికే ఓజీఖ్రప్రశంసించబడుతోంది. రవి కె చంద్రన్, మనోజ్ పరమహంస ఛాయాగ్రాహకులుగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# 'కేడీ ది డెవిల్' టీజర్ లాంచ్

కన్నడ యాక్షన్ ప్రిన్స్ ధృవ సర్జా హీరోగా కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద నిర్మాత వెంకట్ కె. నారాయణ అత్యంత భారీఎత్తున నిర్మించిన చిత్రం కేడీ ది డెవిల్. ఈ సినిమాను ప్రేమ్ తెరకెక్కించారు. ఈ మూవీలో ధృవ సర్జాకు జోడిగా రీష్మా నానయ్య నటించారు. ఇక ఈ ప్రాజెక్ట్‌లో సంజయ్ దత్, శిల్పా శెట్టి, నోరా ఫతేహి వంటి వారంతా ముఖ్య పాత్రల్ని పోషించారు. గురువారం నాడు ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో సంజయ్ దత్ మాట్లాడుతూ, హైదరాబాద్‌తో నాకు ఎంతో అనుబంధం ఉంది. ఇక్కడ ఎంతో మందితో కలిసి పని చేశాను. మరీ ముఖ్యంగా నాకు హైదరాబాద్ ఫుడ్ అంటే చాలా ఇష్టం. నేను ప్రభాస్ రాజా సాబ్ సినిమాకు పని చేస్తున్నాను. అక్కడే తెలుగు నేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాను. నాకు తెలుగులో చిరంజీవి గారంటే చాలా ఇష్టం. కేవీఎన్ ప్రొడక్షన్స్ వెంకీ సర్, సుప్రీత్‌లకు సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. అందుకే ఇలాంటి మూవీని ఇంత గొప్పగా నిర్మించగలిగారు. డైరెక్టర్ ప్రేమ్ చాలా మంచి వ్యక్తి. ఆయన ఎంతో ఒదిగి ఉంటారు. రీష్మా చాలా చక్కగా నటించారు. ధృవ్ నా తమ్ముడులాంటి వారు. ధృవ చాలా ఎత్తుకు ఎదగాలని కోరుకుంటున్నాను. శిల్పా శెట్టితో ఎప్పుడు పని చేసినా అదే ఎనర్జీ ఉంటుంది. మా సినిమాను అందరూ చూసి సక్సెస్ చేయండి అని అన్నారు. ధృవ సర్జా మాట్లాడుతూ, కేడీ కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా కెమెరామెన్ విలియం, మా నిర్మాత వెంకట్, సుప్రీత్, మ్యూజిక్ డైరెక్టర్ అర్జున్ అందరికీ ధన్యవాదాలు. నాకు సంజయ్ దత్ అంటే ఎంతో ఇష్టం. ఆయనతో పని చేయడం ఆనందంగా ఉంది. శిల్పా శెట్టి వంటి యాక్టర్లతో పని చేయడం ఎప్పుడూ సంతోషంగానే ఉంటుంది. సెట్స్ మీద ఆమె మా యాక్టింగ్‌ను కరెక్ట్ చేస్తుంటారు. రీష్మా మంచి నటి. మా మూవీ త్వరలోనే రాబోతోంది. అందరూ చూడండి. అందరికీ నచ్చుతుంది అని అన్నారు. దర్శకుడు ప్రేమ్ మాట్లాడుతూ, కేడీ ది డెవిల్ టీజర్‌కు వస్తున్న రెస్పాన్స్ చూస్తే నాకు మాటలు రావడం లేదు. నాకు కన్నడ మాత్రమే వచ్చు. తెలుగు అర్థం అవుతుంది.





శ్రియా శరణ్ నయా లుక్

# 'కూలీ' నుంచి పూజా హెగ్డే ఎక్స్‌ప్లోజివ్ షో

సూపర్ స్టార్ రజనీకాంత్, లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో ప్రతిష్టాత్మక సన్ పిక్చర్స్ బ్యానర్ నిర్మించిన క్రేజీ పాన్ ఇండియా యాక్షన్ మూవీ కూలీ. కింగ్ నాగార్జున కీలక పాత్ర పోషిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌తో సినిమా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ సెకండ్ సింగిల్‌ను విడుదల చేశారు. మోనికా అనే ఈ పాట ఎక్స్‌ప్లోజివ్ నెంబర్‌గా అదరగొట్టింది. సముద్ర నేపథ్యంలో సెట్ చేయబడిన ఈ పాటలో పూజా హెగ్డే రెడ్ కలర్ డ్రెస్‌లో, ప్రతి ఫ్రేమ్‌ను తన అద్భుతమైన మూవ్స్ తో కట్టిపడేసింది. ఆమెతో పాటు సౌబిన్ షాహిర్ కూడా కనిపించడం ట్రాక్‌కు ఫన్ ఎనర్జీ తీసుకు వచ్చింది. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ మరో చార్ట్‌బస్టర్‌ను కంపోజ్ చేశారు. అనిరుధ్, శుభలక్ష్మి కలసి హై ఎనర్జీతో పాడిన ఈ సాంగ్‌లో అసల్ కోలార్ రాప్ ఫ్రెష్ నెస్ యాడ్ చేసింది. కూలీ మూవీలో అమీర్ ఖాన్, ఉపేంద్ర, సత్యరాజ్ వంటి పవర్‌హౌస్ స్టార్స్ నటించారు. నిర్మాత కళానిధి మారన్ నిర్మాణంలో కూలీలో టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సినిమాటోగ్రఫీ గిరీష్ గంగాధరన్, ఎడిటింగ్ ఫిలోమిన్ రాజ్. ఆగస్టు 14న గ్రాండ్ పాన్‌ఇండియా విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ చిత్రం హాలీడే వీకెండ్ కి పర్ఫెక్ట్ టైం. ఈ సినిమా డి. సురేష్ బాబు, దిల్ రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ఆసియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. తారాగణం: రజనీకాంత్, నాగార్జున, ఆమిర్ ఖాన్, సత్యరాజ్, సౌబిన్ షాహిర్, ఉపేంద్ర, శ్రుతి హాసన్, మహేంద్రన్, సాంకేతిక బృందం: రచన, దర్శకత్వం: లోకేష్ కనగరాజ్, నిర్మాత: కళానిధి మారన్, బ్యానర్: సన్ పిక్చర్స్, రిలీజ్: ఆసియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, సంగీతం: అనిరుధ్ రవిచందర్, డిఒపి: గిరీష్ గంగాధరన్ ఎడిటర్: ఫిలోమిన్ రాజ్ పీఆర్వో: వంశీ శేఖర్.




# 'గదాధారి హనుమాన్' టీజర్

మైథలాజికల్ జానర్‌లో అత్యంత భారీ చిత్రంగా విరభ్ స్టూడియో బ్యానర్ మీద రేణుకా ప్రసాద్, బసవరాజ్ హురకడ్లి సంయుక్తంగా నిర్మించిన చిత్రం గదాధారి హనుమాన్. తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో తెరకెక్కించిన ఈ చిత్రంలో రవి కిరణ్ హీరోగా నటించారు. ఈ మూవీకి రోహిత్ కొల్లి దర్శకత్వం వహించారు. శుక్రవారం నాడు ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్, రాజ్ కందుకూరి, డైరెక్టర్ సముద్ర వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో సి.కళ్యాణ్ మాట్లాడుతూ, హనుమాన్ సినిమాను నేనే ప్రారంభించాను. ప్రశాంత్ వర్మకి నాతోనే సినిమాను ప్రారంభించాలనే ఓ సెంటిమెంట్ ఉంటుంది. ఆ హనుమాన్ ఎలా హిట్ అయిందో.. ఈ గదాధారి హనుమాన్ కూడా అంతే స్థాయిలో హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. హనుమాన్‌ను నమ్ముకున్న వారంతా విజయాన్ని సాధిస్తారు. టీజర్ అద్భుతంగా ఉంది. తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో వస్తోన్న ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. రాజ్ కందుకూరి మాట్లాడుతూ, గదాధారి హనుమాన్ టైటిల్ చాలా పాజిటివ్‌గా ఉంది. ఇలాంటి ఓ టైటిల్‌ను పెట్టుకుని సినిమా తీసిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. రవి కిరణ్ ఇది వరకే నాకు కథ చెప్పారు. క్లైమాక్స్ అద్భుతంగా ఉండబోతోంది. ఇలాంటి చిత్రాలు ఇప్పుడు ఎక్కువగా ఆడుతున్నాయి. సినిమాలో కంటెంట్ ఉంటే చిన్నదా? పెద్దదా? అన్న తేడాని ఆడియెన్స్ చూడటం లేదు. రవి కిరణ్ ఈ మూవీతో సూపర్ స్టార్ అవుతారనిపిస్తోంది. ఈ చిత్రం కచ్చితంగా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది అని అన్నారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ, గదాధారి హనుమాన్ ఈవెంట్‌కు విచ్చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. దర్శకుడు రోహిత్ నాకు మంచి మిత్రుడు. టీజర్ బాగుంది. రవి కిరణ్ ఈ చిత్రంతో మరోసారి పెద్ద విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను అని అన్నారు. హీరో రవి కిరణ్ మాట్లాడుతూ, మా కోసం వచ్చిన రాజ్ కందుకూరికి థాంక్స్. ఈ చిత్రాన్ని ఇంత గొప్పగా నిర్మించిన మా నిర్మాతలు బసవరాజ్, రేణుకా ప్రసాద్ గారికి థాంక్స్. మొదట్లో ఈ సినిమాను చాలా చిన్నగా చేయాలని అనుకున్నాం. కానీ ఆ హనుమాన్ ఇచ్చిన సపోర్ట్, శక్తి వల్లే ఈ సినిమాను ఇంతటి స్థాయిలో తెరకెక్కించగలిగాం. క్లైమాక్స్ చాలా కాంప్లికేటెడ్‌గా ఉంటుంది. మా చిత్రంలో మ్యూజిక్, బీజీఎం, విజువల్స్ నెక్స్ట్ లెవెల్లో ఉంటాయి. నేను చిరంజీవికి పెద్ద అభిమానిని. ఆయనకు హనుమాన్ అంటే ఇష్టం. ఆ ఇద్దరి ఆశీస్సులు మా సినిమాపై ఉంటాయని భావిస్తున్నాను. ఈ చిత్రంలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి.



# 'కె-ర్యాంప్' గ్లింప్

యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా కె-ర్యాంప్. కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న 11వ చిత్రమిది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. కె-ర్యాంప్ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఓ స్పెషల్ వీడియోతో కె-ర్యాంప్ సినిమా నుంచి రిచెస్ట్ చిల్లర్ గయ్ గ్లింప్స్ రిలీజ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ నెల 14న ఈ గ్లింప్స్ రిలీజ్ చేయ బోతున్నారు. కొచ్చి పోర్ట్ లొకేషన్‌లో కిరణ్ అబ్బవరం, దర్శకుడు జైన్స్ నాని మధ్య సరదా సంభాషణతో రూపొందించిన ఈ అనౌన్స్‌మెంట్ వీడియో ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశకు చేరుకున్న "కె-ర్యాంప్" మూవీ దీపావళికి గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.నటీనటులు: కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్, సాయి కుమార్, వెన్నెల కిషోర్ తదితరులు. టెక్నికల్ టీమ్: ప్రొడక్షన్ డిజైనర్: బ్రహ్మ కడలి, యాక్షన్: పృథ్వీ, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్.డీవోపీ: సతీష్ రెడ్డి మాసం, మ్యూజిక్: చేతన్ భరద్వాజ్, పీఆర్ఓ: జీఎస్ కే మీడియా (సురేష్ శ్రీనివాస్), వంశీ శేఖర్, కో ప్రొడ్యూసర్ బాలాజీ గుట్ట, ప్రొడ్యూసర్: రాజేష్ దండాశివ బొమ్మకు, రచన, దర్శకత్వం: జైన్స్ నాని.



# ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా మూవీ 'జూనియర్'

ప్రముఖ రాజకీయ నాయకుడు, వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి, రాధా కృష్ణ దర్శకత్వం వహించిన యూత్ ఎంటర్‌టైనర్ జూనియర్‌తో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మిస్తున్నారు. ఈ సినిమా పాటలు చార్ట్‌బస్టర్ హిట్ అయ్యాయి. టీజర్, ట్రైలర్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రానికి స్టార్ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ డివోపీగా పని చేస్తున్నారు. సినిమా జూలై 18న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సినిమాటోగ్రాఫర్ కె.కె.సెంథిల్ కుమార్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

**ఈ ప్రాజెక్టు ఎలా స్టార్ట్ అయింది?**
నిర్మాత సాయితో నాకు మంచి పరిచయం ఉంది. ఆయనతో ఈగ సినిమా చేశాను. ఆర్‌ఆర్‌ఆర్ తర్వాత ఈ సినిమా గురించి చెప్పారు. డైరెక్టర్ రాధాకృష్ణ చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. మంచి ప్రొడక్షన్ హౌస్, టెక్నికల్ టీం కూడా చాలా బాగుంది. అలా ఈ ప్రాజెక్ట్ చేయడం జరిగింది.

**ఈ కథలో మిమ్మల్ని అట్రాక్ట్ చేసిన ఎలిమెంట్ ఏమిటి?**
కొత్తవారిని పరిచయం చేసినప్పుడు ఫ్యామిలీ డ్రామా జానర్‌కి వెళ్ళరు. డాన్సు ఫైట్లు ఉంటే చాలు అనుకుంటారు. కానీ ఈ సినిమాలో స్ట్రాంగ్ ఎమోషన్ ఉంది. అది నాకు చాలా ఇంప్రెస్ చేసింది. కొత్త హీరో ఇలాంటి ఛాలెంజ్ తీసుకొని చేయడం అనేది నాకు చాలా నచ్చింది


**హీరో కిరీటి గురించి?**
కిరీటి చాలా హార్డ్ వర్కర్. చాలా అద్భుతమైన డాన్సర్. యాక్షన్ చాలా బాగా చేస్తాడు. తన యాక్టింగ్ కూడా చాలా బాగుంది. తను బ్యాలెన్స్డ్ యాక్టర్. తను వన్ ఆఫ్ ది బెస్ట్ న్యూ కమ్మర్.

**మీరు రాజమోళితో పెద్ద కాన్వాస్ సినిమాలు చేశారు. ఇప్పుడు జూనియర్ లాంటి న్యూ కమ్మర్ సినిమాని ఎంచుకోవడానికి కారణం?**
ప్రతి సినిమా దేనికదే ప్రత్యేకం. ఒక హెవీ గ్రాఫిక్స్ సిజీ వర్క్ ఉన్న సినిమా తర్వాత ఇలాంటి సినిమా చేయడం నాకూ రిఫ్రెష్‌గా అనిపించి చేశాను. ఇందులో ఉన్న కోర్ ఎమోషన్ నాకు చాలా నచ్చింది. ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాస్ రావడం తగ్గిపోయింది. ఇలాంటి సమయంలో ఈ సినిమా చేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది. ఈ సినిమా పాటలు జనాలకి నచ్చాయి. వైరల్ వయ్యారి పాటలో కిరీటి శ్రీలీల డ్యాన్సులు అందరినీ ఆకట్టుకున్నాయి. ట్రైలర్ కూడా బాగా నచ్చింది.

**మీరు ఒక సినిమాని సెలెక్ట్ చేసుకోవాలంటే కథలో ఎలాంటి ఎలిమెంట్స్ చూస్తారు?**
స్టోరీ ఎమోషనల్‌గా మూవ్ అవుతుందో లేదో చూస్తాను. అది చాలా ఇంపార్టెంట్. ఎమోషన్ మనల్ని కదిలించకపోతే మిగతా ఎలాంటి ఎలిమెంట్స్ ఉన్నా కూడా వర్కౌట్ అవ్వదు.

**మీరు రాజమోళితో కంటిన్యూగా పని చేశారు కదా..ఇప్పుడు చేస్తున్న సినిమాకి గ్యాప్ రావడానికి కారణం ఏమిటి?**
ఇప్పుడే కాదండి. గతంలో కూడా రాజమోళి నేను వరుసగా సినిమాలు చేస్తున్నప్పుడు మధ్యలో గ్యాప్ ఉండేది.

**రవిచంద్రన్‌తో పనిచేయడం ఎలా అనిపించింది?**
రవిచంద్రన్ గ్రేట్ యాక్టర్. ఆయన ఏజ్‌లో ఆయనకున్న ఎనర్జీ చూస్తే అన్ బిలియబుల్ అనిపిస్తుంది. ఆయనతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్పీరియన్స్.



కె.కె.సెంథిల్ కుమార్

# సమస్యలు తీర్చుకునే సెంటర్

ఇండోర్‌లోని సేతీ నగర్ అది. అక్కడి ఆడవాళ్లు ప్రతి మంగళవారం స్థానిక అంగన్‌వాడీల దగ్గర సమావేశమవు



తారు. అందులో ఆశ్చర్యమేముందీ.. అంటారా! ఆశ్చర్యం లేదు కానీ ఈ సెంటర్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడకు ఆడవాళ్లు వచ్చేది పోషకాహారం తీసుకోవడానికో, పిల్లల బరువు చూసుకోవడానికో కాదు, అందరూ కలిసి ఆత్మీయంగా మాట్లాడుకోవడానికీ, ఒకరి సమస్యలు మరొకరికి చెప్పుకోవడానికీ, పరిష్కారాలు వెతుక్కోవడానికీ.. అవును మరి, కొత్తగా తల్లైన రాణికి ఎన్నో సందేహాలు. వాటన్నింటికీ ఆమెకు జవాబు ఇక్కడ దొరుకుతుంది. ఇంతకుముందు ఇతరుల ముందు మాట్లాడగలుగుతోంది. కారణం.. తన గొంతు వినిపించడానికి దీన్నే ఓ సురక్షిత స్థలం అనుకుంటోంది కాబట్టి. తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతోన్న పాపను వెంటనే న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్‌కు తీసుకెళ్లమని సూచించడంతో.. ఆ పాప రెండు వారాల్లోనే కోలుకుని నడవటం ప్రారంభించింది. ఇది ఆ అమ్మకు ఓ కొత్త ఊపిరి. స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ గురించి సరైన సమయంలో సూచించటంతో ఓ బాలిక ఆర్థిక ఇబ్బందులు లేకుండా చదువుకుని ఇప్పుడు నీట్‌కు ప్రిపేర్ అవుతోంది. ఇది ఆ కుటుంబానికి ఓ పెద్ద సాయం అలా.. ఆర్థిక ఒత్తిళ్లు, రుతుక్రమ సమస్యలు, గృహహింస సమస్య ఏదైనా వాళ్లందరికీ చర్చించేందుకు ఈ సెంటర్ మంచి స్థావరంగా మారింది. మహిళలు సంఘటితంగా ఉంటే ఎలాంటి సమస్యనైనా, కష్టాన్నైనా ఎదుర్కొవచ్చనటానికి ఈ సెంటర్ ఓ ఉదాహరణ. కేవలం పాలసీలో ఉన్న కార్యక్రమాలే కాకుండా, ఇలా ఆడవాళ్లకు సపోర్ట్ చేసే ఓ వ్యవస్థలా మారటం.. సరికొత్త మార్పునకు శ్రీకారం చుట్టినట్లే. ఈ ఛేంజ్ అంతటా వస్తే బావుంటుంది కదా! □

# తలపై బోనం 'అమ్మ'పై ధ్యానం

**ఆషాఢమాసం ఆరంభంతోనే అమ్మవారి ఆలయాలు శోభాయమానంగా ముస్తామవుతాయి. పూజలు, హోమాలు, అలంకారాలు, భక్తుల సందడితో ప్రతి ఆలయం కోలాహలంగా ఉంటుంది. ఇక ఈ మాసంలో చెప్పుకోదగినది హైదరాబాద్, సికింద్రాబాద్ బోనాలు ఉత్సవం. ఈ బోనాల ఉత్సవం అమ్మవారి ఆలయాలతో పాటు వీధి వీధిన ఎంతో వేడుకగా జరుగుతుంది. పంటపొలాలను రక్షించుకునేందుకు ఊరి ప్రజలంతా కలిసి సామూహికంగా జరుపుకునేది బోనాల పండుగ. ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో పెద్ద పండుగ అని కూడా అంటారు.**

ఊరి మధ్యలో ఉండే బొడ్రాయి ఊరికి నాభి స్థానంలో ఉంటుంది. ఊరి చివరలో పంటపొలాలకు వెళ్లే దారిలో పోచమ్మ, చెరువు గట్టు మీద కట్ట మైసమ్మ,పచ్చికబయళ్ల వద్ద ఉప్పలమ్మ ఆలయాలు ఉంటాయి. బోనాల ఊరేగింపు ఊరి మధ్యలో ఉండే బొడ్రాయి దగ్గర ప్రారంభమై, పోచమ్మ ఆలయానికి చేరుకుని కట్టమైసమ్మ ఆలయం దిశగా సాగిపోతుంది. ఇలా ఆ ఊరేగింపు డప్పుశబ్దాలు, పూనకాలతో గ్రామదేవత దగ్గరికి వెళుతుంది. అక్కడ బలి కార్యక్రమం ఉంటుంది. గ్రామదేవతలు శక్తి ఆరాధనకు ముందరి ఆదిమదేవతారూపాలు. కాలక్రమేణా గ్రామదేవతకో స్పష్టమైన రూపాన్ని, భావాన్ని నిర్మించారు. ఆ భావజాలం బలపడుతూ దాని చుట్టూ అనేక క్రతువులు, నమ్మకాలు వచ్చి చేరాయి. అలా గ్రామదేవతల వ్యవస్థ బలపడింది. గ్రామదేవతకు సంబంధించిన ఆలయం ప్రాంగణంలో వేపచెట్టు ఉంటుంది. హైదరాబాద్‌లోని గోల్కొండ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఒక్కో ప్రాంతానికి ఒక్కో చెరువు ఉండేది. గ్రామదేవతలు కూడా ఉండేవారు. ఈ గ్రామదేవతలు పోచమ్మ, ఎల్లమ్మ, కట్టమైసమ్మలను కలిపి చేసే పండుగే బోనాల పండుగ. ప్రస్తుతం మచ్చుకైనా చెరువులు కనిపించడంలేదు. గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. అయినా బోనాలు ఉత్సవాలు జరుగుతున్నాయి. మారుతున్న నగర జీవనంతో పాటు బోనాల పండుగ నిర్వహణ రీతులలో కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త కుండకు సున్నం పసుపు రాసి కుంకుమతో బొట్టుపెడతారు. తెల్లని వస్త్రంలో నవధాన్యాలు పోసి చిన్న ముల్లెగా కట్టి ఆ గుడ్డ నాలుగు అంచులను పైకి ఒత్తిగా పేనుతారు. మట్టి మూతలో నూనె పోసి ఆ వత్తిని అందులో పెడతారు. బోనం ఎత్తే ముందు వత్తిని వెలిగిస్తారు. కుండలో అమ్మవారి కోసం చేసిన ప్రత్యేక భోజనం పెడతారు. కింది కుండలో నీరు, పై ముంతలో నైవేద్యం ఉంటుంది. ఆ నీటితో అమ్మవారికి అభిషేకం చేసి, నైవేద్యాన్ని అర్పించి కల్లుతో సాక పెడతారు. కొందరు నైవేద్యంగా తీపి వంటకాలనే పెడుతున్నారు. కల్లు, సారా సాకలు కూడా తగ్గాయి. బోనాలకు పెళ్లయి అత్తవారింట్లో ఉన్న కూతురిని, అల్లుడిని ఇంటికి ఆహ్వానిస్తారు. ఇంటి గుమ్మానికి మామిడి తోరణాలు వేపాకు మండలు అలంకరిస్తారు. ముంగిట్లో కల్లాపి చల్లి చక్కటి ముగ్గురు పెడతారు. ఎవరి తాహతును బట్టి వారు అమ్మవారికి కోడినో, పొట్టేలునో హారం ఇస్తారు. హారంగా ఇచ్చిన మాంసంతో కూర, బగారా అన్నం వండి అమ్మవారికి బోనంగా సమర్పిస్తారు. కల్లుతోగాని, సారాతో గాని సాక పెడతారు. కొత్తగా తల్లిదండ్రులయిన దంపతులు అమ్మవారికి తొట్టెలను సమర్పిస్తారు. బోనాల ఊరేగింపులో కాళ్లకు ఘల్లుఘల్లు మనే గజ్జెలు, దవడలకు నిమ్మపండ్లు, ఒళ్లంతా బండారు పూసుకుని వచ్చే పోతురాజుల నృత్యాలు ప్రత్యేకంగా ఉంటాయి. ఒకప్పటి బైండ్ల పూజారి ప్రతిరూపమే ఈ పోతురాజు. గ్రామదేవతల సోదరుడు




పోతురాజు. ఇక ఆడపడుచులు, కొత్తకోడళ్లు నూతన వస్త్రాలు ధరించి నగలు అలంకరించుకుని బోనం ఎత్తుకుంటారు. తలపై బోనాలతో గుంపులు గుంపులుగా బయలుదేరతారు. గుంపుకు ముందు డప్పులు, బ్యాండుమేళం ఉంటుంది. వీరితో పాటు పూనకంతో ఊగిపోతూ పోతురాజులు నృత్యం చేస్తుండగా, నెత్తిమీద బోనం పెట్టుకుని రెండు



చేతుల్లో వేపమండలు పట్టుకుని కొందరు మహిళలు లయబద్ధంగా పూనకంతో ఊగిపోతూ ఊరేగింపుతో పాటు కదులుతుంటారు. ఈ సందడితో కలిసి యువకులు కూడా ఉత్సాహంగా తీన్‌మార్ డాన్సులు వేస్తుంటారు. ఇలా కోలాహలంగా సాగుతూ ఆలయానికి చేరుతారు. ఎల్లమ, పోచమ్మ ఆలయాలకు చేరుకుని బోనం సమర్పించిన అంతే ఉత్సాహంగా ఇళ్లకు చేరుకుని ఇంటిల్లిపాది పండుగ చేసుకుంటారు. వర్షాకాలం ఆరంభంలో వచ్చే అంటువ్యాధుల నుండి తమను కాపాడమంటూ గ్రామదేవతల ప్రీత్యర్థం చేసే పండుగ ఇది. ఆషాఢమాసం ఆరంభంలో గోల్కొండకోటలో బోనాల పండుగ ఆరంభమవుతుంది. ఆ తర్వాత ఒక్కో ప్రాంతంలో ఒక్కో వారం ఈ పండుగను జరుపుకుంటారు. సికింద్రాబాద్ జనరల్‌బజార్‌లో ఉన్న మహంకాళి ఆలయంలో పూర్వం అమ్మవారి దారు శిల్పం ఉండేది. సుమారు 1815కి క్రితం ఉజ్జయిని నుంచి ఒక సైనికోద్యోగి తెచ్చిన కాళికాదేవి విగ్రహాన్ని ప్రతిష్టించి నిర్మించిన గుడి ఇది. నర్సయ్య అనే సైనికుడు 1813లో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి బదిలీపై వెళతాడు. అప్పుడు అక్కడ కలరా వ్యాపించి ఉంటుంది. ఆ కలరా బారిన పడకుండా తాను సికింద్రాబాద్‌కు క్షేమంగా చేరితే అక్కడ అమ్మవారి గుడి కడతానని ఉజ్జయినిలోని కాళికాలయంలో మొక్కుకుంటాడు. ఆ మొక్కు ఫలితమే నేటి ఉజ్జయిని మహంకాళి ఆలయం. కాలక్రమంలో బాగా అభివృద్ధి జరిగి మహంకాళి గుడిలో బోనాల ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. మహంకాళి ఆలయంలో జరిగే బోనాల ఉత్సవానికి ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు వస్తారు. సికింద్రాబాద్ బోనాలను ఇక్కడ స్థిరపడిన అన్ని కులాలు, మతాల వారు జరుపుకుంటారు. ప్రస్తుతం జరుగుతున్న ఉత్సవాలు గ్రామదేవతల ఆరాధన పద్ధతులతో పాటు ఉత్తరాది శాక్తేయ ఆచారాలు, శిష్టదేవత ఆరాధన రీతులలో కలగలసి ఉంటుంది.

**- బూర. మీనాక్షి**

# గదిలో తేమను తగ్గిద్దాం!



రోజులో ఎప్పుడో ఒకప్పుడు వర్షం కురుస్తూనే ఉంటోంది. ఇల్లంతా తేమ చేరి ఒకలాంటి వాసన వస్తుంది. దీంతో పప్పులకు పురుగులు పట్టడం, కబోర్డులు వాసన రావడం... ఒకటేమిటి బోలెడు సమస్యలు. ఆ ఇబ్బందిని తొలగించడానికి ఈ సహజ చిట్కాలు ఉపయోగపడతాయి.

- ఇంట్లో తేమ ఎక్కువగా చేరితే.. వెంటిలేషన్ సరిపోవడం లేదని గ్రహించండి. కిటికీలు, తలుపులు తెరవడం, ఫ్యాన్ ఉపయోగించి గాలి ప్రసరణ పెంచండి. ఒక గిన్నెలో కొన్ని బొగ్గు ముక్కలు వేసి గదులు, అల్మారాల్లో ఉంచండి. ముక్క వాసన తగ్గుతుంది.
- . నీటిలో కొద్దిగా వినెగర్ కలిపి స్ప్రే బాటిల్లో నింపి తేమ వాసన వచ్చే చోట స్ప్రే చేస్తే సరి. అలానే ఫ్లోరింగ్‌ని శుభ్రం చేసేటప్పుడు నీళ్లల్లో కొద్దిగా వినెగర్, వంటసోడా కలిపి తుడవండి. ఈ మిశ్రమాలు యీజు రాకుండా అడ్డుకుంటాయి.3. బేకింగ్ సోడాను చిన్న చిన్న గిన్నెల్లో చేసి షూ ర్యాక్లు, బాత్రూమ్, కిచెన్లలో పెట్టండి. ఇది దుర్వాసన దూరం చేస్తుంది.
- ఇండోర్ మొక్కలైన స్పైడర్ ప్లాంట్, పీస్ లిల్లీ గాల్లోని తేమను నియంత్రించవచ్చు. గోడలకు చెమ్మ వస్తుంటే హ్యుమిడిఫయర్ కోసం. □

# సిరప్ డిస్పెన్సర్



పిజ్జా, పాన్‌కేక్‌ల మీద తేనె, ఆలివ్ నూనె, షుగర్ సిరప్ వంటివి వేస్తాం కదా! ఆ పని సులువుగా చేసేందుకు సిరప్ డిస్పెన్సర్ రూపొందించారు. ఈ చిన్ని సాధనంలో సిరప్‌ను నింపి, మీట నొక్కితే అవసరమైనంత పడుతుంది. చేతికి జిడ్డు, చమురు వంటివి అంటవు. హ్యాండిల్ ఉన్న ఈ పరికరం చూడసొంపుగా, పట్టుకోవడానికి అనువుగా ఉంది. □

# దీన మనస్సుతో ప్రభువుని సేవిద్దాం..

**'చిన్నలారా, మీరు పెద్దలకు** లోబడియుండుడి, మీరందరు ఎదుటివానియెడల దీనమనస్సు అను వస్త్రము ధరించుకొని మిమ్మును అలంకరించుకొనుడి, దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును. దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్టమైన చేతిక్రింద దీనమనస్కులై యుండిడి' (1 పేతురు 5: 5,6). వస్త్రాల విషయంలో మనమెంతో జాగ్రత్తలు తీసుకుంటాం. ఒక్కోసీజన్‌లో ఒక్కోరకమైన వస్త్రాలను ధరిస్తాం. పార్టీలకు, ఆయా వేడుకులకు ఒకరకమైన వస్త్రాలు, డైలీవేర్‌కు మరోరకమైన



దుస్తులను ధరిస్తుంటాం. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రత్యేక వస్త్రాలను వేసుకుంటాం. అయితే పేతురు ఇక్కడ దీనమనస్సు అనే వస్త్రాలను ధరించుకొని మిమ్మును అలంకరించుకొనుడి అని చెబుతున్నాడు. ఉదాహరణకు చర్చికి మనం అహంకారంతో, గొప్పభక్తిపరులమనే భావనతో, అందరికంటే ఉన్నతమైన వ్యక్తి అని చూపించుకునే భావాలతో చర్చిలో కూర్చుంటే మనం దిగంబరులమని గుర్తించాలి. దీనమనసు అంటే ఎదుటివారిపట్ల మనకున్న వైఖరి గురించి పేతురు చెబుతున్నాడు. ఎప్పుడూ ఎదుటివారిపట్ల ప్రేమ, ఆప్యాయత, కరుణ, ఆదరణ వంటి ప్రవర్తన కలిగి ఉండాలని పేతురు చెబుతున్నాడు. చాలామందికి ఇది చాలా కష్టతరమైనది. ఎందుకంటే అనేకుల్లో గర్వం, అతిశయించే మనసు ఉట్టిపడుతుంటుంది. ఆత్మవిశ్వాసం వేరు, గర్వం వేరు. పలాన పని చేయగలం అనేది ఆత్మవిశ్వాసం అయితే, ఈ పని నేనుమాత్రమే చేయగలను అనేది గర్వం. గర్వించే మనసును దేవుడు ఇష్టపడడు. అంతే కాదు, ఆయన కృప మనకు ఉండదు. దేవుడి కృపలో మనం వర్ధిల్లాలి అంటే తప్పనిసరిగా మనం అన్నివిషయాలో దీనత్వం, ప్రేమ, ఆప్యాయత, క్షమించే మనసు ఉండాలి. దీనత్వం చూపించడం అంటే అది ఏదో మనల్ని మనం తక్కువ చేసుకుంటున్నాం అని అనుకుంటారు. ఎంతమాత్రం కానేకాదు. ఈలోకంలో మనం ఎంత దీనత్వంతో జీవిస్తామో, దేవుడు మనకు అంత ఘనతను ఇస్తాడు. అందుకే పేతురు దీనమనసు అనే వస్త్రాన్ని ధరించుకోమంటున్నాడు. మన దేహానికి దుస్తులు ఎప్పుడూ అవసరమే. మన నగ్నత్వాన్ని దాచుకోవాలంటే దుస్తులు తప్పనిసరిగా ధరించాలి. అలాగే దీనత్వం అనే వస్త్రాలను కూడా మన దేహంపై ఉంచుకోవాలి. దేవుడు అహంకారులను ఎదిరించి, దీనులకు తన కృపను ఇస్తాడు. మనం దేవుడి కృపలో జీవించాలంటే దీనమనసు కలిగి జీవించాలి. అలాగని మనకు కోపం, ఆవేశం, ఆవేదన రావని కాదు. కోపపడినా..వెంటనే క్షమాపణ వేడుకునే మనసును అలవర్చుకోవాలి. అప్పుడే దేవుడు ఆశించే భక్తిలో మనం వర్ధిల్లుతాం. ఇలాంటి భక్తిలో ముందుకు సాగిపోదాం..

**-పి.వాణిపుష్ప**

అంతర్వాణి

# పసందైన కీమా రుచులు

మటన్ ముక్కలో సింగిల్ ఎముక లేకుండా కీమా కొట్టడం అంటే మామూలు ముచ్చట కాదు. అంత పద్ధతిగా కొట్టిన కీమా..చేయి తిరిగిన వంటవాడి చేతిలో పెడితే.. ఎలా ఉంటుంది చెప్పండి? మసాలా దట్టించుకొని.. నూనెలో మునిగి.. కూరలో తేలి..బిర్యానీలో కుదిరి.. సమెసాలో చేరి.. పళ్లెంలోకి వచ్చేస్తుంది. ముదముద్దనూ ఆస్వాదిస్తూ లాగించేయడమే మన పని. కాదంటారా! అయితే వెరైటీలు చేసి చూడండి. కీమా కథ క్లైమాక్స్‌లో ఆహా, ఓహోలు తప్ప మరే మాటలూ వినిపించవు !

## కీమా సమోసా..

**కావాల్సినవి :** కీమా - అరకిలో, అల్లం వెల్లుల్లి పేస్ట్- చెంచా, గరంమసాలాపొడి-చెంచాన్నర, సన్నగా తరిగిన పుదీనా- రెండు చెంచాలు, పచ్చిమిర్చి- నాలుగు నూనె- అరకప్పు, మైదా 300గ్రా, లవంగాలు- మూడు, కొత్తిమీర తరుగు-రెండు చెంచాలు, ఉల్లిపాయ- ఒకటి, పెరుగు-చెంచా, ఉప్పు- తగినంత.



**తయారీ :** మైదాలో తగినంత ఉప్పు, కొద్దిగా నూనె వేసి చపాతీపిండిలా గట్టిగా కలుపుకోవాలి. వీటిని చపాతీల్లా ఒత్తుకుని ఒకవైపు మాత్రం పెనంపైన కాల్చుకోవాలి. వీటిని సగానికి చాకుతో కోస్తే సమోసాలు చేయడానికి వీలుగా ఉంటాయి. ఒక కడాయిలో నూనె పోసి వేడిచేసి అందులో ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి, అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి వేయించుకోవాలి. అప్పుడు కీమా, ఉప్పు వేసి తక్కువమంట మీద ఉంచి మూతపెట్టేయాలి. కీమా ఉడికిన తర్వాత గరంమసాలా, పెరుగు కొత్తిమీర, పుదీనా ఆకులు వేసి మరికాసేపు మగ్గించుకోవాలి. ఈ మిశ్రమం చల్లారిన తర్వాత సగానికి కోసిన చపాతీలను కోన్ మాదిరిగా మలుచుకుని అందులో ఈ కీమా మిశ్రమం ఉంచి అంచులని మూసేయాలి. వీటిని నూనెలో వేయించుకుని పుదీనా చట్నీతో తింటే ఆ రుచి అదుర్స్.

## కార్జం-కీమా ...

**కావాల్సినవి :** కీమా-300గ్రా, నూనె-నాలుగు చెంచాలు, ఉల్లిపాయ-ఒకటి, అల్లం-రెండు అంగుళాల ముక్క, వెల్లుల్లి రెబ్బలు-పది, టమాటా గుజ్జు - నాలుగు చెంచాలు, పసుపు- అరచెంచా, కారం- అరచెంచా, ధనియాలపొడి-రెండు చెంచాలు, గరంమసాలా పొడి- అరచెంచా, ఉప్పు-రుచికి తగినంత, కార్జం-200 గ్రా, కొత్తిమీర కొద్దిగా.



**తయారీ :** ఒక కడాయిలో నూనె పోసి వేడిచేసుకోవాలి. తరిగిన ఉల్లిముక్కలని నూనెలోవేసి గోధుమరంగులోకి వచ్చేంత వరకూ వేయించుకోవాలి. మిక్సీలో అల్లం,వెల్లుల్లి రెబ్బలువేసి మెత్తగా మిక్సీ పుట్టుకోవాలి. ఈ మిశ్రమాన్ని వేగిన ఉల్లిపాయముక్కల్లో వేసి మూడు నిమిషాలపాటు వేయించుకోవాలి. ఆ తర్వాత టమాటా గుజ్జు కూడా వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేయించుకోవాలి. ఇప్పుడు పసుపు, కారం, ధనియాలపొడి, గరంమసాలాపొడి,ఉప్పు కూడా వేసుకోవాలి. ఇవన్నీ ఉడుకుతూ నూనెపైకి తేలుతుంది. అప్పుడు కీమా వేసి మూతపెట్టి పావుగంటపాటు ఉడికించు కోవాలి. చివరిగా కార్జం కూడా వేసి మరో పది నిమిషాలపాటు ఉడికించుకుంటే రుచకరమైన కీమాకార్జం సిద్ధమవుతుంది.

## కీమా బిర్యానీ...



**కావల్సినవి :** బాస్మతి బియ్యం-350, పెరుగు-3 చెంచాలు, అల్లం పేస్ట్-చెంచా, నెయ్యి-100గ్రా, కుంకుమపువ్వు- చిటికెడు, కారం-చెంచా నిమ్మరసం-చెంచా, కీమా-400 గ్రా, ఉల్లిపాయ-ఒకటి, వెల్లుల్లి పేస్ట్ - చెంచా, పాలు-అరకప్పు, దాల్చినచెక్క-ఒకటి, లవంగాలు-నాలుగు, చికెన్ ఉడికించిన నీళ్లు- కప్పు, ఉప్పు-తగినంత.

**తయారీ:** ముందుగా బాస్మతి బియ్యాన్ని ఉప్పు వేసిన నీళ్లలో పలుకుగా ఉడికించి వార్చి పక్కన పెట్టుకోవాలి. పాలల్లో కుంకుమపువ్వు కలిపి పక్కనపెట్టుకోవాలి. కడాయిలో నెయ్యి వేడి చేసుకుని అందులో ఉల్లిపాయ ముక్కలు ముదురు గోధుమరంగులోకి వచ్చేంతవరకూ వేయించుకోవాలి. ఇందులోనే దాల్చినచెక్క, లవంగాలు వేసి వాటి పరిమళం బయటకు వచ్చేంతవరకూ ఉండాలి. ఇందులోనే కీమా వేసి గరిటెతో కలియతిప్పి.. అల్లంవెల్లుల్లి పేస్ట్ కూడా వేసి పచ్చివాసన పోయేంతవరకూ వేయించి ఉప్పు కలుపుకోవాలి. కీమా పూర్తిగా వేగిన తర్వాత.. పెరుగు, కారం వేసి తక్కువ మంట మీద మగ్గించుకుని పక్కన పెట్టుకోవాలి. కుక్కర్ కానీ, మూత ఉన్న మందపాటి పాత్రను కానీ తీసుకుని ముందుగా పలుకుగా ఉడికించిన అన్నాన్ని ఒక పొరలా వేసుకోవాలి. దానిపై ఉడికించిన కీమాని వేసుకోవాలి. ఆపైన కుంకుమపువ్వు కలిపిన పాలను సగం పోసుకుని, ఆపై కొద్దిగా నిమ్మరసం వేసుకోవాలి. ఇదే పద్ధతిలో మళ్లీ పలుకుగా ఉడికించిన అన్నం, కీమా, పాలు వేసి చివరిగా తగినంత చికెన్ ఉడికించిన నీళ్లు పోసుకోవాలి. ఆవిరి బయటకు పోకుండా మూతపెట్టేసి తక్కువమంట మీద పదిహేను నిమిషాల పాటు ఉడికించుకుని దింపుకోవాలి. కుక్కర్‌ని నేరుగా మంట మీద పెట్టకుండా ఒక పాన్ పెట్టుకుని దానిమీద పెట్టుకుంటే అడుగు మాడకుండా బిర్యాని చక్కగా పొడిపొడిగా వస్తుంది.

## తవా కీమా...



**కావాల్సినవి :** కీమా-పావుకేజీ, ఉల్లిపాయ-ఒకటి, టమాటాలు-రెండు, కసూరీమేథీ-అరచెంచా, కారం-చెంచా, పసుపు-పావుచెంచా, అల్లంవెల్లుల్లి పేస్ట్-చెంచా, సన్నగా తరిగిన అల్లం-చెంచా, పిచ్చిమిర్చి-రెండు, జీలకర్ర-చెంచా, ఉప్పు తగినంత, గరంమసాలా-అరచెంచా, నూనె-.నాలుగు చెంచాలు.

**తయారీ:** పెనంగానీ, వెడల్పుగా, మందంగా ఉండే పాన్‌గానీ తీసుకుని అందులో రెండు పెద్ద చెంచాల నూనె పోసుకోవాలి. అది వేడెక్కిన తర్వాత అల్లం వెల్లులి పేస్ట్ వేసి అది పూర్తిగా వేగిన తర్వాత కీమా కూడా వేసి రంగు మారేంతవరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత టమాటా ముక్కలు వేసి మూతపెట్టేసి మరో ఐదు నిమిషాల పాటు ఉడికించుకోవాలి. ఇప్పుడు ఉప్పు, పసుపు, కారం, కసూరిమేథి, జీలకర్రపొడి, గరంమసాలా పొడి వేసి పూర్తిగా కలిసేంతవరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత ఉల్లిపాయముక్కలు, పచ్చిమిర్చి వేసి వేయించుకుని తగినన్ని నీళ్ల పోసి సన్నమంట మీద ఉంచి కీమాని పూర్తిగా ఉడికించుకోవాలి. చివరిగా సన్నగా తరిగిన అల్లం ముక్కలు పైన అలంకరించుకుంటే తవా కీమా రెడీ. పావ్ బ్రెడ్‌లకి కొద్దిగా బటర్ రాసి పెనంపై వేడిచేసి కీమాతో కలిపితింటే చాలా రుచిగా ఉంటాయి. ముంబయి స్ట్రీట్‌ఫుడ్ పావ్‌కీమా చాలా ప్రసిద్ధి. □

## చెలి చిట్కాలు

- ★ మన ము తినే ఆహారములో వీలైనంత ఎక్కువగా క్యారెట్ తీసుకుంటే కళ్లజబ్బులను నివారించవచ్చు.
- ★. తలలో చుండ్రుపోయి మెదడు చల్లబడాలంటే తలస్నానంచేసే ముందు మంచి నిమ్మకాయలతో తలరుద్దుకొని అరగంట తర్వాత స్నానము చేయాలి.
- ★ ఇంట్లో కొడిగుడ్డును వ్రేలాడదీసిన యెడల ఆ ఇంటికి ఏ దోషాలు తగలక పోవడమేకాక సమస్త శుభములు కలుగును □



మహిళల ప్రపంచకప్‌లో..

# వంతిక సంచలనం

## వరల్డ్ మాజీ ఛాంపియన్ ఉషెనినా ఓటమి

**న్యూఢిల్లీ:** ఫిడే మహిళల చెస్ ప్రపంచ కప్-2025లో భారత క్రీడాకారిణి వంతికా అగర్వాల్ టైబ్రేకర్లలో మాజీ ప్రపంచ ఛాంపియన్ అన్నా ఉషెనినాను ఓడించి సంచలన విజయంతో మూడో రౌండ్‌కు చేరుకుంది. ఉషెనినాతో జరిగిన రెండో క్లాసికల్ గేమ్‌లో బ్లాక్ పావులతో ఓడిపోయిన తర్వాత టైబ్రేక్‌లోకి వెళ్లాల్సి వచ్చిన అగర్వాల్, బ్లిట్జ్ టైబ్రేక్‌లలో నిర్ణయాత్మక దెబ్బ కొట్టింది. 15 నిమిషాల మరియు 10 నిమిషాల రాపిడ్ టైమ్ కంట్రోల్ టైబ్రేక్ గేమ్‌లలో అగర్వాల్ మరియు ఉషెనినా డ్రాగా ముగిసిన తర్వాత ఇది జరిగింది. టైబ్రేకర్లలో అగర్వాల్ తొలి బ్లిట్జ్ గేమ్‌ను తెల్ల పావులతో గెలిచి, తన ప్రతిభను చాటుకుంది. ముందుకు సాగడానికి ఒక డ్రా మాత్రమే అవసరం కావడంతో, నల్ల పావులతో పటిష్టమైన రక్షణాత్మక ఆటతో భారత క్రీడాకారిణి తన స్థానాన్ని నిలుపుకుంది. ఉషెనినాతో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో అగర్వాల్ 4-5, 3-5 తేడాతో విజయం సాధించి మూడవ రౌండ్‌లోకి ప్రవేశించింది. అయితే పద్మిని రౌత్, ప్రియాంక కె ఈ టోర్నీ నుండి నిష్క్రమించారు. మరో చోట, ఇద్దరు భారతీయులు పద్మిని రౌత్ మరియు ప్రియాంక టైబ్రేకర్లలో తమ తమ మ్యాచ్‌లను ఓడిపోయి పోటీకి వీడ్కోలు పలికారు. అలెగ్జాండ్రా కోస్టెనిక్‌తో తలపడిన రౌత్, టైబ్రేక్‌లలో ఎక్కువ భాగం తన ఆధిక్యాన్ని నిలుపుకుంది కానీ చివరికి బ్లిట్జ్ సమయ నియంత్రణలో విఫలమైంది. ఇద్దరి మధ్య జరిగిన రెండు క్లాసికల్ గేమ్‌ల మాదిరిగానే, 15 నిమిషాల రాపిడ్ గేమ్‌లు డ్రాగా ముగిశాయి.




# ఎటిపి ఛాలెంజర్‌లో సెమీస్‌కు సుమిత్

## మాగ్జిమ్‌పై మూడు సెట్ల ఘన విజయం

**న్యూఢిల్లీ:** ఎటిపి ఛాలెంజర్‌లో భారత ఆటగాడు సుమిత్ నాగల్ మాగ్జిమ్ మ్రావ్వాపై మూడు సెట్ల విజయంతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఈ టోర్నీలో సుమిత్ తన రెడ్‌హాట్ ఫామ్‌ను కొనసాగించాడు, చెక్ రిపబ్లిక్‌కు చెందిన రైజింగ్ స్టార్ మాగ్జిమ్ మ్రావ్వాను 6-1, 3-6, 6-1 తేడాతో ఓడించి సెమీఫైనల్లో స్థానాన్ని ఖాయం చేసుకున్నాడు. తొలి సెట్‌లో రెండుసార్లు మ్రావ్వాను బ్రేక్ చేసిన అద్భుతమైన ఆరంభం తర్వాత, చెక్ ఆటగాడు ఘనమైన రిటర్న్‌లు మరియు మెరుగైన కోర్టు కవరేజ్‌తో స్పందించడంతో నాగల్ రెండవ సెట్‌లో నెట్టబడ్డాడు. అయితే నాగల్ త్వరగా తిరిగి కోలుకుని క్లిష్టమైన క్షణాల్లో సమతుల్యత మరియు పరిపక్వతను ప్రదర్శించి, నిర్ణయాత్మక జట్టుపై ఆధిపత్యం చెలాయించాడు. నాగల్ అత్యుత్తమ స్థిరత్వాన్ని ప్రదర్శించడంతో మొత్తం 74 పాయింట్లను గెలుచుకున్నాయి, మ్రావ్వా 55 పాయింట్లు సాధించాడు, మ్రావ్వా 4/5తో పోలిస్తే 7/8 బ్రేక్ పాయింట్లను మార్చాడు, మొదటి సర్వ్‌లో 67 శాతం విజయం మరియు రెండవ సర్వ్‌లో 56 శాతం విజయం సాధించాడు. అతను 32 రిసీవింగ్ పాయింట్లను కూడా గెలుచుకున్నాడు. నాగల్ కేవలం 1 ఏస్ మాత్రమే కొట్టి 2 డబుల్ ఫాల్ట్‌లు చేసినప్పటికీ, అతను సుదీర్ఘ ర్యాలీలలో స్థిరంగా నిలిచి బేస్‌లైన్ ఎక్స్ఛేంజ్‌లలో మ్రావ్వాను అధిగమించాడు. వరుసగా అతనికి గరిష్టంగా 11 పాయింట్లు లభించాయి. ఈ విజయంతో, నాగల్ ఇప్పుడు ట్రీస్టేలో వరుసగా ఐదు మ్యాచ్‌లను గెలుచుకున్నాడు.

# డైమండ్ లీగ్‌లో అవినాష్ ఔట్

**న్యూఢిల్లీ:** మొనాకోలో జరిగిన 2025 డైమండ్ లీగ్ మీట్‌లో పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో భారత అథ్లెట్ అవినాష్ సాబుల్ పరుగు పందెంలో పడిపోవడంతో మధ్యలోనే నిష్క్రమించాడు. 30 ఏళ్ల సాబుల్ తన పరుగుకు ఒక నిమిషం కంటే ఎక్కువ సమయం ఉండగా, తన ముందు నడుస్తున్న పోటీదారుని ఎదుర్కొనే ప్రయత్నంలో బ్యాలెన్స్ కోల్పోయి వాటర్ రన్ సమయంలో జారిపడ్డాడు. ఈ పతనం వల్ల ఆసియా ఛాంపియన్ రేసు నుండి వైదొలగాల్సి వచ్చింది, అతని పేరుకు ఎదురుగా దీవీనీ రికార్డ్ అయింది. స్టేడ్ లూయిస్ ॥ స్టేడియంలో ఉన్న వాలంటీర్ల సహాయంతో సేబుల్‌ను ట్రాక్ నుండి కుంటుతూ కనిపించాడు.



రెండుసార్లు ఒలింపిక్ ఛాంపియన్ అయిన మొరాకోకు చెందిన సౌఫియానే ఎల్ బక్కాలి 8:03.18 సెకన్లలో గమ్యాన్ని చేరుకుని రేసును గెలుచుకున్నాడు. ఈ సంవత్సరం మే ప్రారంభంలో జరిగిన 2025 ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సేబుల్ బంగారు పతకాన్ని గెలుచుకున్నప్పటికీ, ఇప్పటివరకు అతను ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శనను కనబరచలేదు. ఈ సంవత్సరం అతను ఇంకా 8:20 సెకన్ల కంటే తక్కువ సమయం తగ్గలేదు మరియు దక్షి ణ కొరియాలోని గుమిలో జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో నమోదు చేసిన 8:20.92 సెకన్ల సీజన్ బెస్ట్‌ను కలిగి ఉన్నాడు. టోక్యోలో 2025 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లు వేగంగా సమీపిస్తున్న తరుణంలో, మొనాకోలో పతనం సేబుల్‌కు మరియు ప్రపంచ వేదికపై భారతదేశం మంచి ప్రదర్శన ఇవ్వాలనే ఆశలకు మరింత ఆటంకం కలిగిస్తుంది.





# ఆసియా కప్ 2025 రద్దు

## కీలక నిర్ణయం దిశగా భారత్, శ్రీలంక

**న్యూఢిల్లీ:** మరో రెండు నెలల్లో జరగాల్సిన ఆసియా కప్-2025 మరింత ఇబ్బందుల్లో పడింది. ఇప్పుడు టోర్నమెంట్ రద్దు అయ్యే అవకాశం ఉంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి, శ్రీలంక క్రికెట్ కీలక అడుగు వేసి జులై 24న ఢాకాలో జరగనున్న ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కాకూడదని నిర్ణయించుకున్నాయి. ఆరు దేశాల అసియా కప్ టోర్నీ ప్రారంభానికి రెండు నెలల కన్నా తక్కువ సమయం మిగిలి ఉన్న నేపధ్యంలో రెండు బోర్డులు ఈ నిర్ణయం తీసుకున్నాయి. సమావేశం ప్రణాళిక ప్రకారం జరుగుతుందని ఐసీసీ ధృవీకరించినప్పటికీ, భారత్, శ్రీలంక లేకపోవడం ఈ టోర్నమెంట్ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తోంది. ఈసారి ఆసియా కప్ టీ20 ఫార్మాట్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 5 నుంచి ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. కానీ అంతకు ముందు, ఈ నెల 24న ఢాకాలో జరగనున్న ఏసీసీ సమావేశంలో బీసీసీ, శ్రీలంక క్రికెట్ పాల్గొనకపోవడం వల్ల టోర్నమెంట్ జరగడంపై ప్రశ్నలు తలెత్తాయి. ఏసీసీ సమావేశం ఢాకాలో జరగడంపై బీసీసీఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ ప్రస్తుతం ఏసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. భారత జట్టు బంగ్లాదేశ్ పర్యటనను నిరవధికంగా వాయిదా వేయాలని బీసీసీఐ ఇటీవల బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)ని ఒప్పించింది. ఈ పర్యటన ఆగస్టులో జరగాల్సి ఉంది. కానీ ఏసీసీ ఢాకాలో తన సమావేశాన్ని నిర్వహించింది, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) హైబ్రిడ్ మోడల్‌పై అంగీకరించిందని, దీని కింద పాకిస్తాన్ వేరే దేశంలో ఏదైనా అంతర్జాతీయ టోర్నమెంట్‌లో భారత్‌తోమ్యాచ్‌లు ఆడుతుందని స్పష్టమవుతోంది. యాదృచ్ఛికంగా బీసీసీఐ, శ్రీలంక క్రికెట్ ఆగస్టులో పరిమిత ఓవర్ల సిరీస్‌ను నిర్వహించాలని యోచిస్తున్నాయి. ఏసీసీ తన అధికారులను ఢాకాకు పంపడానికి బోర్డు నిరాకరించింది. ఆసియా కప్ వాయిదావేస్తే, బీసీసీసీ మరోసిరీస్ నిర్వహించాలని పరిశీలిస్తోంది. ఆసియా కప్ సెప్టెంబర్ 5 నుంచి జరిగే అవకాశం ఉంది. ఆ సమయంలో భారతదేశంతో క్రికెట్ ఆడటానికి శ్రీలంక, ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఆసక్తి చూపుతోంది. ఈ సంవత్సరం పాకిస్తాన్ హాకీ జట్లకు ఆతిథ్యం ఇవ్వడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా క్రికెట్ విషయంలో స్పష్టత రాలేదు. ఏసీసీ శ్రద్ధ చూపకపోతే, బీసీసీఐ కూడా ఆసియా కప్ నుంచి వైదొలగవచ్చు.

ఆర్చరీ ప్రపంచ కప్‌లో..

# సెమీస్‌కు సురేఖ, ఫర్నీత్

## రెండో రౌండ్‌లోనే నిష్క్రమించిన రిషబ్, అమన్



**న్యూఢిల్లీ:** ఈ సీజన్‌లో జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ నాల్గవ దశలో భారత క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ, పర్నీత్ కౌర్ కాంపౌండ్ మహిళల సెమీఫైనల్‌కు చేరారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అగ్రస్థానంలో నిలిచిన జ్యోతి, క్వార్టర్ ఫైనల్‌లో టర్కిష్ ఆర్చర్ హాజల్ బురున్‌ను 147-144 తేడాతో ఓడించి, కొరియాకు చెందిన హాన్ సెంగ్యోన్‌తో ఫైనల్‌ఫోర్ మీట్‌కు సిద్ధమైంది. ఇక పర్నీత్ టర్కీకి చెందిన ఓజ్నూర్ క్యూర్ గిర్దిని 142-141 తేడాతో ఓడించి తన తొలి ప్రపంచ కప్ సెమీఫైనల్‌కు చేరుకుంది. అర్హత రౌండ్‌లో ఆమె 702 పాయింట్లతో తన వ్యక్తిగత అత్యుత్తమ స్కోరు 704 కంటే కేవలం రెండు పాయింట్లు దూరంలో ఉంది. ఇప్పుడు ఆమె మొదటి ప్రపంచ కప్ పోడియంకు రెండు మ్యాచ్‌ల దూరంలో ఉంది. సెమీఫైనల్‌లో కౌర్ ప్రస్తుత యూరోపియన్ ఛాంపియన్ గిబ్సన్‌తో తలపడుతుంది, ఆసియా క్రీడల ఛాంపియన్ మరియు సహచరురాలు జ్యోతి లేదా అంటాల్య రన్నరప్ హాన్‌గ్యోన్‌తో ఫైనల్ (లేదా కాంస్య ఫైనల్)లో తలపడుతుంది. పురుషుల వ్యక్తిగత ఈవెంట్‌లో టాప్ సీడ్ రిషబ్ యాదవ్, అమన్ సైని, ప్రియాంష్ అందరూ రెండో రౌండ్‌లోనే నిష్క్రమించగా, ప్రథమేష్ బాలచంద్ర ఫుగే తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. రికర్వ్ ఆర్చరీలో, పురుషులు మరియు మహిళల జట్లు తమ తొలి రౌండ్‌లోనే నిరాశపరిచాయి. నాల్గవ సీడింగ్ కారణంగా రెండవ రౌండ్ నుండి తమ ప్రచారాన్ని ప్రారంభించిన అంకితా భకత్, దీపికా కుమారి మరియు 15 ఏళ్ల అరంగేట్రం క్రీడాకారిణి గతా ఖడకేలతో కూడిన మహిళల త్రయం ఫ్రాన్స్ చేతిలో 35 తేడాతో ఓడిపోయింది. పురుషుల త్రయం ధీరజ్ బొమ్మదేవర, రాహుల్ సింగ్ మరియు నీరజ్ చౌహాన్ బ్రెజిల్ చేతిలో 26 తేడాతో ఓడిపోయారు.





# ఐఫోన్17 తయారీ భారత్‌లోనే!

### ఇప్పటికే చైనా నుంచి విడిభాగాల దిగుమతి

**ముంబయి, జూలై 12:** ఆపిల్ ఐఫోన్17 తయారీ భారత్‌లో రెడీ అవుతోంది. ఇందుకు సంబంధించిన విడిభాగాలను ఐఫోన్‌లు తయారు చేసే ఫాక్స్‌కాన్ కంపెనీ ఇప్పటికే దిగుమతి చేసుకుంది. చైనా నుంచి ఫాక్స్‌కాన్ దిగుమతి చేసుకున్న విడిభాగాలను చూస్తే కస్టమ్స్ రికార్డుల్లో పదిశాతం ఐఫోన్ 17 విడిభాగాలే ఉన్నాయి. ఐఫోన్14, ఐఫోన్16 మోడళ్లకు సంబంధించిన విడిభాగాలతో పాటు ఐఫోన్ 17 భాగాలు కూడా ఉన్నట్లు తేలింది. అలాగే ఉత్పత్తిని పెంచడంతోపాటు ఐఫోన్ 17 తయారీ ఈనెలలోనే ప్రారంభం అవుతుంది. భారీస్థాయిలో ఉత్పత్తిని మాత్రం ఆగస్టు మొదటి వారం నుంచే ప్రారంభిస్తుంది. మొత్తంగాచూస్తే అధికారికంగా సెప్టెంబరులోనే ఐఫోన్17 లాంచ్ చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్లు అంచనా. అటు చైనా, ఇటు భారత్ రెండు దేశాల్లోను ఐఫోన్17ను ఉత్పత్తి చేయాలని ఆపిల్ సంస్థ భావిస్తోంది. వాస్తవానికి ఆపిల్ కంపెనీ చైనా తయారీ ఐఫోన్ల కంటే భారత్‌లో తయారయ్యే ఐఫోన్లనే అమెరికా మార్కెట్ కు తరలించాలని యోచిస్తోంది. 2026 నాటికల్లా అమెరికా మార్కెట్‌లో భారత్ తయారీ ఐఫోన్లు ఉంటాయని అంచనా. గడచిన కొన్నేళ్లుగా ఆపిల్ కంపెనీ చైనా, భారత్ యూనిట్లలోనే ఉత్పత్తి అవుతున్నాయి. ఐఫోన్ 14 భారత్‌లో అయితే చైనాలో తయారయిన ఆరువారాల తర్వాత ప్రారంభం అవుతుంది. అయితేఐఫోన్15 మాత్రం ఏకకాలంలో రెండుదేశాల్లోను తయారయ్యాయి. తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ ఆపిల్ కంపెనీ అతిపెద్ద తయారీదారుగా నిలిచింది. భారత్‌ల బెంగళూరులో అతిపెద్ద అసెంబ్లింగ్ యూనిట్‌ను ఏర్పాటుచేసింది. చైనాలో తన ఉత్పత్తిని మరింత పటిష్టం చేయడంతో బెంగళూరు యూనిట్‌లో సిబ్బందిని కుదిస్తోంది. చైనా కస్టమ్స్‌పరంగా కొన్ని ఆంక్షలవల్ల కీలక విడిభాగాలు దిగుమతులకు ఆటంకం కలగుతున్నది. దీనివల్ల భారత్ తయారీలో ఐఫోన్17కు జాప్యం జరిగే అవకాశంలేకుండా ఈ సారి ముందస్తు వ్యూహంతోనే విడిభాగాలను దిగుమతి చేసుకుంది. దీనితో ఈనెల చివరినుంచే ఐఫోన్17 తయారీ సెప్టెంబర్‌లో లాంచింగ్ జరిపే విధంగా ఆపిల్ సన్నాహాలు చేస్తోంది.




# వాణిజ్యం


# మెర్సిడెస్ బెంజ్ అమ్మకాల జోరు

**ముంబై, జులై 12:** మెర్సిడెస్ బెంజ్ ఇండియా 2025 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 4,238 యూనిట్లకు విక్రయించినట్లు కంపెనీ తెలిపింది. ఇది గత సంవత్సరం కంటే 10శాతం వృద్ధి చెందింది. కోర్, టాప్-ఎండ్ లగ్జరీ వాహనాలకు బలమైన డిమాండ్‌తో మొదటి త్రైమాసికం 2026లో అత్యుత్తమ అమ్మకాల పనితీరు సాధించబడింది. ఈ అమ్మకాల ఊపు టాప్-ఎండ్ లగ్జరీ బిఇవి పోర్ట్‌ఫోలియోలో బలమైన త్వరణం ద్వారా కూడా నడపబడింది. ఇది మొత్తం అమ్మకాల పరిమాణంలో దాని వ్యాప్తిని పెంచింది అని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. విక్రయ ప్రవేశ విభాగంలో ధరల సవాళ్లతో సహా విదేశీ ఫోరెన్సి హెచ్చుతగ్గులు, ధరల పెరుగుదల, మార్కెట్ డైనమిక్స్ వంటి సూక్ష్మ-ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ రికార్డు అమ్మకాల పనితీరు సాధించబడిందని వెల్లడించింది. టాప్-ఎండ్ లగ్జరీని బలోపేత చేయడంపై మా పదునైన దృష్టి కస్టమర్ ప్రాధాన్యతలను ప్రభావితం చేయడంలో, మెర్సిడెస్ బెంజ్‌ను భారత దేశంలో అత్యంత లగ్జరీ బ్రాండ్‌గా విభిన్నంగా మార్చడంలో విజయవంతమైంది అని మెర్సిడెస్-బెంజ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్‌అండ్ సిఇఒ సంతోష్ అయ్యర్ అన్నారు. కంపెనీ తన బెస్ట్ సెల్లింగ్ లగ్జరీ ఎస్‌యువిలలో ఒకదానికి స్పోర్టీ డైనమిక్ క్యారెక్టర్‌ను అందిస్తూ జిఎల్ఎస్ ఎఎంజి లైన్ లగ్జరీ ఎస్‌యువిని ప్రారంభించినట్లు కూడా ప్రకటించింది.




# వచ్చే వారం 127 కంపెనీల త్రైమాసిక ఫలితాలు..

**ముంబై, జులై 12:** వచ్చే వారం దాదాపు 127 కంపెనీలు తమ మొదటి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించనున్నాయి. ఈ కంపెనీలు 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఆదాయాలను సమీక్షించి ఆమోదించడానికి తమ బోర్డు సమావేశాలను నిర్వహిస్తాయి. ఈ కంపెనీలు ఫైనాన్స్, మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీతో సహా వివిధ రంగాలకు చెందినవి. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీసంస్థ ఓలా ఎలక్ట్రిక్, అగ్రశ్రేణి రుణదాతలు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకుల ఫలితాలను కూడా నిశితంగా పరిశీలిస్తారు. టాటా గ్రూప్ సంస్థలు టాటా టెక్నాలజీస్, టాటా కమ్యూనికేషన్స్ కూడా ఈ వారం ఆదాయాలను ప్రకటించనున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి కంపెనీ ఆర్థిక ఫలితాలను జులై 18న ప్రకటించనుంది. జులై 14న ఆటమ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, బెనారస్ హోటల్స్ లిమిటెడ్, సెటాడెల్ రియాల్టీ అండ్ డెవలపర్స్ లిమిటెడ్, భవానీ కేబుల్ టెల్ అండ్ డేటాకామ్ లిమిటెడ్, ఇన్ఫోమీడియా ప్రెస్ లిమిటెడ్, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్, రాయల్ ఇండియా కార్పొరేషన్ లిమిటెడ్, సంభవ్ స్టీల్ ట్యూబ్స్ లిమిటెడ్, టాటా టెక్నాలజీస్ లిమిటెడ్, తేజస్ నెట్‌వర్క్స్ లిమిటెడ్, షార్ప్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్, స్పేస్ ఇంక్యుబాట్రిక్స్ టెక్నాలజీస్ లిమిటెడ్, శ్రీ స్టీల్ వైర్ రోప్స్ లిమిటెడ్, ఆర్‌జిఎఫ్ కేపిటల్. జులై 15న జియోజిత్ ఫైనాన్షియల్ హెచ్‌డిబి ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ ఇన్సూరెన్స్, ఐసిఐసిఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్. జులై 16న ఏంజెల్ వన్ లిమిటెడ్, డి.బి.కార్ప్ లిమిటెడ్, ఐటిసి హోటల్స్ లిమిటెడ్. జులై 17న హెచ్‌డిఎఫ్‌సి అసెట్ మేనేజ్‌మెంట్, హెరిటేజ్ ఫుడ్స్, ఇండియన్ హోటల్స్, జియోఫైనాన్షియల్, పాలీక్యాబ్ ఇండియా, షాపర్స్ స్టాప్ లిమిటెడ్, సౌత్ ఇండియన్ బ్యాంకు. జులై 18న ఎఎస్‌ఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఎల్‌అండ్‌టిఫైనాన్స్, మహీంద్రా ఇపిసి ఇరిగేషన్, మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్. జులై 19న ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు లిమిటెడ్, ఇండియా సిమెంట్స్ లిమిటెడ్, జెకె సిమెంట్ లిమిటెడ్, శేషసాయి పేపర్ అండ్ బోర్డ్స్ లిమిటెడ్ వంటి తదితర సంస్థలు ఫలితాలను వెల్లడించనున్నాయి.




# 'ఎక్స్' ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌పై భారీ తగ్గింపు

**వాషింగ్టన్, జులై 12:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన సామాజిక మాధ్యమం ఎక్స్ భారత్‌లోని యూజర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. దేశంలో ఎక్కువ మంది యూజర్లకు చేరువయ్యేందుకు ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను భారీగా 48శాతం తగ్గిస్తున్నట్లు తన నిర్ణయాన్ని ప్రకటించింది. భారత్‌లోని యూజర్లకు ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ కోసం ఇప్పటివరకు నెలకు రూ.900 వసూలు చేయగా.. దానిని రూ.470కి తగ్గించింది. ప్రీమియం సబ్‌స్క్రిప్షన్‌ను తీసుకున్న వినియోగదారులు బ్లూటిక్ పొందడం సహా సుదీర్ఘ పోస్టులు చేసుకోవడానికి సంస్థ వీలు కల్పిస్తోంది. వెబ్ మోడ్‌లో ఎక్స్‌ను వినియోగించే వారికి ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ కూడా ఇప్పుడు రూ.650 నుంచి నెలకు రూ.427కి తగ్గించింది. నెలవారీ బేసిక్ సబ్‌స్క్రిప్షన్ ఛార్జీలను రూ.243.75 నుంచి రూ.170కి దాదాపు 30 శాతం తగ్గించింది. బేసిక్ వినియోగదారుల వార్షిక సబ్‌స్క్రిప్షన్‌లను కూడా రూ.2,590.48 నుంచి రూ.1,700 తగ్గించినట్లు ఎక్స్ వెల్లడించింది. తన ప్లాట్‌ఫామ్ ఆదాయాన్ని పెంచుకొనేందుకు ఎక్స్ 2023 అక్టోబర్‌లో తొలి సారి ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకొచ్చింది. యాడ్ ఫ్రీ ఎక్స్‌పీరియన్స్, సుదీర్ఘ ఆర్టికల్స్ రాసే సౌలభ్యం, సూపర్‌గ్రోక్, గ్రోక్ 4 వంటి ఎఐ ఫీచర్ వంటి ప్రత్యేక యాక్సెస్‌ను ఇది వినియోగదారులకు అందిస్తోంది. ఈ ప్లాన్‌ను కూడా తాజాగా రూ.3,470 నుంచి రూ.2,570కి తగ్గించినట్లు ఎక్స్ వెల్లడించింది. మొబైల్‌లో ప్రీమియం ప్లస్ ప్లాన్‌ను వినియోగించే వారికి గతంలో నెలకు రూ.5,100 ఖర్చు అవుతుండగా, ప్రస్తుత తగ్గింపుతో కేవలం రూ.3,000లకే అందుబాటులోకి వస్తోంది.



# సావరిన్ ఫండ్స్ పెట్టుబడుల తేదీ పొడిగింపు

**న్యూఢిల్లీ, జులై 12:** ఆర్థిక చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత బడ్జెట్ ప్రకటనను అమలు చేయడానికి, పన్ను మినహాయింపులను పొందడానికి 40 సావరిన్ వెల్త్ ఫండ్స్ (ఎస్‌డబ్ల్యూఎఫ్‌లు), పెన్షన్ ఫండ్స్ (పిఎఫ్‌లు) పెట్టుబడి పెట్టే తేదీని మరో ఐదు సంవత్సరాలు పొడిగిస్తున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. ఇంతకు ముందు ఈ మినహాయింపు మార్చి 31, 2025న ముగిసింది. కానీ ఇప్పుడు మార్చి 31, 2030 వరకు చేసిన పెట్టుబడిపై వచ్చే ఆదాయానికి ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది. ప్రయోజనం పొందే నిధులలో ఎంఐసి రెడ్‌వుడ్ 1 ఆర్‌ఎస్‌సి లిమిటెడ్ అబుదాబి, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ఎస్‌డబ్ల్యూఎఫ్, డాగెన్‌హామ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, సింగపూర్‌కు చెందిన ఎస్‌డబ్ల్యూఎఫ్, ఎఐఎంసిఒ ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్, కైస్సే డి డిపోట్ ఎట్ ప్లేస్‌మెంట్ డు క్యూబెక్, బ్రిక్లేయర్స్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, డాగెన్‌హామ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ నార్ఫండ్, నార్వే ప్రభుత్వంతో పాటు ఇతరులు ఉన్నారు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 10లోని క్లాజ్ (23ఎఫ్ఇ) డివిడెండ్, వడ్డీ, దీర్ఘకాలిక మూలధన లాభాలు, భారతదేశంలో చేసిన పెట్టుబడి నుంచి ఉత్పన్నమయ్యే కొన్ని ఇతర ఆదాయంలో పేర్కొన్న వ్యక్తులకు ఆదాయం నుంచి మినహాయింపును అందిస్తుంది. నిర్దిష్ట వ్యక్తులలో ఎస్‌డబ్ల్యూఎఫ్, పిఎఫ్ ఉన్నాయి. ఇవి కొన్ని షరతులను నెరవేరుస్తాయి. కేంద్ర ప్రభుత్వం ద్వారా తెలియచేయబడతాయి. అటువంటి షరతు ప్రకారం, పేర్కొన్న పెట్టుబడి చేసిన తేదీ నుంచి ప్రారంభమై గడువు తేదీలోపు అటువంటి పెట్టుబడిని రద్దు చేసిన తేదీ వరకు గడువులోని అన్ని సంబంధిత మునుపటి సంవత్సరాలకు అసెస్సీ ఆదాయ రిటర్న్ దాఖలు చేయాలి. మరొక షరతు ప్రకారం అంచనాదారుడు భారతదేశం లోపల లేదా వెలుపల ఇలాంటి స్వభావం గల పెట్టుబడి తప్ప మరే ఇతర వాణిజ్య కార్యకలాపాలను చేపట్టకూడదు.



# ఐపిఒకు ఇన్‌ఫ్రా సామగ్రి లీజింగ్ కంపెనీ

**ముంబై, జులై 12:** ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరికరాలను అద్దెకిచ్చే అగ్‌కాన్ ఎక్విప్‌మెంట్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు అనుగుణంగా కేపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలుచేసింది. ఐపిఒలో భాగంగా రూ.332కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా కంపెనీ ప్రమోటర్లు 94 లక్షల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ.168 కోట్లు రుణ చెల్లింపులకు, రూ.84 కోట్లు పరికరాల కొనుగోళ్లకు, మరికొన్ని నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 2003లోఏర్పాటైన హర్యానా కంపెనీ ప్రధానంగా మౌలిక రంగ కంపెనీలకు పరిశ్రమ సంబంధిత పరికరాలను అద్దె ప్రాతిపదికన సమకూర్చుతుంది. గతేడాది ఆదాయం 20శాతం పెరిగి రూ.164 కోట్లకు చేరగా, నికర లాభం 36శాతం పెరిగి రూ.31 కోట్లకు చేరింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.